



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 8 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ఆదివారం 28 సెప్టెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


# బాలకృష్ణ VS చిరంజీవి

రంగంలోకి ముఖ్య నేతలు- కీలక మలుపు..!?

**అమరావతి, విశ్వం వాయిస్ బ్యూరో చీఫ్ న్యూస్**

మెగా బ్రదర్స్ ఎందుకు మౌనంగా ఉన్నారు. బాలకృష్ణ %ఎం% చిరంజీవి ఎపిసోడ్ ఇప్పుడు కొత్త మలుపు తీసుకుంటోంది. అసెంబ్లీ వేదికగా బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు. చిరంజీవి స్పందనతో ఇప్పుడు ఈ వ్యవహారం సినీ – పొలిటికల్ వివాదంగా మారుతోంది. వైసీపీ నేతలు ఈ ఎపిసోడ్ ను తమకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ వివాదంలో - మిగతా2లో











## కాల్పబేరానికి వచ్చిందనే కనికరించాం!

- 'సిందూర్' కాల్పుల విరమణలో మూడో వ్యక్తి ప్రమేయం లేదు
- భారత దాడుల్లో భారీ నష్టం జరగడంతో పాకిస్తాన్‌కు తత్వం బోధపడింది
- అయినా పాకిస్తాన్‌దే విజయమని షెహబాజ్ షరీఫ్ చెప్పుకుంటున్నారు
- ధ్వంసమైన రన్‌వేలు, కాలిపోయిన హ్యాంగర్లు విజయంగా కనిపిస్తున్నాయా?
- ఉగ్రవాద కేంద్రాలను మూసివేసి, ముష్కరులను అప్పగిస్తేనే పాక్‌తో చర్చలు
- ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో పాక్ వాదనను తిప్పికొట్టిన భారత్

5లో



## ఇక స్వదేశీ 4జీ!

- స్వదేశీ టెక్నాలజీతో బీఎస్ఎన్ఎల్ సేవలు
- ఒడిశాలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- 37,500 కోట్లతో 97,500 మొబైల్ టవర్లు
- ప్రధాని మోదీ కలలకు ప్రతిరూపమైన డిజిటల్ ఇండియా లక్ష్య సాధనలో ఇదొక మైలురాయి

## సాంకేతిక రంగంలో భారత్ పరుగులు

- జనవరిలో అమరావతికి క్వాంటమ్ కంప్యూటర్
- రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీల నిర్మాణం
- దేశ దశ, దిశ మార్చిన బీఎస్ఎన్ఎల్
- సృజనాత్మకతకు మాతృసంస్థగా ఉండాలి
- 4జీ టవర్ల ప్రారంభోత్సవ సభలో సీఎం చంద్రబాబు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

"క్వాంటమ్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన తర్వాత మొదటి క్వాంటమ్ మిషన్‌ను ప్రధాని మోదీ తీసుకొచ్చారు. వచ్చే ఏడాది జనవరిలో మొదటి క్వాంటమ్ కంప్యూటర్ అమరావతికి వస్తుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. సైబర్ సెక్యూరిటీ, సేఫ్టీకి క్వాంటమ్ కంప్యూటర్ చాలా అవసరమని అన్నారు. బీఎస్ఎన్ఎల్ రజతోత్సవం సందర్భంగా శనివారం విజయవాడలో 4జీ టవర్లను జాతికి అంకితం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రబా బు మాట్లాడుతూ... రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ, స్పేస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీని ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. 30 ఏళ్లలో చేసే - మిగతా2లో



## విద్యుత్ చార్జీల్లో భారీ ఊరట

- తొలిసారి తగ్గనున్న ట్రూఅప్ భారం.. 923 కోట్లు వినియోగదారులకు చెల్లింపు
- 2024-25లో వినియోగించిన యూనిట్‌కు 13 పైసలు చొప్పున వెనక్కి
- నవంబరు నుంచి వచ్చే ఏడాది అక్టోబరు వరకు నెలవారీ బిల్లుల్లో సర్దుబాటు
- విద్యుత్తు కొనుగోళ్ల ఖర్చులు తగ్గిన ఫలితం
- ఇక నుంచి ట్రూడౌన్
- వైసీపీ హయాంలో అడ్డగోలుగా విద్యుత్తు కొనుగోళ్లు
- వాటిని కట్టడి చేసిన కూటమి ప్రభుత్వం
- త్వరలో మరో రూ.1059.75 కోట్లు ట్రూడౌన్

2లో

# కన్నీటి కరూర్

**తొక్కిసలాటలో 38 మంది దుర్మరణం.. వందమందికి పైగా క్షతగాత్రులు**



- తమిళనాడు కరూర్‌లో టీవీకే ప్రచార సభ.. ఉదయం నుంచే జనం పడిగాపులు
- నాలుగు గంటలు ఆలస్యంగా వచ్చిన విజయ్.. ఇరుకు రోడ్డులో కిక్కిరిసిన జనం
- సభ ముగియగానే అదుపుతప్పిన పరిస్థితి.. ఒకరిమీద ఒకరు పడి తొక్కిసలాట
- హుటాహుటిన కరూర్ చేరుకున్న సీఎం స్టాలిన్.. హైకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

తమిళనాట పెను విషాదం చోటుచేసుకుంది. ఒక రాజకీయ సభ... మృత్యు వేదికగా మారింది. తమిళ సినీ నటుడు, తమిళ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ శనివారం కరూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో మరణ మృదంగం మోగింది. లెక్కకు మిక్కిలిగా జనం తరలివచ్చారు. దారులు మొత్తం కిక్కిరిసిపోయాయి. పరిస్థితి అదుపు తప్పి... తొక్కిసలాటకు దారి తీసింది. అధికార వర్గాలు అందించిన సమాచారం ప్రకారం... ఈ విషాదంలో 38 మంది మరణించారు. వంద మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఏడుగురు పిల్లలు, 17 మంది వరకు మహిళలు ఉన్నారు. 12మంది పరిస్థితి విషమంగా ఉందని... మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని తెలుస్తోంది. తమిళ నటుడు విజయ్ టీవీకే పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ప్రచారం ప్రారంభించారు. గత మూడు వారాలుగా ప్రతి శని, ఆదివారాల్లో - మిగతా5లో

## ప్రపంచ ఉగ్రవాద కేంద్రం పాకిస్థాన్

- విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్
- ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించరాదు
- ఉగ్రవాదులకు ఆర్థిక సాయం అందకుండా చూడాలి

5లో

# తీరం దాటిన వాయుగుండం

- 1న మరో అల్పపీడనం..
- కృష్ణా, గోదావరికి పెరిగిన వరద
- మొదటి హెచ్చరిక జారీ.. ఏలూరు జిల్లాలో 23 గ్రామాలకు నిలిచిన రాకపోకలు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం శనివారం తెల్లవారుజామున ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపాన తీరం దాటింది. అనంతరం పశ్చిమంగా పయనించి మధ్యాహ్నానికి ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా, దక్షిణ ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో కేంద్రీకృతమై ఉంది. ఇది ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వైపు పయనించి ఆదివారం ఉదయానికి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడనుంది. ఆ తర్వాత పశ్చిమంగా పయనించి గుజరాత్‌కు ఆనుకుని అరేబియా సముద్రంలోకి ప్రవేశించనుంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. కోస్తా వెంబడి - మిగతా2లో

# సాంకేతిక రంగంలో భారత్ పరుగులు

-మొదటిపేజీ తరువాయి

అభివృద్ధిని రాబోయే పదేళ్లలో చేయబోతున్నామని తెలిపారు. 1995లో తాను సీఎం అయినప్పుడు నాలెడ్జ్ ఎకానమీకి ఐటీ వెన్నెముక అని గుర్తించానన్నారు. ఐటీని ప్రోత్సహించడానికి హైటెక్ సిటీ నిర్మించానన్నారు. "ప్రధానిగా వాజ్‌పేయి ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన కమిటీ టెలికంలో నూతన మార్పులకు కారణమైంది. దీనితో బీఎస్ఎన్ఎల్ శక్తిమంతమైన సంస్థగా తయారైంది. ఐటీ అంటేనే ఇండియా. ప్రపంచంలో భారతీయులు శక్తిమంతులుగా తయారు కావడానికి ఐటీ కారణం. కోవిడ్ సమయంలో 100 దేశాలకు భారత్ వ్యాక్సిన్ సరఫరా చేసింది. మన దేశంలో రూపొందించిన యూపీఐ యాప్‌ను ఫ్రాన్స్, సింగపూర్ దేశాలు దత్తత తీసుకున్నాయి. ఒకప్పుడు ఇతర దేశాల ఉత్పత్తులను మనం వాడేవాళ్లం. ఇప్పుడు మన ఉత్పత్తులను ఇతర దేశాలు వాడుకుంటున్నాయి. 1997 మార్చి నాటితో పోలిస్తే రెండు దశాబ్దాల తర్వాత బీఎస‌ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య ఒక బిలియన్‌ను దాటింది. హార్డ్‌గా కాకుండా సాఫ్ట్‌గా పనిచేయాలి. ప్రజలు పలు ధ్రువీకరణ పత్రాల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరిగేవారు. ఇప్పుడు 737 సేవలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఇస్తున్నాం. దీనికి కారణం 4జీనే. 4జీ సేవలు 1995 నాటి నా కల. దేశంలో ఏడాదికి 30 కోట్ల ఫోన్లు తయారు చేస్తున్నాం. 2025–26 ఆర్థిక సంవత్సరంలో తయారీ 50 శాతం పెరిగింది. ఒకప్పుడు ఇతర దేశాల్లో తయారైన ఫోన్లను వాడేవాళ్లం. త్వరలోనే దేశం మొత్తం మేక్ ఇన్ ఇండియా ఫోన్లను ఉపయోగించే పరిస్థితులు వస్తాయి. రాష్ట్రంలో 22 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉన్నారు. 14.70 లక్షల మందికి ఫోన్లు ఉన్నాయి. వారిలో 14 లక్షల మందికి స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి" అని చంద్రబాబు అన్నారు.

**ప్రతి పదేళ్లకూ టెక్నాలజీ అప్‌గ్రేడ్**

"ప్రపంచానికి భారత్ టెక్నాలజీని అందజేసే పరిస్థితి భవిష్యత్తులో వస్తుంది. 4జీ వచ్చిన తర్వాత మిగిలీ జీలన్నీ సులువుగా మారాయి. 2010లో 4జీ, 2020లో 5జీ, 2030లో 6జీ.. ఇలా ఏది కావాలన్నా మనవాళ్లు సులువుగా తయారు చేసే పరిస్థితి. 4జీలో మొదట బీఎస్ఎన్ఎల్ విఫలం కావడంతో 10 లక్షల మంది వినియోగదారులను కోల్పోయింది. తర్వాత ఒక లక్ష, ఒక మిలియన్ నుంచి ఇప్పుడు 22 మిలియన్ల వినియోగదారులను బీఎస్ఎన్ఎల్ సంపాదించుకుంది. ప్రతి పదేళ్లకు ఒకసారి టెక్నాలజీ అప్‌గ్రేడ్ అవుతోంది. టెక్నాలజీని అప్‌గ్రేడ్ చేయడం వల్ల బీఎస్ఎన్ఎల్ మనుగడ సాగిస్తోంది. రిలయన్స్ ఇన్ఫోకం ఆ పని చేయలేకపోవడం వల్ల ఆ సంస్థ మనుగడ సాగించలేకపోయింది. బీఎస్ఎన్ఎల్ దేశానికి దశ, దిశ నిర్దేశించే పరిస్థితికి వచ్చింది. అసలు బీఎస్ఎన్ఎల్ సంస్థ ఉంటుందా అన్న అనుమానం ఒకప్పుడు ఉండేది. ఈ సంస్థ సృజనాత్మకతకు మాతృసంస్థగా తయారు కావాలి. ప్రైవేటు కంపెనీలు ఎప్పుడూ లాభాలు చూసుకుంటాయి. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజలకు సేవ చేస్తాయి. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు, వరదలకు సంబంధించిన సమాచారాన్ని సెన్సార్ల ద్వారా తెలుసుకుని ఏఐ ద్వారా ప్రజలకు సమాచారం ఇస్తున్నాం. స్మార్ట్ ఫోన్లలో ఇతర దేశాలు తయారు చేసిన 24 శాతం యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటున్నాం. వాటి ద్వారా 95% ఆదాయాన్ని వారు తీసుకుని, 5% మనకు ఇస్తున్నారు. ఈ యాప్‌లను స్వదేశంలో తయారు చేసుకుంటే 100% డబ్బులు మన వద్దే ఉంటాయి. 2047 నాటికి భారత్ ప్రపంచంలో నంబర్ వన్‌గా ఉంటుంది" అని చంద్రబాబు అన్నారు.

**ఫోన్ల తయారీలో భారత్ రెండో స్థానం: పెమ్మసాని**

"వాజ్‌పేయి ప్రధాని అయ్యే నాటికి బీఎస‌ఎన్ఎల్‌కు ఏటా రూ.6 వేల కోట్ల నికరలాభం ఉండేది. 2.50 లక్షల మంది ఉద్యోగులు ఉండేవారు. 2004లో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన 2జీ స్కాంల వల్ల బీఎస్ఎన్ఎల్ సంస్థ కిందికి దిగజారింది. 2014 తర్వాత ప్రణాళికాబద్ధంగా డిజిటల్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాల వల్ల బీఎస్ఎన్ఎల్ రూపురేఖలు మారుతున్నాయి. రూ.25 కోట్ల మందికి ఆనాడు బ్రాండ్‌బ్యాండ్ కనెక్షన్లు ఉండేవి. ఇప్పుడు 100 కోట్ల మంది బ్రాండ్‌బ్యాండ్ ఉపయోగిస్తున్నారు. 2014–15 మధ్య దేశంలో 60 లక్షల ఫోన్లు తయారయ్యేవి. నేడు ఆ సంఖ్య 33 కోట్లకు చేరింది. ఫోన్ల తయారీలో దేశం ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది" అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

**4జీ వెలుగు రేఖ: వివేక్‌బాంజల్**

"4జీ ప్రజల జీవితాల్లో ఒక వెలుగు రేఖగా ఉంటుంది. స్వదేశీ పరిజ్ఞానంతో ప్రపంచంలో 4జీ టెక్నాలజీని రూపొందించుకున్న దేశాల్లో భారత్‌ది ఐదో స్థానం. 93 వేల టవర్లు దేశంలో ఉన్నాయి. 14 వేల టవర్లు మారుమూల గ్రామాల్లో ఉన్నాయి. రాష్ట్రంలో 6 వేల 4జీ టవర్లు ఉన్నాయి. 1200 టవర్లు 600 మారుమూల గ్రామాల్లో ఉన్నాయి. స్వర్ణాంధ్ర–2047 కలను సాకారం చేయడానికి బీఎస్ఎన్ఎల్ రాష్ట్ర సర్కిల్ సిద్ధంగా ఉంది" అని బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ వివేక్‌బాంజల్ వివరించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, రాజ్యసభ ఎంపీ కనకమేడల రవీంద్ర, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, బీఎస్ఎన్ఎల్ సీజీఎం శేషాచలం, సీడాట్ సీఈవో ఆర్కే ఉపాధ్యాయ, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, బొండా ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**మారుమూలకూ 4జీ సేవలు: సత్యకుమార్**

"మారుమూల ప్రాంతాలకు నిరంతరాయంగా టెలికం సేవలు అందడానికి 4జీ సేవలను తీసుకురావడానికి ప్రధాని మోదీ చేసిన ప్రయత్నం మంచి ఫలితాలను ఇచ్చింది. 2014 నాటికి 27 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 97 కోట్లకు చేరింది. మొబైల్ కనెక్షన్లు 112 కోట్లు ఉండగా, వాటిలో 97 కోట్ల వరకు స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. 2014లో ఒక జీబీ డేటా రూ.325 ఉండేది. ఇప్పుడు దాని ఖరీదు రూ.9.34. ఒక్కో జీబీపై రూ.298.64 తగ్గించారు" అని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

# హామీలిచ్చాం.. అమలు చేశాం

-మొదటిపేజీ తరువాయి

ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో చెప్పినవన్నీ నేడు చేసి చూపిస్తున్నామన్నారు. మరే ఇతర రాష్ట్రంలో లేనివిధంగా ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెద్ద ఎత్తున పెన్షన్లు ఇస్తున్నామని చెప్పారు. నెలకు రూ.2,745 కోట్లను ఖర్చు చేస్తున్నామని, మొత్తంగా 63.50 లక్షల మందికి పెన్షన్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పెన్షన్లకు ఏడాదికి రూ.32,143 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని, తెలంగాణలో రూ.8,179 కోట్లు, కేరళలో రూ.7,295 కోట్లు పెన్షన్ల కింద ఖర్చు పెడుతున్నాయని.. ఏపీలో ఇచ్చే మొత్తంతో పోలిస్తే పావు వంతు ఇస్తున్నాయని అన్నారు. ప్రతి నెలా ఇచ్చే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు ఎంతో ఆలోచించి పేదల సేవలో అని పేరు పెట్టామని సీఎం తెలిపారు.

**ఉద్యోగాల కల్పనకు మొదటి ప్రాధాన్యం**

"రాష్ట్రంలోని యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 4,71,574 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం. ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇస్తుంది. ఇప్పుడు 204 అన్న క్యాంటీన్లు ఉన్నాయి. త్వరలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా 70 క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నాం" అని చెప్పారు. "యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ప్రజలందరికీ ఆరోగ్య బీమా కల్పించే విధానానికి శ్రీకారం చుట్టాం. 1.63 కోట్ల మంది పేదలకు రూ.25 లక్షల వరకు ఉచితంగా చికిత్సలు అందించేలా పాలసీ రూపొందించాం. వచ్చే జూన్ నాటికి 6.15 లక్షల ఇళ్లను అందుబాటులోకి తెస్తాం. 2029 నాటికి ప్రతి ఒక్కరికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.

**పేదల కోసమే నిత్యం ఆలోచన..**

ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి ఆటో, క్యాబ్ డైవర్లు అర్హులు. ఊపిరి ఉన్నంతకాలం పేదల కోసమే పనిచేస్తాను. పేదల కోసమే నిత్యం ఆలోచన చేస్తున్నా. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడం, నంబర్ వన్‌గా చేయడానికి పనిచేస్తున్నాను. అలాగే ఎమ్మెల్యేలూ పనిచేయాలి. మేనిఫెస్టో హామీలు చాలా వరకు అమలు చేశాం. రైల్వే జోన్ ఏర్పాటయ్యేలా చూశాం. ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలు ఇస్తున్నాం. ఆర్థిక అసమానతలు తగ్గించడానికి పీ–4 వేదిక కానుంది" అని చంద్రబాబు అన్నారు.

**లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం**

"డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను బలోపేతం చేశాం. డ్వాక్రా మహిళలు పెద్దఎత్తున డబ్బులు పొదుపు చేస్తున్నారు. చాలా పరిశ్రమలు, చాలా మంది అప్పులు తీసుకుని ఎన్‌పీఏలుగా మారుతున్నారు. కానీ డ్వాక్రా సంఘాలు మాత్రం తీసుకున్న అప్పులను కచ్చితంగా తిరిగి చెల్లిస్తున్నారు. లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. తయారు చేసే బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి. ప్రతి ఎమ్మెల్యే వెయ్యి మంది మహిళలను గుర్తించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా కృషి చేయాలి" అని అన్నారు.

**అన్నదాత సుఖీభవ**

"రైతు కుటుంబం నుంచి వచ్చాను. రైతులను ఆదుకునే బ్షధ్యతను తీసుకున్నందుకు సంతోషంగా ఉంది. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చాం. గత ప్రభుత్వం రాష్ట్ర వాటా కింద రూ.7500 ఇస్తే.. కూటమి ప్రభుత్వం రూ.14 వేలు ఇస్తోంది. మూడు విడతల్లో ఈ పథకాన్ని పీఎం కిసాన్‌తో జోడించి ఇస్తున్నాం. ఇప్పటి వరకు 46.86 లక్షల మంది రైతులకు 3,174 కోట్లను అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకం ద్వారా అందచేశాం. ఇదే కాకుండా.. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, స్పెషల్ ప్యాకేజీలు ఇస్తున్నాం. 1.34 లక్షల మంది రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌ను సబ్సిడీపై అందిస్తున్నాం" అని అన్నారు.

**స్త్రీ శక్తి పథకం**

"స్త్రీశక్తి పథకం ద్వారా ఇప్పటి వరకు మహిళలు 8.86 కోట్లసార్లు ఉచిత ప్రయాణాలు చేశారు. స్త్రీశక్తి వల్ల ఆర్టీసీ ఆక్యుపెన్సీ పెరిగింది. ఉచిత బస్సు స్కీమ్‌కు ఏడాదికి 2,963కోట్లు ప్రభుత్వం భరిస్తోంది. ఇది నాకు చాలా సంతృప్తినిచ్చిన పథకం. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఈ పథకాన్ని సమర్థంతంగా అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న 97 శాతం మందికి స్త్రీశక్తి పథకం గురించి తెలుసు. 85 శాతం మంది స్త్రీ శక్తి పథకం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆడబిడ్డల ఆర్థిక ఎదుగుదలకు ఈ పథకం తోడ్పడింది" అని సీఎం సంతోషం వ్యక్తం చేశారు.

**తల్లికి వందనం**

"తల్లికి వందనం పథకాన్ని సమర్థంతంగా అమలు చేశాం. ఈ పథకానికి రూ.10,090 కోట్లు ఖర్చు పెట్టాం. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ తల్లికి వందనం అమలు చేశాం. ఇప్పటికీ తల్లికి వందనం ఎవరికైనా అందకుంటే వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 2,79,720 మందికి రూ.363.64 కోట్లు అందజేస్తున్నాం. మొత్తంగా తల్లికి వందనం పథకంలో 66,57,508 మంది విద్యార్థులు లబ్ధిదారులుగా ఉన్నారు" అని తెలిపారు.


**దీపం 2.0 పథకం**

"దీపం 2.0 పథకం అమలు చేశాం. తల్లి వంటింట్లో పడే కష్టాలను చూసి.. మరే మహిళ ఆ కష్టాలు పడకూడదని ఉమ్మడి రాష్ట్రంలో దీపం పథకం పెట్టాం. ఇప్పుడు దీపం 2.0 పథకం ద్వారా ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇప్పటి వరకు 2.66 కోట్ల ఉచిత సిలిండర్లను మహిళలకు అందచేశాం. ఇందుకోసం రూ.1718 కోట్లను ప్రభుత్వం భరిస్తోంది" అని చంద్రబాబు వివరించారు.

# తీరం దాటిన వాయుగుండం

-మొదటిపేజీ తరువాయి

బలంగా గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం సూచించింది. కాగా, ఈనెల 30వ తేదీన ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఆవరించనుంది. దాని ప్రభావంతో వచ్చే నెల ఒకటో తేదీన ఉత్తర, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహం ఉధృతంగా ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటించింది. ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 3.83 లక్షల క్యూసెక్కులు ఉండటంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తున్నట్లు తెలిపింది. అలాగే, భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరిక(43 అడుగులు) దాటి 44.5 అడుగులకు చేరింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 10.14 లక్షల క్యూసెక్కులు ఉందని, ఇది ఆదివారానికి 11–12 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. వరద ప్రభావిత జిల్లాల యంత్రాంగం అందుబాటులో ఉండి, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించింది. ఆదివారం ఉత్తరాంధ్ర, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.



**అనూహ్యంగా పెరిగిన గోదావరి వరద**

గోదావరిలో శనివారం నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 10,13,149 క్యూసెక్కుల వరద జలాలను 48 గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం స్పిల్‌వే ఎగువన నీటిమట్టం 32.730 మీటర్లు, దిగువన 24.6100 మీటర్లు నమోదైంది. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గొందూరు గండి పోశమ్మ ఆలయం, టూరిజం బోట్ పాయింట్లు నీటమునిగాయి. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో పలు రోడ్లు నీట మునడంతో 23 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మండలంలో 200 ఎకరాల్లో మిరప పంట నీటమునిగింది. కుక్కునూరు మండలంలో కుక్కునూరు–దాచారం దారిలో వరద ఉధృతంగా ఉంది.

# విద్యుత్ చార్జీల్లో భారీ ఊరట

అమరావతి

విద్యుత్ చార్జీలు పెరిగాయి అని మాత్రమే వినడానికి అలవాటు పడ్డ వినియోగదారులకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి(ఏపీఈఆర్సీ) తీపి కబురు చెప్పింది. వినియోగదారులపై ట్రూఅప్ భారాన్ని తగ్గించాలని నిర్ణయించింది. సుమారు రూ. 923.55 కోట్లను తిరిగి వినియోగదారులకు చెల్లించాలని ఏపీఈఆర్సీ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ హయాంలో ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీలు(ఎఫ్‌పీపీసీఏ) పేర్లను మాత్రమే విన్న విద్యుత్తు వినియోగదారులు కూటమి ప్రభు త్వం వచ్చిన తర్వాత తొలిసారి ట్రూడౌన్ (చార్జీల తగ్గింపు)ను వింటున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కంలు దాఖలు చేసిన రూ. 2,758.76 కోట్ల ట్రూఅప్ మొత్తానికిగాను ఏపీఈఆర్సీ రూ. 1,863.64 కోట్లకు ఆమోదం తెలిపింది. అయితే 2024–25 ఆర్థిక సంవత్సరంలో డిస్కంలు రూ. 2,787 కోట్లు వసూలు చేయడంతో ఆ మొత్తం నుంచి రూ. 1,863.64 కోట్లను మినహాయించి మిగిలిన రూ. 923.55 కోట్లను విద్యుత్తు వినియోగదారులకు తిరిగి చెల్లించాలని ఏపీఈఆర్సీ ఆదేశించింది. దీంతో వినియోగదారులకు భారీ ఊరట లభించనుంది. 2024–25లో విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించిన వివరాలను ఈ ఏడాది జూన్ 30న విద్యుత్తు పంపిణీ సంస్థలు (డిస్కంలు) ఏపీఈఆర్సీకి నివేదించాయి. ఆ నివేదికలను మూడు నెలల్లోపు పరిశీలించి ఈఆర్సీ నిర్ణయం తీసుకోవాల్సిన కాలపరిమితి ఉన్న నేపథ్యంలో శనివారం ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

**ఎలా సర్దుబాటు చేస్తారు**

ట్రూడౌన్ చార్జీల రూపంలో మిగిలిన రూ. 923.55 కోట్లను ఈ ఏడాది నవంబరు నుంచి 2026 అక్టోబరు వరకు విద్యుత్తు వినియోగదారుల బిల్లుల్లో సర్దుబాటు చేస్తారు. యూనిట్‌కు 13 పైసలు చొప్పు న వినియోగదారులకు లబ్ధి చేకూరనుంది. అయితే ఇది ప్రస్తుత బిల్లులోని యూనిట్లపై కాకుండా 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు వినియోగించిన యూనిట్లకు వర్తింప చేస్తారు. ఆ మొత్తాన్ని ప్రస్తుత బిల్లులో సర్దుబాటు చేస్తారు. ఉదాహరణకు 2024 ఏప్రిల్‌లో వినియోగదారుల 100 యూనిట్లు విద్యుత్తు వినియోగిస్తే యూనిట్‌కు 13 పైసలు చొప్పున ఆ 100 యూనిట్లకు రూ. 13లు ఈ ఏడాది నవంబరు బిల్లులో సర్దుబాటు చేస్తారు.

**త్వరలో మరో వెయ్యి కోట్లకుపైగా..**

రానున్న రెండు మూడు నెలల్లో మరో విడత ట్రూడౌన్ చార్జీలకు ఏపీఈఆర్సీ సిద్ధమవుతోంది. 2019–24 మధ్య కాలానికి రూ. 1059.75 కోట్ల ట్రూడౌన్ (చార్జీల తగ్గింపు)ను ఏపీ ట్రాన్స్‌కో ఈ ఏడాది మార్చిలో ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలపై నిర్ణయానికి ఎలాంటి కాలపరిమితి లేదు. అయితే వీటిపై రానున్న ఒకటి రెండు నెలల్లోనే ఏపీఈఆర్సీ నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. 2019–24 మధ్య పెట్టుబడి వ్యయం కింద వివిధ అభివృద్ధి పనులకు ఏపీఈఆర్సీ అనుమతించిన ఖర్చు.. వాస్తవ ఖర్చు మధ్య వ్యత్యాసాన్ని ట్రూడౌన్ కింద సర్దుబాటు చేసేందుకు ట్రాన్స్‌కో ప్రతిపాదించింది. అప్పట్లో కోవిడ్ తదితర కారణాల వల్ల అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఆ నిధులు అలాగే మిగిలిపోవడంతో వాటిని ట్రూడౌన్ కింద వినియోగదారులకు సర్దుబాటు చేయనున్నారు.

**ఏమిటీ ట్రూఅప్**

విద్యుత్తు పంపిణీ సంస్థలు(డిస్కంలు) విద్యుత్తు కొనుగోలు, పంపిణీకి సంబంధించి అయ్యే ఖర్చులను లెక్కించి, దాని ఆధారంగా వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సిన ధరలను విద్యుత్తు నియంత్రణ మండలి నిర్ణయిస్తుంది. ఏపీఈఆర్సీ అనుమతించిన మొత్తం కంటే డిస్కంలకు అయిన వాస్తవ ఖర్చు ఎక్కువగా వస్తే దాన్ని లెక్కించి ట్రూ అప్ ఛార్జీల రూపంలో వసూలు చేసుకునేందుకు అనుమతిస్తుంది. వైసీపీ హయాంలో అడ్డగోలు ధరలకు విద్యుత్తును కొనుగోళ్లు చేయడంతో ఈ ట్రూఅప్ చార్జీల భారం భారీగా పడింది.

**ట్రూడౌన్ అంటే..**

అనుమతించిన దానికంటే డిస్కంలకు అయిన వాస్తవ ఖర్చు తక్కువగా ఉంటే మిగులు మొత్తాన్ని వినియోగదారులకు సర్దుబాటు చేయాలని ఏపీఈఆర్సీ ఆదేశిస్తుంది. దీన్నే ట్రూడౌన్ అంటారు. విద్యుత్తు కొనుగోళ్ల ధరల విషయంలో కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవడంతో డిస్కంలు తొలిసారి ట్రూడౌన్ చార్జీలను అమలు చేసే పరిస్థితి ఏర్పడింది.

# బాలకృష్ణ Vs చిరంజీవి,

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటి వరకు మెగా బ్రదర్స్ డిప్యూటీ సీఎం పవన్... ఎమ్మెల్సీ నాగబాబు స్పందించ లేదు. దీని పైన కూటమి నేతల్లో చర్చ జరుగుతోంది. ఈ వ్యవహారానికి ముగింపు పలికేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి.

వ్యాఖ్యల కలకలం

అసెంబ్లీ వేదికగా బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అదే విధంగా మెగాస్టార్ చిరంజీవి స్పందన సైతం అదే స్థాయిలో ఉంది. దీంతో.. సభలో కామినేని – బాలకృష్ణ మధ్య సంవాదం జరగాల్సింది కాదని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. సభలో చిరంజీవి పైన బాలకృష్ణ చేసిన వ్యాఖ్యల పైన పవన్ – నాగబాబు స్పందించ లేదు. దీని పైన ఇప్పుడు రాజకీయంగా చర్చ జరుగుతోంది. అటు అన్నయ్య చిరంజీవి.. ఇటు కూటమి నేత బాలకృష్ణ కావటంతో పవన్ ఆచి తూచి వ్యవహరిస్తున్నారు. పవన్ ఆలోచన ఏంటో స్పష్టత లేక.. జనసేన నేతలు సైతం డైలమాలో ఉన్నారు. అటు చిరంజీవి అభిమానులు సమావేశాలు ఏర్పాటు చేసి.. బాలకృష్ణ తీరు పైన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇద్దరు అగ్ర హీరోలు కావటం.. కూటమి పార్టీలు గా అధికారంలో ఉండటంతో... ఈ వ్యవహారానికి ముగింపు పలికే అంశం పైన తాజాగా ముఖ్య నేతలు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.

మెగా బ్రదర్స్ మౌనం

ఈ వివాదంలో పవన్– నాగబాబు మౌనం దాల్చారు. ఈ సమయంలోనే జగన్ నాడు చిరంజీవిని అవమానించారనే ప్రచారంలో నిజం లేదంటూ చిరంజీవి తేల్చి చెప్పటం రాజకీయంగానూ చర్చ గా మారింది. అసెంబ్లీలో బాలకృష్ణ సైతం జగన్ ను చిరంజీవి నిలదీయలేదని చెప్పటంతో పాటుగా.. చిరంజీవి సైతం తనను జగన్ సాదరంగా ఆహ్వానించారని పేర్కొన్నారు. ఇదే సమయం లో జగన్ ను ఉద్దేశించి అసెంబ్లీలో బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపైన వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిరంజీవి నాడు జగన్ వద్దకు వెళ్లే సమయంలో బాలకృష్ణ కోసం ప్రయత్నాలు చేసిన విషయాన్ని వివరించారు. అదే విధంగా జగన్ ను కలిసేందుకు బాలకృష్ణ అప్పాయింట్ మెంట్ కోరారని మాజీ మంత్రి పేర్ని నాని వెల్లడించారు. దీంతో.. ఈ వ్యవహారంలో బాలకృష్ణ క్యాంప్ ఒక విధంగా రాజకీయంగా ఆత్మరక్షణలో పడినట్లు కనిపిస్తోంది.

కీలక మలుపు

అటు చిరంజీవి ఫ్యాన్స్ సైతం రంగంలోకి దిగారు. బాలకృష్ణ వ్యాఖ్యల పై నిరసనలకు సిద్దం అవుతున్నారు. రేపు (ఆదివారం) చిరంజీవి బ్లడ్ బ్యాంక్ లో సమావేశం కావాలని నిర్ణయించారు. దీంతో, మెగా– నందమూరి కి దగ్గరగా ఉండే ఇద్దరు ముఖ్యులు రంగంలోకి దిగారు. చిరంజీవి పైన చేసిన వ్యాఖ్యలను సమర్థించలేక... కూటమి మిత్రపక్షంగా ఓపెన్ గా వ్యతిరేకించలేక పవన్ క్యాంప్ తర్జన భర్జన పడుతోంది. ఏ విధంగా ముందుకు వెళ్లినా.. మరో వైపు నుంచి సమస్య తప్పదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. దీంతో.. రెండు వైపులా ప్రస్తుతానికి మౌనంగా ఉండే విధంగా కొత్త ప్రయత్నాలు మొదలైనట్లు తెలుస్తోంది. మరింతగా ఈ వివాదం పెరగకుండా మంత్రాంగం సాగిస్తున్నట్లు సమాచారం. దీంతో, ఈ వివాదం సమిసిపోతుందా.. కొత్త టర్న్ తీసుకుంటుందా అనేది ఈ రోజు.. రేపు జరిగే పరిణామాలతో స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

ఆదివారం 28 సెప్టెంబర్ 2025




www.viswamvoice.com

## జీఎస్టీ ప్రయోజనాలు ప్రజలకు చేర్చడంలో అధికారులు కీలక పాత్ర పోషించాలి

**జాయింట్ కలెక్టర్ టి నిషాంతి**

**అమలాపురం , జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ సెప్టెంబర్ 27:** పేద, మధ్యతరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ గా ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన జీఎస్టీ 2.0 ప్రయోజనాలను క్షేత్రస్థాయికి వరకు చేర్చ డంలో అధికారులు నెలరోజుల పాటు కీలక పాత్ర పోషించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషా%శీ% తి ఆదేశించారు. శనివారం జివిస్టి 2.0 సూపర్ జీఎస్టీ సూపర్ సేవ్ పథకం నెలరో జుల ప్రచార కార్యక్రమాల ప్రచార అంశాలపై జిల్లా స్థాయి అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జివిస్టి సూపర్ సేవింగ్స్ ప్రస్తుత సంవత్సరం సెప్టెంబరు 22 నుంచి అమల్లోకి వచ్చిందని ఈ పన్ను వ్యవస్థలో తాజా సంస్కరణలు, రెండో తరం జివిస్టి, ప్రజలకు భారీగా ఊరటనిచ్చే విధంగా రూపకల్పన చేశారన్నారు ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎక్కువగా రెండు ప్రధాన జివిస్టి స్లాబ్లు 5% మరియు 18%. మాత్రమే ఉన్నాయ న్నారు. ఆటో పార్ట్స్, కాస్మె టిక్స్, ట్రాక్టర్, కాచ్మెన్లు, చిన్న కార్లు, బైకులు, టీవీలు మొ దలైన వాటిపై పన్ను రేట్లు తగ్గాయన్నారు.లగ్జరీ విలా సవంతమైన, నిషిద్ధత కలిగిన వస్తువులుపై 40% సూపర్ జివిస్టి వర్తిస్తుంద న్నారు.ఆరోగ్యరంగ మందులు, ఫెర్టిలైజర్లు, వ్యవసాయ యంత్రాలపై జివిస్టి తగ్గిందన్నారు ఈ సేవింగ్స్ పండుగ పేరుతో ప్రభుత్వ ప్రచారం మొదలవ్వడం, మరియు వినియోగదారులు, వ్యాపా రవేత్తలకు ప్రచారం నిర్వ హించాలన్నారు. బీమా, ఆరోగ్య బీమా పై పూర్తిగా మినహాయింపు వలన ఆరోగ్య రంగంలో ప్రయో జనం చేకూరుతుందన్నారు సామాన్య ప్రజలకు సహాయ కంగా కొత్త జివిస్టి భారం తగ్గ డం వల్ల వినియోగం పెరిగే అవకాశం ఉందన్నారు. ప న్ను



వ్యవస్థ లో సరళీకరణ, అవినీతి తగ్గింపు ఉంటుంద న్నారు.జివిస్టి 2.0 మార్పుల వల్ల ప్రజలకు ఎక్కువ ఆదా,అవుతుందన్నారు సూపర్ జివిస్టి%-%సూపర్ సేవింగ్స్ ప్రచారం అక్టోబర్ 19 వరకు కొనసాగుతుంద న్నారు. నోడల్ విభాగంగా కమర్షియల్ టాక్స్ అధికారి జగన్మోహన్ రెడ్డి వ్యవహరి స్తారన్నారు. ప్రతి రంగంలో ఈ యొక్క సంస్కరణలు మూలంగా బహుళ ప్రయో జనాలు వినియోగదారులు పొందగలరని ఆ దిశగా ప్రచార కార్యక్రమాలను 4 వారాలపాటు చేపడుతూ చివరిలో ఒక్కొక్క శాఖ ఒక్కొక్క కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రభుత్వం డిజైన్ చేసిందన్నారు. గతంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం మాదిరిగా అందరూ సమన్వయంతో ఈ యొక్క జివిస్టి 2.0 తగ్గింపు ధరల సంస్కరణలను ప్రజల్లోనికి విస్తృతంగా తీసుకుని వెళ్లి ఆ యొక్క ప్రయోజనాలను లక్షిత వర్గాలకు చేర్చాలన్న దే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్య మన్నారు. సచివాలయ మండల నియోజకవర్గ స్థాయిలలో ఛాంపియన్లు నియమించడం జరుగు తుందని వారు రోజువారి ప్రచార కార్యక్రమాలను జివిస్టి 2.0 యాప్ నందు అప్లోడ్ చేస్తారన్నారు. ఇంటింటి ప్రచార కార్య క్రమాలు, బైక్ ర్యాలీలు అవగాహన సదస్సులు వ్యాసరచన వక్తృత్వపు పోటీలు పాఠశాలల్లో వర్క్ షాపులు నిర్వహించాల న్నారు. జివిస్టి ప్రయోజ నాలు ఏ మేరకు తెలుసు కొనేందుకు,జీఎస్టీ అమలు పై ఫిర్యాదులు నమోదు చేసేందుకు ప్రభుత్వం వెబ్సైట్లను రూపకల్పన చేసిందన్నారు. వాటి ద్వారా మరింత వెసులుబాటు వినియోగదారులకు లభి స్తుందని ఆమె తెలిపారు. ఆర్టీసీ వారు బస్సులపై ప్రచార కార్యక్రమాలను ప్రదర్శించి విస్తృత అవగా హన పెంచాలన్నారు. శాఖల వారీగా ప్రదర్శన చార్టులను కమర్షియల్ ట్యాక్స్ వారు ప్రింట్ చేసి అందజేస్తారని ఆమె స్పష్టం చేశారు. పౌరసరఫరాల శాఖ వారు చౌకదారుల దుకాణాలు ఎల్పిజి డీలర్లు పెట్రోల్ బంకుల వద్ద మం డల స్థాయి స్టాక్ పాయింట్ల వద్ద ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు ఈ యొక్క జీఎస్టీ సంస్క రణల మూలంగా రాష్ట్రానికి ఏడాదికి 8 వేల కోట్లు నష్టం వాటిలినప్పటికీ ప్రజా ఆకాం క్షలు ప్రయోజనాలే పరమా వధిగా ఈ యొక్క విధా నాన్ని పూర్తిగా స్వాగతించిం దని ఆమె తెలిపా రు. సు మారు 837 వస్తువులకు సుమారు 39 సేవలకు పన్నులు తగ్గించడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే మాధవి, డిఎస్ఓ అడపా ఉదయభాస్కర్, డీఈవో షేక్ సలీం పాషా, వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్లు నిర్మల్ కుమార్ రంగారావు, తదితరులు పాల్గొన్నారు

# రసవత్తరంగా జూబ్లీహిల్స్ బై పోల్స్

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలు గతంలో ఎన్నడూ లేని విధంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. సిట్టింగ్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనా థ్ అకాల మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. త్వరలో నోటిఫికేషన్ విడుదల కాబోతోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలలో ఎమ్మెల్యే సీటు కోసం పోటీ పీక్స్ కు చేరుకుంది. తాజాగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే, దివంగత నేత మాగంటి గోపీనాథ్ భార్య సునీతకు టిక్కెట్ ఖారారు చేసింది బిఆర్ఎస్. ఇక మిగిలింది కాంగ్రెస్ , బిజెపి వంతు.ఇప్పటికే బిసి అజెండాతో ముందుకెళ్తున్నట్లు ప్రకటిం చిన అధికార కాంగ్రెస్ పార్టీ, బిసి అభ్యర్థినే జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే బరిలో దింపేందుకు సిద్దమైంది. ముందస్తు వ్యూహంలో భాగంగా మైనర్టీలను బుజ్జగించే మాస్టర్ ప్లాన్తో అజారుద్దీన్కు ఎమ్మెల్సీ ఇచ్చింది. అంతకు ముందు వరకూ తనకే జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే టిక్కెట్ అంటూ పబ్లిక్గా ప్రకటనలు చేసే అజారుద్దీన్ను అలా కట్టడి చేయగలిగింది కాంగ్రెస్ అధిష్టానం. ఇప్పుడు మిగిలింది బిసి అభ్యర్థిని ప్రకటించడం మాత్రమే. అయితే ఇక్కడే కాంగ్రెస్ కు అస్సలు కష్టాలు మొదలయ్యాయి. జూబ్లీహిల్స్ సీటు కోసం కాంగ్రెస్లో ఇప్పటికే స్థానిక నేత నవీన్ యాదవ్ పోటీపడుతుంటే, తాజాగా తెరపైకి మాజీ ఎంపీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ నేను సైతం అంటూ పోటీలోకి దూసుకొచ్చారు. వీరిద్దరికీ తోడు గౌడ సామాజికవర్గం నుంచి మురళీ గౌడ్ పోటీపడుతున్నారు.జూబ్లీహిల్స్ నియోజవర్గంలో మొత్తం ఓటర్లు 3,92,669 మంది ఉండగా వారిలో యాదవులు, మున్నూరు కాపు, పద్మశాలి, గౌడ ఇలా మొత్తంగా 11 బిసి ఉపకులాల ఓట్లన్నీ కలిపి 1,41,726 మంది ఓటర్లున్నారు. ఈ మొత్తం ఉపకులాల్లో అధికంగా



మున్నూరు కాపుల ఓట్లు 20,803 మంది ఉండగా, ఎమ్మెల్యే సీటు కోసం ప్రధాన పోటీలో ఉన్న అభ్యర్థులు మాత్రం యాదవ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం ఇక్కడ ప్రధాన ట్విస్ట్ గా చెప్పవచ్చు. మున్నూరు కాపుల నుంచి దానం నాగేందర్ పేరు మొదట్లో వినిపించినప్పటికీ, పార్టీ ఫిరాయింపు చిక్కుల్లో ఉన్న దానం జూబ్లీహిల్స్ వైపు చూసే అవకాశాలు దాదాపు లేనట్టే. ఈ నియోజవర్గంలో బిసి ఓటర్లలో యాదవ సమాజిక వర్గం ఓట్లు 15వేలకుపైగా ఉంటాయి. కానీ ఇతర కులాలో జనాకార్షక నేతలు లేకపోవడంతో బిసిలో ఈసారి సీటు యాదవ సామాజిక వర్గాన్ని వరించే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు పొలిటికల్ టాక్ నడుస్తోంది. కమ్మ, రెడ్డి, ఆంధ్రా కాపు, వెలమ ఇలా వివిధ ఓసీ ఉప కులాలతో కలిపి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓసీ ఓటర్లు మొత్తం 67,480 మంది ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే దివంగత మాగంటి గోపీనాథ్ సైతం ఓసీ సామాజిక వర్గానికి చెందిన నేత, ఈయన మూడుసార్లు ఇదే నియోజకవర్గం నుంచి గెలుపొందారు. అంతకు ముందు ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన విష్ణువర్ధన్ రెడ్డి సైతం ఓసీ సామాజిక వర్గానికి చెందిన వాడే కావడంతో వరుసగా నాలుగు సార్లు ఈ నియోజవర్గం నుంచి ఓసీ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తాజాగా అధికార కాంగ్రెస్ పార్టీ బిసి అభ్యర్థిని పోటీలోకి దించడంతో బిసి వర్సెస్ ఓసీ కులాల మధ్య గట్టి పోటీ ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. బిసిల తరువాత ఇక్కడ ముస్లిం మైనార్టీ ఓట్లు 96,546మందితో రెండో స్థానంలో ఉన్నప్పటికీ ఈసారి బరిలో ఓసీ అభ్యర్థి పేరు తెరపైకి రాకపోవడంతో మైనార్టీ ఓటర్లే అభ్యర్థుల గెలుపోటములు డిసైడ్ చేసే ఫ్యాక్టర్ గా చెప్పవచ్చు. బిజెపి సైతం తామేం తక్కువ కాదంటూ జూబ్లీహిల్స్ సీటు సొంతం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తోంది. అభ్యర్థి ఎవరు అనేది ఓ క్లారిటీ రానప్పటికీ బిజెపి మాత్రం మా లెక్కలు మాకున్నాయంటూ దూసుకుపోతోంది. ఇలా సింపథీ వర్కవుట్ అవుతుందనే ఆశతో బిఆర్ఎస్ ఉంటే, బిసి నినాదం గెలుపు తెచ్చిపెడుతుందనే ధీమాతో కాంగ్రెస్ ఉంది. ఈ నేపధ్యంలో రెండు దశాబ్దాల తరువాత జూబ్లీహిల్స్ నియోజవకర్గంలో బిసి వర్సెస్ ఓసీ కులాల మధ్య హోరాహోరీ పోరు రసవత్తరంగా మారింది.

## చట్టం ప్రకారమే బీసీ రిజర్వేషన్లపై ముందుకెళ్లాలి

చట్టం ప్రకారమే బీసీ రిజర్వేషన్లపై ముందుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. బీసీ రిజర్వేషన్ల జీవోపై దాఖలైన పిటిషన్పై హైకోర్టు శనివారం విచారించింది. రిజర్వేషన్ల జీవోను కొట్టివేయాలని మాధవరెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. పిటిషన్పై జస్టిస్ అభినందన్, జస్టిస్ విజయ్సేన్రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవోను సవాల్ చేస్తూ పిటిషన్ వేసిన మాధవరెడ్డి.. బీసీ రిజర్వేషన్లను 27శాతం నుంచి 42శాతానికి పెంచారని ఆరోపించారు. మొత్తం రిజర్వేషన్ల పరిమితి 60శాతం దాటిందని.. రాజ్యాంగంలో 50శాతం రిజర్వేషన్లు దాటకూడదనే నిబంధన ఉందని పిటిషనర్ ప్రస్తావించారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్ల జీవోను గెజిట్ చేశారా? అని కోర్టు ప్రశ్నించింది. హైకోర్టు ప్రశ్నకు స్పష్టమైన సమాధానాన్ని పిటిషనర్ తరఫు న్యాయవాది ఇవ్వలేదు. దాంతో గెజిట్ చేయకముందే హైకోర్టును ఎందుకు ఆశ్రయించారని కోర్టు ప్రశ్నించింది. బీసీల రిజర్వేషన్ల జీవో గెజిట్ కాకపోవచ్చని హైకోర్టుకు తెలిపిన ఏజీ సుదర్శన్రెడ్డి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రిజర్వేషన్లు 50శాతం మాత్రమే ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. నూతన జీవో వల్ల రిజర్వేషన్ పరిమితి 67శాతానికి చేరిందని.. బీసీ రిజర్వేషన్లు 35శాతం పెంచుతూ 2018లో జీవో ఇచ్చారన్నారు. 2018లో ఇచ్చిన జీవోను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసిందని తెలుపగా.. తమిళనాడులో రిజర్వేషన్లు 69శాతానికి పెంచారు కదా? అని హైకోర్టు ప్రశ్నించింది. తొమ్మిదో షెడ్యూల్లో పెట్టి రిజర్వేషన్ పెంచారని చెప్పిన పిటిషన్ తరఫున న్యాయవాది కోర్టుకు తెలిపారు. ప్రస్తుతం అది సుప్రీంకోర్టులో విచారణలో ఉందని పిటిషనర్ తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని 285ఏ ని సవరిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశారని.. అసెంబ్లీ తీర్మానం ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్లో ఉందన్నారు. స్థానిక ఎన్నికలపై అక్టోబర్ 6 వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉంటారా అని ఎస్ఈసీ తరఫు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వం సమాధానం చెప్పేందుకు సమయం కోరారు. బీసీల రిజర్వేషన్లపై చట్ట ప్రకారమే ముందుకెళ్లాలని.. ఈ మేరకు విచారణ అక్టోబర్ 8వ తేదీకి డివిజన్ బెంచ్ వాయిదా వేసింది. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చినా మెరిట్ ఆధారంగా పిటిషన్ను విచారిస్తామని కోర్టు స్పష్టం చేసింది.

## కుటుంబ వ్యవస్థ బలపడడానికైనా, దేశ ప్రగతికైనా మూలం స్త్రీ

లొల్ల గ్రామంలో స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం.

63 మంది మహిళలకు పలు ఆరోగ్య పరీక్షల నిర్వహణ



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకూ చేపట్టిన కార్యక్రమాలలో భాగంగా నిర్వహిస్తున్న స్వస్తి నారి స్వశక్తి పరివార్ అభియాన్ మెడికల్ క్యాంపు ను రాయవరం మండలం లొల్ల గ్రామంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రాయవరం వారి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు, లొల్ల గ్రామ సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, ఎంపీటీసీ వైట్ల సతీష్ పాల్గొన్నారు. ఈ శిబిరంలో సుమారుగా 63 మందికి షుగర్, బిపి, డయాబెటిక్, క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భిణీ స్త్రీలకు రక్త హీనత వంటి వివిధ పరీక్షలను నిర్వహించారు, చంటి బిడ్డలకు అవసరమైన టీకాలు వేసిన, వారికి అవసరమైన మందులు అందించారు. కుటుంబ వ్యవస్థ బలపడడానికైనా, దేశ ప్రగతికైనా మూలం స్త్రీ అని, మహిళలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అతిధులు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు సుంకవల్లి గంగరాజు, సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, ఎంపీటీసీ వైట్ల సతీష్, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆదాయ వనరుల పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఎంపీడీవో కీర్తి స్పందన



**రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్:** గ్రామ పంచాయతీ సర్పంచ్లు, గ్రామ కార్యదర్శులకు ఎంపీడీవో కీర్తి స్పందన ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణా తరగతులను ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ శిక్షణలో పలు అంశాలపై సర్పంచ్ లు, సెక్రటరీ లకు అధికారులు అవగాహన కల్పించారు. సొంత ఆదాయ వనరులను ఎలా పెంపొందించుకోవాలో తెలియచేస్తూ పలు సూచనలు చేశారు. మండలంలోని పలు సమస్యలను సర్పంచ్ లు ఎంపీడీవో కీర్తి స్పందన దృష్టి కి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాయవరం మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలకు చెందిన సర్పంచ్ లు, సెక్రటరీ లు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్ వర్క్స్ షాపులలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరం గ్రామ శివారులో గల హెూల్ సేల్ ఫైర్ వర్క్స్ షాపులలో మండపేట రూరల్ సిఐ పి.దొర రాజు, రాయవరం ఎస్సై సురేష్ బాబు తో కలిసి శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫైర్ వర్క్స్ తయారీ, కార్మికుల పట్ల యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు, లైసెన్స్ వంటి పత్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించి, భవిష్యత్తులో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని విధాలుగా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఫైర్ వర్క్స్ షాపుల యజమానులకు పలు సూచనలు చేస్తూ వాటి పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెూల్ సేల్ ఫైర్ వర్క్స్ షాపుల యజమానులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎడిటర్ వాయిస్

# కూలుతున్న హిమాలయాలు

కొండచరియలు విరిగిపడటం, ఉధృతమైన వరదల రూపంలో హిమాలయాలు మనతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూనే ఉన్నాయి. ఇవన్నీ దేవుని చర్యలు కావని శాస్త్ర విజ్ఞానం మనకి చెబుతూనే ఉంది. దీనికి కారణం పర్యావరణ విధ్వంసం, కార్పొరేట్ దురాశ, రాజకీయ నిర్లక్ష్యమే! హిమాలయాలు ప్రమాదంలో ఉన్నాయి. ఇటీవలి ఘటనలు పంజాబ్‌లో వరదలు, జమ్ముకాశ్మీర్‌లో హఠాత్తుగా కురిసిన కుండపోత వానలు ఉత్తరాఖండ్‌లో బురదమేట వేయడంతో గ్రామాలకు గ్రామాలు తుడిచిపెట్టుకు పోవడం, ఒకప్పుడు తాత్కాలిక ప్రకృతి వైపరీత్యాలుగా పరిగణించబడేవి. కాని, నేడు నిరంతర పరిణామాలైపోయాయి. ఒక్కరాత్రి కురిసిన కుండపోత వాన శతాబ్దాల మానవ నివాసాల్ని తుడిచిపెట్టేయడం ఒక భయానక, సాధారణ ఘటనగా మారిపోయింది. ఇదంతా ఒక క్రూరమైన పరిస్థితికి దారితీస్తుంది. ముందు మీడియా వాలిపోతుంది. జరిగిన దుర్ఘటనను, దాని ఫొటోలను, అక్కడి బీభత్సాన్ని ప్రపంచానికి వెదజల్లుతుంది. రాజకీయ నాయకులు సంతాప సందేశాల్ని వెళ్లగక్కుతారు. "వీరోచిత"మైన తాత్కాలిక ఉపశమన చర్యలు ప్రకటిస్తారు. కెమేరాలు అవతలికి పోగానే చేసిన వాగ్దానాలు గాల్లో కలిసిపోతాయి. మరో ఉపద్రవం వచ్చేంతవరకు చెవులు చిల్లులు పడేంత నిశ్శబ్దం అలుము కుంటుంది. పొంచి వున్న అసలు జబ్బును కాక రోగ లక్షణాలకు గోశాయి చిట్కాలు వేయటం మన పాలకులకు అలవాటైపోయిన విద్య. ఇటీవలి దుర్ఘటన ఒక సంక్షోభం. అది అర్థం కావాలంటే పైపైన చూస్తే చాలదు. లోతుల్లో కెళ్లి పరిశీలించాలి. పాలకులు చెప్పే అభివృద్ధి నమూనా ఎంతటి బోలైందో నిష్ణాతులైన శాస్త్రవేత్తలు ఏమి చెప్తున్నారో వినాలి. ఉత్తరాఖండ్‌కు చెందిన భూగర్భ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.పి.సతి "ప్రస్తుత ప్రమాదకర వర్షాలకు కారణం ఒక అరుదైన ప్రమాదకర వాతావరణ మార్పుల 'కాక్ టెయిల్' అంటారు" ఉత్తర భారతదేశంలో వర్షాలు ఏడాదిలో రెండు పద్ధతుల్లో పడ తాయట. ఒకటి నైరుతి రుతుపవనాలు. రెండు పశ్చిమానున్న కల్లోల పరిస్థితివల్ల. రెండవది చలికాలంలో రాగా, మొదటిది ఎండాకాలంలో వస్తుంది. ఏమైనా, కొన్ని సందర్భాల్లో నైరుతీ వర్ష రుతువు జూన్ నుండీ సెప్టెంబరు మధ్య ఎండాకాలంలో హిమాలయ పర్వత ప్రాంతాల్లో చురుగ్గా ఉంటోంది. పడమటి కల్లోల పరిస్థితులు కూడా ఇదే సమయంలో అదనంగా, అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడన పరిస్థితులు విపరీతమైన తేమతో కలిసి హిమాలయాలవైపు కదుల్తాయి. ఇది మూడురకాల తేమ సంగమించే పరిస్థితుల్ని సృష్టిస్తున్నాయి. ఇది పశ్చిమ హిమాలయాల్లోనూ, ఒకింత మధ్య హిమా లయాల్లోనూ విపరీత వర్షపాతానికి కారణమవుతున్నది. ఇది వారం దాకా కొనసాగుతోంది. 2013లో కేదార్‌నాథ్‌లో వచ్చిన వరదల ఉపద్రవానికి కారణమైంది. నేటి పరిస్థితికీ అదే కారణం. అల్పపీడన ద్రోణి ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలపై కేంద్రీకరించి ఉండింది. దీనివల్ల తూర్పునున్న కాళీనది నుండి సట్లెజ్ వరకు 16, 17 నదులకు ఏకకాలంలో వరదలొచ్చాయి. ఇటీవలి వరకు ఈ అల్పపీడన ద్రోణి పశ్చిమ హిమాలయాలపై నుంది. కాశ్మీర్ నుండి ఉత్తరాఖాండ్ వరకు ప్రతి నది ప్రమాద సూచికకు దగ్గరిగా లేదా దాటి ప్రవహిస్తున్నాయి. ఈ కాలంలో మైదాన ప్రాంతంలో విస్తృతంగా వరదలొస్తున్నాయి. ఈ వరదలకు కారణం పర్యావరణ మార్పులేననేది స్పష్టం. పైగా వర్షాకాలంలో పూర్తి మార్పులు సంభవిస్తున్నాయి. ఈ పరిస్థితి గతంలో అరుదుగా చూసేవారం. నేడు హిమాలయ పర్యావరణ వ్యవస్థ పెళుసు(ఫ్రైజైల్)గా తయారైంది. వాతావరణ పరిస్థితులు భారీవానలకు కారణమైతే, మానవ చేష్టలు ఈ వాతావరణ మార్పులను మానవ కారక మహావిపత్తుగా మార్చాయి. ఇది ప్రకృతి కారక సంక్షోభంకాదు. ఇది ప్రాధాన్యతల వల్ల ఏర్పడిన సంక్షోభం. మనం ఎలా అభివృద్ధి చెందాలో, ఎవరికోసం అభివృద్ధి చెందాలో నియంత్రించకపోతే మన నిర్లక్ష్యాన్ని హిమాలయాలు గుర్తుచేస్తూనే ఉంటాయి. హిమాలయాల వయసు తక్కువ. భూమి పలకల కదలికల (టెక్టానిక్ మూవ్‌మెంట్) వల్ల ఏర్పడ్డాయి. అందుకే భారీ నిర్మాణాలు ఇక్కడ జరుగరాదు. చాలా ఆచితూచి నిర్మాణాలు జరపాలి. నేడు దీనికి భిన్నంగా జరుగు తోంది. అది ప్రమాదకరమైంది. అడవుల విధ్వంసం, భారీ ప్రాజెక్టుల కోసం జరిగే బ్లాస్టింగులు, నదీ గర్భంలో జరిగే ఇసుక తవ్వకాలు, నిలకడలేని చోట జరిగే నిర్మాణాలు ఇప్పటికే పెళుసైన హిమాలయాల్ని మరింత ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఎంతవరకూ మానవ కార్యకలాపాలు అనుమతించగలవో హిమాలయాలకు ఒక లెక్కుంది. కాని విపరీతమైన నిర్మాణాలు, ప్రణాళికలేని టూరిజం, అన్ని వాతావరణాలకు (ఆల్ వెదర్) సరిపోయే రోడ్ల పేర నిర్మించిన చార్‌ధామ్ రోడ్డు వంటివి ఈ లెక్కను దాటుతున్నాయి. ఇవన్నీ ఈ ప్రాంతాన్ని మరింత దుర్బలంగా తయారు చేస్తున్నాయి. మనం వెంటనే కదలకపోతే పర్యావరణం మళ్లీ మార్చ వీలులేని స్థితికి నెట్టబడుతుంది. దానివల్ల మైదాన ప్రాంత ప్రజలతో సహా కోట్లాది ప్రజల జీవితాలు ప్రమాదంలో పడతాయి. గత కొద్ది దశాబ్దాలుగా హిమాలయాల కథ ఈ ప్రమాదకర పరిణామంలో ఉంది. నదుల వెంట నిర్మించిన రోడ్లు పథకంలేని పట్టణీకరణకు గుర్తుగా మిగి లాయి. వరదలు వచ్చే ప్రాంతంలో పుట్టుకొచ్చిన పట్టణాలు, అస్థిరమైన పర్వత సానువుల్లో బహుళ అంతస్తుల భవనాలు, హోటళ్లు, పాఠశాలలు వంటి నిరంతర ఆర్థిక కార్యకలాపాలు నిర్వ హిస్తున్నారు. వీటికి ఎటువంటి భూగర్భ అంచనాలు గాని, నియంత్రణలు గానీ లేవు. ఉదాహరణకు 'ధరాలీ'నే తీసు కుందాం. అది కొంత ఎత్తులోనే ఉంది. కాని కొట్టుకొచ్చిన ఒండ్రు, మట్టిపై నిర్మించిన మరో గ్రామం ధ్వంస మైపోయింది. దానికి బాధ్యులెవరు? అక్కడ నిర్మాణానికి అనుమతించిన ప్రభు త్వమా? ప్రమాదం ఉంటుందని తెలిసినా ఇండ్లు నిర్మించుకున్న ప్రజలా? బతుకు దెరువుకు అంతకంటే మార్గంలేని పరిస్థితులా? నిజానికి మనందరిదీ సమిష్టి బాధ్యతే! ముందే స్క్రిప్ట్ అంతా తెలిసినా మనం నిర్లక్ష్యం చేశాం. హిమాచల్‌లోని ఛిర్‌గావ్‌నే తీసుకుందాం. 1997లో మేఘ విస్ఫోటనం 200 మందిని బలిగొంది. దానికి ఆనాడు ప్రకృతిని నిందించారందరూ! కానీ, అది మానవ తప్పిదం. నిర్లక్ష్య నిర్ణయాలు, కార్పొరేట్ల పేరాశతో అస్థిరమైన అభివృద్ధి నమూనా పర్వతాన్ని పెళుసుగా తయారుచేసింది. స్థానిక ప్రజలకు తెలిసిన విషయాలుగాక అశాస్త్రీయ ప్లానింగ్ ఫలితమిది. 28 ఏండ్ల తర్వాత అదే ఛిర్‌గావ్ నేడు మరింత చిక్కటి జనసాంద్రతతో ఉంది. నాడు తుడిచి పెట్టుకుపోయిన ప్రాంతంలోనే నేడు బస్టాండ్, ఇతర భవనాలు నిర్మించారు. అడవుల్ని రక్షించాలని, భవనాల నిర్మాణాలు నియంత్రించాలనే శాస్త్రవేత్తల హెచ్చరికలు పట్టించుకునే నాధుడే లేడు. ఎందుకంటే రాజకీయులకు పర్యావరణ పరిరక్షణకన్నా, కార్పొరేట్ల, బిల్డర్ల లాభాలే ముఖ్యం. వారి దృష్టిలో నదులు, అడవులు, రియల్ ఎస్టేట్ నిర్మాణానికి




ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# సాంస్కృతిక పునరుజ్జీవానికి పునాది



తెలంగాణలో విద్యావైజ్ఞానిక రంగాల అభివృద్ధికీ, సాంస్కృతిక పునరుజ్జీవనానికీ నిరంతరం కృషి చేసిన వైతాళికుడు, ప్రసిద్ధ రచయిత, చరిత్రకారుడు ఆదిరాజు వీరభద్రరావు. తెలంగాణ ప్రాంతపు చరిత్ర, సంస్కృతిపై విశేష పరిశోధన చేసిన గొప్ప బాషా శాస్త్రవేత్త. ఆయన సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ నిర్మాతగా, శాసన పరిశీలకునిగా, బాలవాఙ్మయ కర్తగా, ఉత్తమ అధ్యాప కునిగా, తెలంగాణ సాంస్కృతిక వికాస చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించు కున్నారు. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంలో గ్రంథాలయ అధికారిగా, కార్యదర్శిగా, అధ్యక్షులుగా పనిచేశారు. విజ్ఞాన చంద్రిగా గ్రంథమాల కార్యాలయ ప్రముఖులుగా, ఆంధ్ర జనసంఘ కార్యవర్గ సభ్యులుగా, లక్ష్మణరాయ పరిశోధకమండలి కార్యదర్శిగా, ఆంధ్ర సారస్వతపరిషత్తు స్థాపక సభ్యులుగా, ఆంధ్ర చంద్రికా గ్రంథమాల ప్రధాన సంపాదకులుగా, విజ్ఞానవర్ధినీ పరిషత్తు సభ్యులుగా, సంగ్రహాంధ్ర విజ్ఞానకోశ ప్రధాన సంగ్రాహ కులుగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యులుగా. బహుముఖ సేవలను అందించారు. ఆదిరాజు వీరభద్రరావు (16.11.1892 – 28.9.1973) 1892 నవంబర్ 16న ఖమ్మం జిల్లా దెందుకూరులో వెంకమ్మ, లింగయ్య పంతులకు జన్మించారు. తల్లి దండ్రులు చిరుప్రాయం లోనే మరణించగా, శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం వ్యవ స్థాపకులైన రావిచెట్టు రంగారావు ఆదిరాజును చేరదీశారు. దాంతో హైదరా బాదులోని చాదర్‌ఘాట్ హైస్కూలులో మెట్రిక్ చదివారు. 1901లో కొత్తగా స్థాపించిన శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం నిర్వహణలో భాగస్వామ్యం వహించే అవకాశం వీరభద్రరావు లభించింది. శ్రీ కృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం గ్రంథాలయానికి తొలి గ్రంథపాలకులుగా ఆదిరాజు వీరభద్రరావు నియమితులైనారు. విఖ్యాత పరిశోధకులు కొమర్రాజు వెంకటలక్ష్మణ రావు హైదరా బాదులో 1905లో విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను స్థాపించారు. ఆదిరాజు దానిలో సహాయకునిగా చేరారు. స్థానిక అననుకూల పరిస్థితుల వల్ల కొమర్రాజు విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను 1908లో బ్రిటీషాంధ్ర రాజధాని మద్రాసు (నేటిచెన్నై)లు తరలించిన తరుణంలో, లక్ష్మణరావు విజ్ఞప్తి మేరకు వీరభద్రరావు కూడా మండలిలో పనిచేయటానికి మద్రాసు వెళ్ళారు. 1914 లో విజ్ఞాన చంద్రికా గ్రంథమాల హైదరాబాదుకు మారడంతో ఆదిరాజు వారు తిరిగి హైదరాబాదుకు చేరుకున్నారు. 1914లో హైదరాబాదుకు తిరిగివచ్చి మహబూబ్ కళాశాలలో తెలుగు ఆచార్యునిగా నియమితుడయ్యారు. ఆ తరువాత ఛాదర్‌ఘాట్ ఉన్నత పాఠశాలలోనూ, నారాయణ గూడలోని బాలికోన్నత పాఠశాలలోనూ తెలుగు పండితులుగా పనిచేశారు. మర్రి చెన్నారెడ్డి ఇతని శిష్యులలో ప్రముఖుడు. 1914 నుండి 1921 దాకా చాదర్‌ఘాట్ హైస్కూలులో ఆతర్వాత 1949 నుండి 1953 దాక నారాయణ గూడా బాలికోన్నత పాఠశాలలో పనిచేశారు. ఆ తర్వాత సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశానికి ప్రధాన సంగ్రాహకులుగా వ్యవహరించారు. 1921లో తెలంగాణ సాహితీ సాంస్కృతిక వికాసానికై ఆంధ్ర పరిశోధక మండలి స్థాపించి నప్పుడు దానికి కార్యదర్శిగా ఆదిరాజు పనిచేశారు. ఆ సంస్థ తెలంగాణ లోని పలు చారిత్రక ప్రదేశాలు, శిలా శాసనాలు, తాళపత్ర గ్రంథాలు సేకరించి "తెలంగాణ శాసనాలు" పేరిట పెద్ద గ్రంథాన్ని ప్రచురించుటలో ఆదిరాజు కృషి అసమానమైనది. ఆదిరాజుకు బాగా పేరు తెచ్చిన గ్రంథాల్లో ప్రాచీనాంధ్ర నగరములు , మన తెలంగాణా అనేవి ప్రధానమైనవి. అలంపురం, ఆనెగొంది, కళ్యాణి, కొండాపురం, కొలనుపాక, గోలకొండ,పానుగల్లు, ప్రతిష్ఠానం, బోనగిరి, రాచకొండ, వరంగల్లు, వేల్పుగొండ అనే ప్రసిద్ధ నగరాలకు సంబంధించిన పూర్వరాజుల, రాణుల, మంత్రుల, శిల్పుల, గాయకుల, కవుల జీవిత చారిత్రక విశేషాలతో పాటు భౌగోళిక, సాంఘిక ఆర్థిక మత విషయాలను, ఆ పట్టణాల పతన హేతువులను నిష్పక్షపాతంగా వివేచించి ఎన్నో అపూర్వ విషయాలను వెలుగులోనికి తెచ్చారు. నాణెములను గురించి, చరిత్ర పునర్నిర్మాణంలో వాటి పాత్ర గురించి వివరిస్తూ భారతదేశంలో అతి ప్రాచీన నాణేలు తొలిసారిగా తెలంగాణ ప్రాంతమైన కరీంనగర్ లో దొరికాయని, నాణేలు ముద్రించే టంకసాలలు సైతం తెలంగాణలో ఉండేవని ఒకటి కొండాపూర్‌లో, రెండవది కోయిలకొండలో ఉండేదని చారిత్రకాధారాలతో నిరూపించారు. ఆదిరాజు ఆనాడు పేర్కొన్న కొన్ని తాళపత్రగ్రంథాలు – శ్రీకృష్ణ శతానందీయం, తాలాంక నందినీ పరిణయం, దశరథరాజ నందినీ పరిణయం లాంటి కావ్యాలు పండిత పరిష్కృతాలయి వెలుగులోకి వచ్చాయి. తెలంగాణకు సంబంధించిన విభిన్న అంశాలను సత్య దృష్టితో పరిశీలిస్తూ వెలువరించిన గ్రంథం "మన తెలంగాణం". ఆదిరాజు వారికి బాగా పేరు తెచ్చిన మరో గ్రంథం "షితాబుఖాన్ లేక సీతాపతిరాజు" చరిత్ర. 68 గ్రీకు పురాణ దేవతలకు సంబంధించిన కథలను, హిందూ దేవతలతో పోల్చి బాలురకీ అర్థమయ్యే రీతిలో సులభ వ్యావహారిక శైలిలో "గ్రీకు పురాణ కథలు" పేరుతో ప్రచురించారు. విద్యార్థుల కోసం రఘునాథ నాయకుడు, మార్కోపోలో, మీరాబాయి, శ్రీహర్షుల సంక్షిప్త జీవిత చరిత్రలు ప్రచురించారు. జానపద సాహిత్యం, గ్రామనామాలు, వ్యక్తి చరిత్రలు, శాసనాలు, చరిత్రలు, దర్శనీయ స్థలాలు, సంస్కృతి సంబంధాలు, ఆచార వ్యవహారాలు, సామెతల జాతీయాల వివరణ, మహబూబునగర్, మెదక్, నల్లగొండ లాంటి వివిధ జిల్లాల స్వరూప స్వభావాల గురించిన వ్యాసాలు, వంటి ఎన్నో పరిశోధనాత్మక విశ్లేషణలు చేసారు. దక్కన్ రేడియోలో మొదటి సారి తెలుగులో ప్రసంగించిన వ్యక్తి ఆదిరాజు కావడం విశేషం. దాదాపు నూట యాభై రేడియో ప్రసంగాలు చేశారు. హైదరా బాదులో ఆ కాలంలో వెలసిన ప్రతీ సాహిత్య సాంస్కృతిక సంస్థకు వెన్నుదన్నుగా నిలిచిన ఆదిరాజు 1973 సెప్టెంబర్ 28న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

# రేబిస్‌పట్ల ప్రజల అపోహలు



పూర్తిగా నివారించదగిన రేబిస్ వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడం, తీసుకోవలసిన తగు జాగ్రత్తలను వివరించడం, కుక్క కాటు పట్ల అపోహలను రూపుమాపడానికి 2007 నుంచి ప్రతి ఏట సెప్టెంబర్ 28 రోజు "ప్రపంచ రేబిస్ దినం (వరల్డ్ రేబిస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. రేబిస్ టీకాలను రూపొందించిన ప్రముఖ కెమిస్ట్, మైక్రోబయాలజిస్ట్ "లూయిస్ పాశ్చర్" వర్ధంతి సందర్భంగా ఈ వేదికను వాడుకోవడం జరుగుతోంది. ప్రపంచ రేబిస్ దినం –2025 ఇతివృత్తంగా "అవగాహన కల్పించడం, టీకాలు వేసుకోవడం, నివారించడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. జంతువులు, మానవులకు రేబిస్ సోకకుండా సురక్ష చటీకాలు అందుబాటులో ఉన్నందున రేబిస్ వ్యాధి కట్టడి సులభసాధ్యం అవుతున్నది. రేబిస్ వ్యాధి సోకినపుడు మెదడుతో పాటు కేంద్ర నాడీమండల వ్యవస్థలు ప్రభావితం అవుతాయి. రేబిస్ వైరస్ సోకినపుడు వచ్చే రేబిస్ వ్యాధి పట్ల ప్రజల్లో అపోహలు, తప్పుడు సమాచారాలు, అవాస్తవ భ్రమలు, దురభిప్రాయాలు, అవగాహన లేమి కారణాలతో తమ ప్రాణాలను సహితం కోల్పోవడం చూస్తున్నాం. రేబిస్ వ్యాధికి కారణమైన జంతువులకు, ముఖ్యంగా కుక్కలకు రేబిస్ టీకాలు వేసిన యెడల ఈ వ్యాధి నిరోధించబడుతుంది. రేబిస్ వ్యాధి 99 శాతం ప్రాణాంతమే అయినా 100 శాతం నివారించదగినదే. రేబిస్ వ్యాధి కట్టడికి కుక్కలకు టీకాలు వేయించడం, వీధి కుక్కల జనాభాను నియంత్రించడం, భయాన్ని వీడి వాస్తవాలను అర్థం చేసుకోవడం జరగాలి. ఐరాస లక్ష్యాల ప్రకారం 2030 నాటికి "రేబిస్ మరణాలు లేని" లేదా "జీరో రేబిస్ మరణాలు" ప్రపంచాన్ని నిర్మించాలని ప్రణాళికలను అమలు చేస్తున్నది. రేబిస్ వైరస్ వ్యాధి కారణ మరణాల్లో 95 శాతం వరకు ఆసియా, ఆఫ్రికా దేశాల్లోనే నమోదు అవుతున్నాయి. కుక్క కాటు వేసిన వెంటనే(15 నిమిషాల్లో) ఆ ప్రాంతాన్ని నీటితో శుభ్రం చేయడం, వెంటనే రేబిస్ టీకా పూర్తి డోసులను తీసుకోవడం తప్పక జరగాలి. అశ్రద్ధ చేసినపుడు ప్రాణాంతర స్థాయి వస్తుందని తెలుసుకోవాలి. రేబిస్ వ్యాధి దాదాపు 150 దేశాల్లో నమోదు అవుతున్నది. కేవలం భారత్‌లోనే 40 శాతం రేబిస్ కేసులు బయట పడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సాలీనా 59,000 మంది, భారత్‌లో 20,000 మంది రేబిస్ వ్యాధితో మరణిస్తున్నారు. రేబిస్ మరణాల్లో దాదాపు 40 శాతం ప్రజలు 15 ఏండ్ల లోపు వారే ఉండడం విచారకరం. కుక్క కాటు పట్ల అవగాహన లేని కారణంగా నిర్లక్ష్యం చేయడంతో ప్రాణాలు పోతున్నాయి. కుక్క కాటుతోనే కాకుండా పిల్లులు, గబ్బిలాలు, ముంగీసలు కాచు వేయడం లేదా గీరడం వల్ల కూడా రేబిస్ వ్యాధి రావచ్చుని గమనించాలి. రేబిస్ వ్యాధి లక్షణాల్లో జ్వరం, బలహీనత, వాంతులు, దురద, మింగడంలో ఇబ్బందులు, లాలాజలం అతిగా ఊరడం, కండరాల నొప్పులు, వణుకు, తల నొప్పి, ఉద్రేకం, గందరగోళం, మస్తిష్క లోపం, నీటిని చూస్తే భయం (హైడ్రోఫోబియా), కోమాలోకి వెళ్లడంతో మరణం లాంటివి కనిపిస్తాయి. వీధి కుక్కలు లేదా జంతువులను తాకకుండా ఉండడం, సాధు జంతువులకు టీకాలు వేయించడం, సాధు జంతువులు బయటకు వెళ్లినపుడు జాగ్రత్తగా పర్యవేక్షించడం, కాటు వేసిన లేదా గీరిన వెంటనే నీటితో శుభ్రం చేయడం, వెంటనే పూర్తి డోసుల టీకాలను తీసుకోవడం, విచిత్ర ప్రవర్తన కలిగిన కుక్కల సమాచారాన్ని అధికారులకు అందించడం విధిగా జరగడానికి ప్రతి ఒక్కరు చొరవ తీసుకోవాలి. కుక్క కాటుతో మాత్రమే రేబిస్ వస్తుందనే అవాస్తవాలను నమ్మకపోవడం, చిన్న కాటు లేదా గీరినపుడు ఏమీ కాదని నిర్లక్ష్యం చేయడం, కాటు వేసిన కొన్ని రోజుల తర్వాత వ్యాధి లక్షణాలు బయట పడతాయని తెలుసుకోవడం, రేబిస్ వైరస్ కలిగిన కుక్కల నోటిలోంచి నురగ కారడం, ఒక్కసారి రేబిస్ టీకా జీవితకాలం పని చేయదని గమనించడం, సాంప్రదాయ పద్ధతులతో రేబిస్ చికిత్సలను మానేయడం లాంటి జాగ్రత్తలు తీసుకోవడంతో ప్రాణాపాయం తప్పుతుంది. నేడు భారత వీధుల్లో దాదాపు 40 మిలియన్ల వీడేది కుక్కలు ఉన్నట్లు అంచనా. అత్యధిక సంఖ్యలో వీధి వీధిన సంచరిస్తున్న వీధి కుక్కలకు టీకాలు వేయడం కొంత కష్టమే అయినా వాటికి టీకాలు వేస్తూ, వాటి సంతానోత్పత్తిని కట్టడి చేయడం సమాంతరంగా జరగాలి. భారత ప్రభుత్వం దేశవ్యాప్త ఆసుపత్రుల్లో రేబిస్ టీకాలను అందుబాటులో ఉంచడంతో పాటు ఉచితంగా వేయడం కనీస కర్తవ్యంగా ఏర్పాటు చేయాలి.


# జ్ఞాన సంపన్నులు దివ్యాంగులు

ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ చివరి వారం, అనగా 22 నుంచి 28 సెప్టెంబర్ 2025 వరకు "అంతర్జాతీయ వినికిడా లోప దివ్యాంగుల వారం (ఇంటర్నేషనల్ వీక్ ఆఫ్ డెఫ్ పీపుల్)"ను పాటించడంతో పాటు సెప్టెంబర్ చివరి ఆదివారం, అనగా 28 సెప్టెంబర్ 2025 రోజు "అంతర్జాతీయ వినికిడి లోప దివ్యాంగుల దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ డెఫ్ పీపుల్స్ డే)" పాటించడం కూడా జరుగుతోంది. అంతర్జాతీయ వినికిడిలోప దివ్యాంగుల వారం–2025 ఇతివృత్తంగా "సంజ్ఞ భాషా హక్కులు లేకుండా చెవిటి వారికి మానవ హక్కులు సాధ్యపడవు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. దివ్యాంగుల్లో వినికిడి లోపం, చెవిటితనం, చెవుడు లేదా బధిర లక్షణాలను గుర్తించి ఆ వర్గాలకు మానవ హక్కుల కల్పనతో పాటు సంజ్ఞ భాషలను నేర్పడం విధిగా జరగాలని ప్రచారం నిర్వహించడం కొనసాగుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 466 మిలియన్ల అభాగ్యుల వినికిడిలోప సమస్యలతో బాధ పడుతున్నట్లు తేలింది. వినిడిలోప సమస్యలు అనుభవిస్తున్న వారిలో 34 మిలియన్ల పిల్లలు కూడా ఉండడం విచారకరం. వినికిడిలోప సమస్యల్లో 60 శాతం నివారించదగినవే. నేటి డిజిటల్ యుగంలో డిజే మోతలు, శబ్ద కాలుష్య కోరల్లో చిక్కి 1.1 బిలియన్ల యువత వినికిడిలోప విష వలయం బారిన పడుతున్నట్లు తేల్చారు. చెవిటి సమస్యలతో బాధపడుతున్న దివ్యాంగుల హక్కులను కాపాడడం, ఉచిత విదియను కల్పించడం, సంజ్ఞ భాషలను నేర్పడం, జీవనోపాధులు కల్పించడం, వినికిడి పరికరాలను పంపిణీ చేయడం, వృత్తి ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వడం, వారి కుటుంబాలకు చేయూత ఇవ్వడం, దివ్యాంగులను గౌరవించడం, క్రీడల్లో ప్రోత్సహించడం, పలు ఉత్సవాల్లో భాగస్వామ్యం కల్పించడం, పలు రంగాల్లో రాణించిన వారిని సన్మానించుకోవడం లాంటి చర్యలు నిరంతరం కొనసాగాలి. దివ్యాంగులు 21 రకాలుగా ఉన్నారు. భారత్‌లో 2.21 శాతం జనాభా దివ్యాంగుల వర్గంలో ఉన్నారు. వీరిలో 56 శాతం వరకు పురుషులు, 44 శాతం మహిళలు ఉన్నారు. భారతీయ దివ్యాంగుల్లో 69 శాతం వరకు గ్రామాల్లోనే నివసిస్తున్నారు అంగవైకల్య జనాల్లో 20 శాతం నడవలేని వారు, 19 శాతం దృష్టిదోషం ఉన్న వారు, 18 శాతం ఇతర వైకల్యాలు ఉన్న వారు, 8 శాతం బహు విధ వైకల్యాలతో బాధ పడుతున్న అభాగ్యులు ఉన్నారు. దివ్యాంగుల్లో 42 శాతం వరకు వివాహాలకు దూరంగా దుర్భర జీవితాలను గడుపుతున్నారు. అంగవైకల్య వర్గాల్లో 36 శాతం మాత్రమే ఉద్యోగ ఉపాధులు పొంది ఉన్నారు. దివ్యాంగుల్లో 62 శాతం పురుషులు, 42 శాతం స్త్రీలు మాత్రమే అక్షరాస్యతను కలిగి ఉన్నారు. వీరిలో 8.5 శాతం మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారు. అంగవైకల్యం పుట్టుకతో లేదా ప్రమాదాలు, అసంబద్ధ జీవనశైలి పాటించడంతో రావచ్చు. అంగవైకల్యం ఎలా సంభవించినా వారి బాధలు మాత్రం వర్ణనాతీతం. సాధారణంగా వినికిడి లోపంతో మాట్లాడలేక పోవడమనే సమస్య కూడా ఇమిడి ఉంటుంది.



## మధ్యప్రదేశ్ కు చెందిన దార్ గ్యాంగ్ పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి

**జిల్లా ఎస్ పి రాహుల్ మీనా**



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐ పి ఎస్ ఉత్తర్వులు ప్రకారం.

మధ్యప్రదేశ్‌కు చెందిన దార్ గ్యాంగ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ కు చెందిన గ్యాంగులు గత పది రోజుల నుండి నెల్లూరు ,కాకినాడ, నల్లజర్ల మొదలగు ప్రాంతాలలో ,రాబరీలు, ఇంటి దొంగతనాలు చేస్తూ ఉన్నారు ,వీరు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాలలో పగల టైంలో ఒంటరిగా ఉన్న మహిళల ఇల్లులను ,తాళాలు వేసిన ఇళ్లను చూసుకుని రాత్రి టైం లో దొంగతనాలు చేసే అవకాశం ఉన్నందున ,డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి ,అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రావులపాలెం ,ఆలమూరు, మండపేట ,రామచంద్రపురం ,అమలాపురం రాజోలు ,ముమ్మిడివరం ఏరియాలో దొంగతనాలు చేసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎవరైనా అనుమానితులు కనిపించిన ఎడల దగ్గరలో ఉన్న పోలీస్ వారికి తెలియపరచవలసినదిగా కోరుచున్నాము ఇట్లు

సి సిఎస్ అమలాపురం సి ఐ ఫోన్ నెంబర్స్
7601047473,9440796549,%ూూ× 9440473215

## ఆరోగ్యవంతమైన సమాజానికి మహిళా ఆరోగ్యం ముఖ్యం...

**చైర్ పర్సన్ రాణి...**



**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** మహిళలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం గా ఉండరాదని మహిళ ఆరోగ్యంగా ఉంటేనే వారి కుటుంబం ఆరోగ్యవంతంగా ఉంటుందని, ఆరోగ్యవంతమైన సమాజన్ని నిర్మించడానికి మహిళా ఆరోగ్యం కేంద్ర బిందువు లాంటిదని మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పేర్కొన్నారు. స్వస్థ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండపేట పట్టణం పార్థసారథినగర్ లో గల ఆల్ అమీనా మస్జిద్ లో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి ముఖ్య అతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన పిల్లలు పుడతారన్నారు. మహిళలకు పలు ఆరోగ్య సూచనలు చేశారు.అనంతరం ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ వి.భవాని ను సత్కరించారు.కార్యక్రమంలో కౌన్సిలర్లు నీలం దుర్గ,మొండి భవాని, టిడిపి లంకలపల్లి రాంబాబు, 27 వార్డ్ టీడీపీ ఇంచార్జ్ ఎండి కరీం ఖాదారీ, అమీనా మస్జిద్ ప్రెసిడెంట్ ఎండి రహీం,ఆర్థో పెడిక్ వైద్యులు డాక్టర్ రాము,గైనకాలజిస్ట్ ఇమిడి శెట్టి జోతిర్మయి, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది,ఎ.ఎన్.ఎమ్ లు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు,అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలు కి ఉపయోగపడే భూమిని వదులకోలేము

**జనుపల్లి గ్రామ ప్రజల ఆందోళన**



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ జనుపల్లి గ్రామప్రజలు ఆందోళన. గ్రామంలో అన్ని కార్యక్రమాలకి ఆభూమి అదారం. మూడు వేల మందికి పైన జనాభా ఉన్న ఆగ్రామంలో అమ్మవారి గుడికి అనుకుని ఉన్న 50 సెంట్లు భూమిని వాతావరణ శాఖ ఆఫిస్ నిర్మించుటకు గాను ప్రభుత్వం వారు అభూమిని సర్వే చేసుకుని పంచాయతీ లో నోటీసు అంటించి వెళ్లారని తెలిసి గ్రామస్తులు అందరూ పంచాయతీ వద్దకు చేరుకొని ఆ భూమి గ్రామస్తులు అందరూ కార్యక్రమాలకి ఉపయోగించుకునేది కాబట్టి ఆ స్థలములో ఎటువంటి కట్టడాలు కట్టడానికి వీలు లేదని గ్రామస్తులు అందరూ ఏకమై వ్రాత పూర్వాకంగా జనుపల్లి పంచాయతీ ఆఫీస్ కి లెటరు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమం లో గుడి చైర్మన్ కొలిశెట్టి దుర్గారావు, కొలిశెట్టి సూరిబాబు, గెడ్డం చిన్ని, వాకపల్లి ఆదిత్య, ఇంకా గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గోదావరి డెల్టా వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది....

ఆయకట్టు స్థిరీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి....

శాసనసభలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.....



**విశ్వం వాయిస్ న్యూస్.కొత్తపేట** గోదావరి డెల్టా ఆయకట్టును కాపాడుకోవాల్సిన అవసరం ఉందని శాసనసభలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. శనివారం ఆయన సభలో మాట్లాడుతూ సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడు 150 ఏళ్ల క్రితం ఏర్పాటుచేసిన గోదావరి డెల్టా వ్యవస్థ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 10లక్షల ఎకరాలకు గోదావరి జిల్లాల్లో తూర్పు, సెంట్రల్, పశ్చిమ డెల్టా అనే మూడు వ్యవస్థలుగా సాగునీరు, మురుగునీరు పారుదల అందించే వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారై మెరకలు, మేటలు, ఆక్రమణలతో పూడుకుపోయి వరదల సమయంలో సముద్రంలోకి నీరు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కోనసీమ ప్రాంతం నుంచే మొత్తం గోదావరి నీరు సముద్రంలోకి చేరాలన్నారు. సాగునీరు విడుదల సమయంలో సైతం లెవెల్స్ మెయింటెనన్స్ కుదరక రబీ సమయంలో రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కోనసీమ ప్రాంతం సెంట్రల్ డెల్టా పరిధిలో ఉండి 2.20లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. 5 నియోజకవర్గాల్లో లాకులు, డిపీలు, యూటీలు, సైఫన్లు శిథిలావస్థలో ఉండి సాగునీటి పారుదల, మురుగునీటి పారుదల వ్యవస్థలు సక్రమంగా జరగడం లేదన్నారు. 150ఏళ్ల నాటి వ్యవస్థను పునర్నిర్మాణం చేయాలన్నారు. ప్రధానంగా సెంట్రల్ డెల్టాకు ఆయువుపట్టులాంటి లొల్లలాకులను పునర్నిర్మాణం చేయాలన్నారు. లొల్లలాకులు దెబ్బతింటే మొత్తం కోనసీమకు సాగునీటి సరఫరా దెబ్బతింటుందన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో ఉన్న లొల్ల లాకులతో పాటు చొప్పెల్ల లాకులు, ఆలమూరు లాకులు, పలివెల లాకులు, వాడపాలెం లాకులు, గోపాలపురం లాకులు మొత్తం ఆరు లాకులను పునర్నిర్మాణం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నూతన ఆయకట్టు ఏర్పాటులో కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రశంసిస్తూనే ఉన్న ఆయకట్టును స్థిరీకరించాల్సిన అవసరం ఉందన్నారు. కొత్త ఆయకట్టు ఏర్పాటుకు కృషిచేస్తూనే నాబార్డు లేదా ప్రపంచబ్యాంకు నిధులను సమీకరించి గోదావరి డెల్టా వ్యవస్థను దశలవారీగా, నాలుగైదు సంవత్సరాల్లో అయినా శిథిలమైన లాకులు తదితర వ్యవస్థల పునర్నిర్మాణాలు చేపట్టి గోదావరి డెల్టా వ్యవస్థను ఆధునీకరించాలని కోరారు.

## రిక్షా స్టాండ్ బోర్డు తొలగింపు పై ఆగ్రహం...

చిరు కార్మికుల జోలికి వస్తె సహించం...

ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర కార్యదర్శి ధూళి జయ రాజు హెచ్చరిక...



**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** మండపేట సూర్య మహల్ బస్టాండ్ సెంటర్ లో వున్న రిక్షా స్టాండ్ బోర్డును మున్సిపల్ అధికారులు తొలగించారని ఇది అన్యాయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ధూళి జయ రాజు అన్నారు. జై భీమ్ రిక్షా కార్మికుల పట్టణ అధ్యక్షుడు అయినవిల్లి రవణ మాదిగ అధ్యక్షతన రిక్షా కార్మికుల సమావేశం మండపేట బస్టాండ్ జై భీమ్ రిక్షా కార్మికుల సెంటర్ లో శనివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు దూలి జయరాజు ,ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ మండపల్లి రవికుమార్ సిపిఐ జిల్లా నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధూళి జయ రాజు మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో బస్ స్టాండ్ సెంటర్ లో రిక్షా స్టాండ్ లో కార్మికుల కోసం అప్పటి ఉప ముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ మునిసిపల్ నిధులు తో షెల్టర్ నిర్మించి ఇచ్చారన్నారు. ఇక్కడ డ్వాక్రా మహిళలు కు హెూటల్ ఏర్పాటు కు ప్రయతిస్తున్నట్లు ఆరోపించారు. ఈ నేపద్యంలో ఇక్కడ ఉన్న రిక్షా స్టాండ్ బోర్డు తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలించిన చోటే 24 గంటల్లో ఆ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఇటీవల సుందరీకరణ పేరిట మున్సిపాల్టీ రోడ్ మార్జిన్ లో చిరు వ్యాపారులు బడ్డీ లు తొలగించారని ఆరోపించారు. బీసీ, ఎస్ సి, ఎస్ టి,అగ్రవర్ణాల పేదల పక్షాన ఎమ్మార్పీఎస్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కౌన్సిలర్ మండపల్లి రవికుమార్ మాట్లాడుతూ ఈ అంశంపై మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తో చర్చించామని చెప్పారు. కాగా బోర్డు తొలగింపు లో ఎటువంటి అపోహలకు తావులేదని కమిషనర్ చెప్పారని పేర్కొన్నారు. కేవలం రంగులు వేసేందుకు షెల్టర్ కొలతలు తీసుకున్నారని కమీషనర్ వివరించారని చెప్పారు. రిక్షా స్టాండ్ లో సమావేశం అనంతరం కార్మికులు తో కలిసి కమిషనర్ ను కలిసి తమ డిమాండ్ లు వివరించారు. ఈ కార్యక్రమంలో బుట్టా వీర్రాజు, ఏల్చూరి ఏసు, చాపల సత్తన్న, కొమ్ము సత్యనారాయణ, కొమ్ము సత్యనారాయణ, ఏడిద ఏసు పెంటయ్య, కొల్లి శ్రీను, మందపల్లి సుధాకర్, మడికి ఆనందరావు , రిక్షా కార్మికులు పాల్గొన్నారు.

## పసలపూడిలో పేకాట రాయుళ్ల అరెస్టు



**రాయవరం,విశ్వంవాయిస్ న్యూస్:** రాయవరం మండలం పసలపూడి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు రాయవరం ఎస్సై డి సురేష్ బాబు తెలిపారు. పసలపూడి గ్రామంలో పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారంతో శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించగా, పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి సుమారు రూ.11,400/- నగదు, ప్లాస్టిక్ టేబుల్, 6 కుర్చీలు ,పేక ముక్కలను స్వాధీన పరుచుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు నిందితులైన పసలపూడి గ్రామానికి చెందిన తాడి జగన్మోహన్ రెడ్డి, పడాల సురేష్ రెడ్డి, రామచంద్రపురం కు చెందిన పోలిశెట్టి నాగు, పట్నాల లోవరాజు, బుద్దన్న గణపతి, పిల్లి సత్యశేషారావు, శీల గ్రామానికి చెందిన దొమ్మేటి వెంకట సుబ్బారావు లపై కేసు నమోదు చేసామన్నారు. ఈ సందర్భంగా రాయవరం పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని రాయవరం ఎస్సై డి సురేష్ బాబు హెచ్చరించారు.

## రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్‌గా తోట ప్రమాణ స్వీకారం...



**మండపేట టౌన్... విశ్వంవాయిస్ న్యూస్...** రాష్ట్ర సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్‌గా మండపేట నియోజకవర్గ వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. 2025 నుంచి 2026 వరకు ఈ కమిటీ పనిచేస్తుంది.శాసన సభ , శాసన మండలి ఉభయ సభల నుంచి ఎంపికైన 12 మంది సభ్యులతో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్‌లో ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, శాసనమండలి చైర్మన్ మోషేను రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. చట్టాల అమలు, సబార్డినేట్ చట్టాల పరిశీలనకు మరింత శక్తివంతమైన ప్రణాళికను రూపొందించనుంది.తోట త్రిమూర్తులు మాట్లాడుతూ మండపేట నియోజకవర్గం వైసిపి ఇన్‌చార్జ్‌గా, మాజీ ఎమ్మెల్యే , ఎమ్మెల్సీగా తన అనుభవాన్ని కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.సబార్డినేట్ చట్టాల పరిశీలన ద్వారా ప్రజలకు మరింత పారదర్శకమైన, ప్రభావవంతమైన పాలసీలు అమలు చేయడమే తన లక్ష్యం గా పేర్కొన్నారు. ఉభయ సభల సభ్యుల సహకారంతో రాష్ట్ర చట్టవ్యవస్థను మరింత బలోపేతం చేస్తానని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా, జనరల్ సెక్రటరీ ప్రసన్నకుమార్ సూర్యదేవర తోట త్రిమూర్తులు తో ప్రమాణ స్వీకారం చేయించి, బాధ్యతలు అప్పగిం చారు. అనంతరం తోట త్రిమూర్తులు చైర్మన్‌గా, కమిటీ సభ్యులతో సెక్రటేరియట్‌లో సమావేశం ఏర్పా టు చేశారు. విధులు, విధానాలు, సబార్డినేట్ చట్టాల పరిశీలనా ప్రక్రియలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు, చైర్మన్ మోషేను రాజు లు పాల్గొన్న ఈ సమావేశంలో కమిటీ లక్ష్యాలను స్పష్టం చేస్తూ, తోట త్రిమూర్తులు నాయకత్వాన్ని ప్రశంసించారు. తోట త్రిమూర్తులు అనుభవం, కమిటీకి అమూల్యమైనదనీ పేర్కొన్నారు. రాష్ట్ర చట్టాల అమలులో కీలక పాత్ర పోషిస్తారని అభిప్రాయపడ్డారు. తోట త్రిమూర్తులు ప్రమాణస్వీకారం చేయడం పట్ల వైసిపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

## జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పి

దసరా సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

జిల్లా ఎస్ పి రాహుల్ మీనా



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** దసరా సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్న జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా ఐపీఎస్.జిల్లా ప్రజలకు దసరా శు భాకాంక్షలు తెలియజేసిన జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా ఐపీఎస్.దసరా పండుగను ప్రజలు భక్తి శ్రద్దలతో ప్రశాంత వాతవరణంలో జరుపోకోవాలని, ఎక్కడ అవాంచనీయ సంఘటనలుకు అవకాశం ఇవ్వకుండా ప్రజలందరూ స్నేహభావంతో పండుగను జరుపోకోవాలని సూచించారు. దసరాను పురస్కరించుకుని జిల్లా లో పలుచోట్ల ఉత్సవాలు, ఊరేగింపులు జరుగునున్న నేపద్యంలో క్లిష్టతర ప్రాంతాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేసారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహించే క్రమంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఆర్గానైజర్స్/నిర్వాహకులు భాద్యతను వహించాలి. ఊరేగింపును తగిన సమయాలలో వారికి కేటాయించిన రూట్/మార్గాలలో మాత్రమె నిర్వహించాలని సూచించారు. దసరా సందర్భంగా బంధువుల ఇంటికి లేదా యాత్రలకు వెళ్ళేవారు వారి ఇళ్ళల్లో విలవైన వస్తువులను ఉంచరాదని, బ్యాంకు లలో భద్రపరుచుకోవాలని తెలియజేసారు. అంతేకాక ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ డిపార్ట్మెంట్ వారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్ హెచ్ ఎమ్ ఎస్ ) ను ఎల్ హెచ్ ఎమ్ ఎస్ యాప్ కు అనుసందానం చేసి అభివృద్ధి చేసినట్లు, దీనికొరకు ఎల్ హెచ్ ఎమ్ ఎస్ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని యాప్ ద్వారా రిక్వెస్ట్ పెట్టుకున్నట్లయితే , మీ మీ పరిధిలో గల పోలీస్ స్టేషన్ నుండి పోలీసువారు మీ ఇంటికి వచ్చి కెమెరా (ఎల్ హెచ్ ఎమ్ ఎస్) ను ఫిక్స్ చేసి నిరతరం కంట్రోల్ రూం నుండి పర్యవేక్షిస్తారని తెలియజేశారు. ఈ సదుపాయం కోసం ఎటువంటి ఖర్చు ఉండదు, కేవలం రిజిస్ట్రేషన్ చేసుకోవడం సరిపోతుంది అని తెలియజేసారు.

## శిరిగినీడి వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించిన నేతలు



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్గా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించినందుకు వారి స్వగృహం నందు శనివారం అమలాపురం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ, కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సీనియర్ నాయకులు నాగిరెడ్డి శివప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షులు పప్పల శ్రీరామచంద్రమూర్తి ,జిల్లా ప్రధాన కార్యదర్శి నందెపు శ్రీనివాస్, నిమ్మన సత్యనారాయణ,దంగుడిబి య్యం శ్రీనివాసు, బద్రి శ్రీనివాస్ ,నల్లా బాలాజీ, అల్లు వజ్ర కుమార్, సుంకర బాలాజీ, పత్తి దత్తుడు ఘనంగా సత్కరించారు.

## వైఎస్ఆర్సిపి కార్యకర్తల కోసం క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ బుక్ ప్రారంభం



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అన్యాయానికి గురవుతున్న వైఎస్ఆర్సిపి కార్యకర్తల కోసం క్యూఆర్ కోడ్ తో రూపొందించిన డిజిటల్ బుక్ ను అమలాపురం లో ప్రారంభించిన ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, కో-ఆర్డినేటర్లు గన్నవరపు శ్రీనివాస్,నేతలు చెల్లుబోయిన శ్రీనివాస్, పితాని బాలకృష్ణ, ,పందిరి శ్రీహరి,కొనుకు గౌతమీ, వంటెద్దు వెంకన్నయుడు, ఉంద్రు బాబ్జి, ఉంద్రు వెంకటేష్, గొవ్వాళ రాజేష్, షేక్ అబ్దుల్ ఖాదర్, పోగాకు శ్రీను, గుత్తుల రాజు, బద్రి బాబ్జి,తోరం గౌతమ్ రాజా, కుడుపూడి భారత్ భూషణం, కాశీ మునికుమారి, విత్తనాల మూర్తి తదితరులు పాల్గొన్నారు..

## జిల్లా సాయుధ రిజర్వు కార్యాలయం, సెంట్రల్ క్రైమ్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు

**జిల్లా ఎస్ పి రాహుల్ మీనా**



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** జిల్లా సాయుధ రిజర్వు కార్యాలయం, సెంట్రల్ క్రైమ్ స్టేషన ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాహుల్ మీనా ఐపీఎస్, క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ పోలీస్ స్టేషన్ ను సందర్శిస్తూ సిబ్బందికి సూచనలు జారి చేస్తున్న జిల్లా ఎస్పి. శాంతి భద్రతల విషయంలో రాజిపడేది లేదని, సిబ్బంది అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని, ఎస్కార్ట్ డ్యూటీ జాగ్రత్తగా ఉండాలని మరియునేరస్తుల సమాచారాన్ని సేకరించి ఎప్పటికప్పుడు కేసులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేయడమైనది.

# డిఎల్‌పిఓ ఆఫీస్ ఏవో వెంకటరెడ్డి పై చర్యలు తీసుకోవాలి

**కలెక్టరేట్ వద్ద దళిత సంఘాలు ధర్నా...**

**కాకినాడ కలెక్టరేట్:విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా డిఎల్పిఓ కార్యాలయ ఏవో సిహెచ్ వెంకట్ రెడ్డి, దళిత బలహీన వర్గాల క్రింది స్థాయి ఉద్యోగులపై వేధింపులు తక్షణం ఆపాలని దళిత బహుజన ప్రజా సంఘాలు శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏవో వెంకటరెడ్డి గత కొన్ని ఏళ్లుగా క్రింది స్థాయి ఉద్యోగులపై వేధింపులకి పాల్పడి వాళ్ళు మానసిక ధైర్యాన్ని దెబ్బతీస్తున్నారని, అంతే కాకుండా, అతనే కొంతమంది దళారులతో, క్రింది స్థాయి అధికారులపై ఫిర్యాదులు చేయించి ఆ ఫిర్యాదులు నేపథ్యంలో తన వద్దకు వచ్చిన పిటిషన్ పిటిషన్ ఆధారంగా వారిని బెదిరించి బేరసారాలు నిర్వహిస్తున్నారని దళిత సంఘాల ఆరోపించాయి. ప్రధానంగా ఎస్సీ బీసీ ఎస్టీ లకు చెందిన ఉద్యోగులపై ఈ వేధింపులు అధికమయ్యాయని వారు కలెక్టర్ కి ఇచ్చిన మెమోరాండంలో పేర్కొన్నారు. ఏవో వెంకటరెడ్డి గత కొన్నేళ్లుగా పని చేసిన అన్ని ప్రాంతాల్లోనూ అక్రమాలకు పాల్పడి అరాచకాలు చేశారన్నారు. అక్రమార్జునతో కోట్లకు పడగలెత్తి వడ్డీ వ్యాపారాలు నిర్వహించడం, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేయడం తద్వారా డబ్బుతో పై అధికారులను మేనేజ్ చేయడం అతనికి వెన్నతో పెట్టిన విద్య గా వాళ్ళు చెప్పారు. ఇటీవల ఏవో కొత్తపల్లి



మండలం పొన్నాడ గ్రామ పంచాయతీకి చెందిన పంచాయతీ సెక్రెటరీ పై ఇదే విధంగా 150 సార్లు పైగా ఫిర్యాదులు చేయించారన్నారు. దేనికీ లొంగకపోవడంతో వాళ్ల తాలూకా ప్రమోషన్ లో లిటిగేషన్ పెడుతూ పంచాయతీ సెక్రెటరీ ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. అలాగే మహిళా పంచాయతీ సెక్రెటరీల విషయంలో అసభ్యకరంగా వేధిస్తూ, ఇబ్బందులుకు గురి చేస్తున్నాడన్నారు. కొన్ని సందర్భాల్లో మహిళా ఉద్యోగులను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడని వారు ఆరోపించారు. గతంలో ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం పంచాయతీలో సుమారు 2 కోట్ల రూపాయలు, అనపర్తి లో కోటి 30 లక్షల రూపాయలు నిధులు కాజేసాడన్నారు. కరోనా సమయంలో పారిశుధ్య కార్మికుల జీతాలను ఉద్దేశపూర్వకంగా నిలుపుదల చేసి ఏరియర్స్ ను పిడి ఖాతాకు మళ్ళించి దోచుకున్నాడన్నారు. నూటికి పది రూపాయలు వడ్డీకి వ్యాపారం చేస్తూ రాజమండ్రిలో అక్రమంగా అపార్ట్మెంట్లు సంపాదించాడని, అంతేకాకుండా తాత్కాలిక పద్ధతిపై పారిశుద్ధ్య కార్మికుల పోస్ట్ లు సాంక్షన్ చేసే విషయంలో 6000 మంది కార్మికుల్లో ఒక్కొక్కరి దగ్గర నుంచి 5000 రూపాయలు వసూలు చేసి తన పైరవీని కొనసాగించాన్నారు. నిత్యం లిటిగేషన్లు పేరుతో పిటీషన్ లు పెట్టించి తన వద్దకు పిటిషన్లు వచ్చేలా చేసి క్రింది స్థాయి ఉద్యోగులను బెదిరించి బేరసారాలు చేసి కోట్లకు పడగలెత్తాడన్నారు. ఈ నేపథ్యంలో ఏవో వెంకటరెడ్డి పై ఇటీవల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో తనపై ఎంక్వయిరీకి జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో తక్షణం అతనిపై చర్యలు తీసుకోవాలని, తద్వారా కిందిస్థాయి ఉద్యోగుల మానసిక స్థైర్యాన్ని కాపాడాలని కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదులు పేర్కొన్నాయి. తక్షణం అతనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

# జిజిహెచ్ లో ఉన్న ప్రతి వార్డును క్షుణ్ణంగా పరిశీలించిన సూపర్డెంట్

**.....డాక్టర్ లావణ్య కుమారి..**

**కాకినాడ సిటీ:విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి శనివారం ఆసుపత్రిలో విభాగాల వారీగా రౌండ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థోపెడిక్, సర్జరీ, సైకియాట్రి అవుట్‌పేషంట్ విభాగాలను సందర్శించి, రోగులతో మమేకమై వారి సమస్యలు, చికిత్సా సదుపాయాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అక్కడ నుండి కేజువాల్టీ విభాగం, ట్రామా బ్లాక్‌ను పరిశీలించి, అత్యవసర సేవల అందుబాటు, వైద్య సిబ్బంది హాజరు, పరికరాల వినియోగంపై సమీక్ష చేశారు. రోగులను స్వయంగా ఆరా తీసి, వారికి మెరుగైన వైద్యం



అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఫార్మసీ విభాగంలో మందుల నిల్వలు మరియు రికార్డ్స్ ను, ఐవీ ఫ్లూయిడ్స్ అందుబాటు పరిస్థితిని డాక్టర్ లావణ్య కుమారి సమీక్షించారు. అవసరమైన సదుపాయాలను మెరుగుపరచాలని సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు అందించారు. ఇక నిర్మాణంలో కొనసాగుతున్న ఎంసిహెచ్ బ్లాక్ను సందర్శించిన డాక్టర్ లావణ్య కుమారి, పనుల పురోగతిని పరిశీలించి, ఏపీ ఎమ్ ఎస్ ఐ డీసీ అధికారులతో చర్చించారు. ఈ రౌండ్స్‌లో ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ %఑% డిప్యూటీ కలెక్టర్ ఎన్. శ్రీధర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్ మరియు హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## దేవస్థాన భూముల సమస్యపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే హర్షం తెలిపిన రైతులు



**ఎటపాక విశ్వం వాయిస్ న్యూస్:** పురుషోత్త పట్నం దేవస్థానం భూములు సమస్య పరిష్కరించాలని రంప చోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి శనివారం అసెంబ్లీలో మాట్లాడారు. అసెంబ్లీ దృష్టికి భూసమస్య తీసుకెళ్లినందుకు పురుషోత్త పట్నం రైతులు ఎమ్మెల్యే కి హర్షం తెలిపారు. శనివారం పురుషోత్త పట్నం లో జరిగిన విలేకర్ల సమావేశంలో రైతులూ మాట్లాడారు. గత 80 ఏళ్లు గా రైతులు సాగుచేసుకుంటున్న భూములు భద్రాచలం దేవస్థానం వారివని రైతులను దేవస్థానం అధికారులు ఎన్నో అడ్డకులు పెడుతున్న ఎదుర్కుంటూ వస్తున్నామని, మునుపెన్నడు చేయని సాహసం మన ఎమ్మెల్యే శిరీష దేవి రైతులు పక్షాన నిలబడి రైతు సమస్యలని ఇటీవల జరుగుతున్న ఏపీ లో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఎమ్మెల్యే రైతులు పక్షాన గళం విప్పారు. ఏళ్ళ తరబడి దేవస్థానం అధికారులతో రైతులూ భూవివాదం లో సమస్యలు పడుతున్నారని, వారు వ్యవసాయ బోర్లు వేసుకున్నామన్న, ఇండ్లు కట్టుకుందామని ఇళ్లు నిర్మిస్తే అధికారులు వారి సిబ్బందితో వచ్చి రైతులు పై దాడులు చేస్తున్నారన్నారు. భూ వివాద సమస్యను పరిష్కరింలాని అసెంబ్లీ లో ఎమ్మెల్యే కోరారు.
రైతులు ఎమ్మెల్యే శిరీష దేవి మఠం భాస్కర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి పురుషోత్తమ పట్నం రైతులు తరుపున మాట్లాడారు. ఎమ్మెల్యే కి రైతులు హర్షం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటి అధ్యక్షులు చేకూరి రమేష్, తెలుగు యువత ఉపాధ్యక్షులు కో కన్వీనర్ విజ్జ గిరి రవితేజ, బూత్ కన్వీనర్ పుట్టి వెంకట వాసు దేవరావు, ఆర్కిమల్ల చంద్ర రావు, రాయపాటి రాధ కృష్ణా, చుంచు వెంకటేశ్వరావు, నూతల పాటి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ లో ఉద్యోగం సాధించిన శ్రావ్య ను అభినందించిన గ్రామస్తులు

**ఎటపాక విశ్వం వాయిస్ న్యూస్::** ఎటపాక మండలం నెల్లిపాక గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన యాసాని శ్రావ్య కు మొదటి ప్రయత్నం లోనే డి య ఎస్సీ లో యస్ జి టి కొలువు సాధించింది. శ్రావ్య నాన్న అయిన యాసాని శ్రీనివాసరావు నెల్లిపాక గ్రామంలోనే చిన్న సెలూన్ షాప్ నడిపిస్తూ పిల్లలను కష్టపడి చదివించినాడు. టీచర్ ఉద్యోగం సాధించిన శ్రావ్యను గ్రామస్తులు అభినందించారు.



## కాకినాడలో జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమాలు ముమ్మరం....






**కాకినాడసిటీ:విశ్వం వాయిస్ న్యూస్** జీఎస్టీ 2.0 వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను విస్తృతంగా చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో కాకినాడలో అధికారులు అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. శనివారం సాయంత్రం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కే.టి. సుధాకర్ ఆదేశాల మేరకు, 44, 45 డివిజన్ల పరిధిలో టిపిఆర్ఓ శైలజ పర్యవేక్షణలో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. స్వయం శక్తి సంఘాల మహిళలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి, జీఎస్టీ తగ్గింపు ద్వారా ఎంత ఆదా అవుతుందో, ప్రజలకు ఏ విధంగా లబ్ధి కలుగుతుందో వివరించారు. అనంతరం దసరా ఉత్సవాల పందిరుల వద్ద ప్రజలను ఉద్దేశించి ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఎరువులు, ట్రాక్టర్లు, పురుగుమందులు, వాటర్ పైపులు, మోటార్లు వంటి వ్యవసాయ అవసరాలపై, అలాగే టూత్‌పేస్ట్‌లు, బ్రష్‌లు, నిత్యావసర వస్తువులు, వాహనాలు, మందులు వంటి ఉత్పత్తులపై గణనీయమైన ప్రయోజనం లభిస్తోందనిలిలి ప్రజలకు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో జీఎస్టీ శాఖాధికారులు బాలసుబ్రహ్మణ్యం, అజయ్ కుమార్, విజయనందం, కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారికి సారె, చీర సమర్పించిన చీపురుపల్లి వారి కుటుంబం...

**కరప:విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం నడకుదురు గ్రామంలో దసరా నవరాత్రి మహోత్సవంలో భాగంగా ఆరవ రోజైన శ్రీ కనకదుర్గఅమ్మవారికి ఈరోజు శ్రీ లలిత అన్నపూర్ణ దేవి అలంకరణలో ఉండడంతో



గ్రామంలోని ప్రతి ఒక్కరు అష్టైశ్వర్యాలతో సుఖ సంతోషాలతో అందరూ క్షేమంగా ఉండాలని ఆ అమ్మలకన్నా అమ్మను దర్శించుకుని కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా మా గ్రామంలో కొలువై ఉండాలని అమ్మవారికి చీపురుపల్లి వారి వీధి మహిళలు ఆ తల్లీకి భారీ ఏత్తున చీర సారి సమర్పించడం జరిగినది రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం కార్యదర్శి చీపురుపల్లి జయేంద్ర బాబు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మరియు ప్రజలు అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు, పాల్గొన్నారు



## సాయిప్రియ సేవా సమితి 165 వ వారం అన్నదానం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సాయిప్రియ సేవా సమితి ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కేంద్రం పిఠాపురం పశువుల సంతలో అన్నదాతలైన రైతులకుగా నిరవధికంగా వారానికి ఒక రోజు చొప్పున శనివారం మధ్యాహ్నం పూట ఆంధ్రా అన్నపూర్ణ డొక్కా సీతమ్మ గుర్తుగా డొక్కా సీతమ్మ అన్నపానీయ సదుపాయ కేంద్రం పేరుతో నిర్వహిస్తున్న అన్నదానం ఈ శనివారంతో 165 వ వారానికి చేరుకుంది. అన్ని దానాల కన్న అన్నదానం మిన్న అన్న లోకోక్తి అనుసారం దేశానికి వెన్నెముకైన అన్నదాతకు పెట్టెడు అన్నం పెట్టి వారిని ఆదుకుంటే అదే మహా భాగ్యమని భావించిన కాకినాడ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తలంచారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన శ్రీనివాస్ స్థానికంగా 2010 లో సాయిప్రియ సేవా సమితిని స్థాపించి, దానికి వ్యవస్థాపక అధ్యక్షులుగా కొనసాగుతూ శంఖవరం మండలం కత్తిపూడి కేంద్రంగా సాయిప్రియ సేవా సమితి ద్వారా వివిధ ప్రజాభివృద్ధి, సంక్షేమ, అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలను 15 ఏళ్ళుగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ డొక్కా సీతమ్మ అన్న సదుపాయ కేంద్రం పేరుతో పిఠాపురం పట్టణంలో పశువుల సంత కేంద్రంగా రైతులు, పశువుల బేరగాళ్ళు, మధ్యవర్తులు, స్థానిక వివిధ ఆస్పత్రులకు వచ్చే దూర ప్రాంతాల రోగులకూ ప్రతీ శనివారం మధ్యాహ్నం అన్నదానాన్ని నిర్వహిస్తూ ఉన్నారు. ఈ అన్నదానం ఈ శనివారంతో 165 వ వారానికి చేరుకుంది. దీనిని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తితో నిర్వహిస్తున్నారు. నేటి మధ్యాహ్నం రైతులకు, పశువుల బేరాల మధ్యవర్తులకు, వివిధ ఆస్పత్రులకు వచ్చిన ఔట్ పేషెంట్లకు కలిపి 600 మందికి అన్నదానం చేశారు. ఆహార పదార్థాలు వడ్డనలో స్వచ్ఛందంగా సేవలను అందించిన కోలా నాని, సఖినాల లచ్చబాబు, జ్యోతుల నాని, విప్పర్తి శ్రీనులను సాయిప్రియ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాసు అభినందించారు. తమ ఈ సేవలను పిఠాపురం పశువుల సంతకు వచ్చే రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని శంఖవరం మండలం కత్తిపూడిలోని సాయిప్రియా సేవా సమితి ప్రధాన కార్యాలయం ఓ ప్రకటనలో కోరింది.

## ఘనంగా ముగిసిన సాధన 2కె25.




**గొల్లప్రోలు, విశ్వం వాయిస్:** గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో ఆదర్ష్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మూడు రోజులపాటు జరిగిన సాంకేతిక విద్యా ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిఠాపురం నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్,ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులచే ప్రదర్శించబడిన పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్ పోలను ఆశక్తిగా తిలకించారు. అనంతరం ఎంపీ తంగెళ్ళ ఉదయ్ గెలుపొందిన విజేతలకు మెమెంటో, సర్టిఫికెట్లు పాటు నగదు, బహుమతులు అందజేశారు. మొట్టమొదటిగా నిలిచిన ప్రాజెక్ట్ లకు 50000రూపాయల నగదు చెక్కును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... ఆధునిక సమాజంలో టెక్నాలజీ రోజు రోజుకూ దూకుసుపోతుందని,దానికి తగినట్లుగా ఇంజనీరింగ్ విద్యలో మార్పులు జరుగుతున్నాయని తెలియజేశారు. ఏఐ నుంచి మంచి,చెడులు ఉన్నాయని, విద్యార్థులు కేవలం మంచికి మాత్రమే వాడి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి,కళాశాల చైర్మన్ బుర్రా అనుబాబు,సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బుర్రా అనురాధ, డైరెక్టర్ బుర్రా అఖిలేష్, డిప్లొమా ప్రిన్సిపల్ డాక్టర్ వై వి ఎన్ రాజశేఖర్, డీన్ డాక్టర్ ఎస్.కొండలరావు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## డిగ్రీ, జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయండి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేష్ ను అమరావతిలోని ఆయన కార్యాలయంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. నియోజక వర్గంలోని ఉన్నత విద్యా వ్యవస్థలో ఆవశ్య కంగా కల్పించాల్సిన సౌకర్యాల గురించి ఆయనకు విజ్ఞప్తి చేశారు. నియోజక వర్గంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు పూర్తి స్థాయిలో లేనందున విద్యార్థులు, వారి తల్లి, దండ్రులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ ఉన్నారని పేర్కొన్నారు. ఉన్నత విద్య కోసం విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని, చదువుపై ఆసక్తి ఉన్నప్పటికీ దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్థోమత, ఆర్థిక వనరులు లేక చాలా మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానుకోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయని మంత్రి వద్ద ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గ ప్రధాన కేంద్రం ప్రత్తిపాడులో ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను, అలాగే ప్రత్తిపాడు మండలం లంపకలోవలో ఒక ఇంటర్మీడియట్ కళాశాలనూ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే వినతిని పరిశీలించిన మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అందుకు ఆయనకు ఎమ్మెల్యే సత్యప్రభ కృతజ్ఞతలు తెలిపారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
ఆదివారం 28 సెప్టెంబర్ 2025
www.viswamvoice.com





# పిడిఎస్ యు రాష్ట్ర 24వ మహాసభలు జయప్రదం చేయండి

**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) రాష్ట్ర 24వ మహా సభలు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నవంబర్ నెలలో జరగబోతున్నాయి.ఈ మహాసభల నిర్వహణ కోసం శనివారం స్థానిక అంబేద్కర్ భవనంలో మహాసభల సన్నాహక సమావేశం జరిగింది.ప్రజా సంఘాల నాయకులు, ప్రజాస్వామిక వాదులు, కళాకారులు, మేధావులు తో కూడి 110 మందితో ఆహ్వాన సంఘం ఎన్నుకున్నారు.ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా పిడి ఎస్ యు మాజీ నాయకులు ప్రస్తుత అడ్వకేట్ ఎన్. లక్ష్మణరావు ను ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా,ప్రధాన కార్యదర్శిగా ఎస్.కిరణ్ కుమార్,కోశాధికారిగా భానుచందర్ ఎన్నుకోవడం జరిగింది.బి. సిద్దు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రొఫెసర్ డాక్టర్ టి సత్యనారాయణ, పీడి ఎస్ యు జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ పిడిఎస్ యు గత 51సంవత్సరాలుగా విద్యార్థుల హక్కుల కోసం సమాజ మార్పు కోసం పిడి ఎస్ యు నిరంతరం కృషి చేస్తుంది అన్నారు. జాతీయం గా, అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు పైనా, సామ్రాజ్యవాద విషసంస్కృతికి వ్యతిరేకంగా




రాజీలేని పోరాటాలు నిర్వహించిందని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ అక్షరాస్యతను అందించడంలోనూ, శాస్త్రీయమైన విద్యను రూపొందించడంలో పూర్తిగా ప్రభుత్వాలు విఫలమైనయని ఎద్దేవా చేశారు. మోడీ 2035 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తామని పేర్కొంటూ మరొకవైపు ప్రభుత్వ విద్యకు బడ్జెట్ లో నిధులు కేటాయించకుండా, ప్రభుత్వ పాఠశాలను రద్దు చేస్తూ ఎలా సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తారని అని ప్రశ్నించారు.పిడి ఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను తమ బాధ్యతను విస్మరించి ప్రైవేటీకరణ చేయటం దురదృష్టకరం అన్నారు . ప్రభుత్వ మెడికల్ కాలేజీ లను ప్రైవేటు వ్యక్తులకు ఎవరు ప్రయోజనం కోసం అప్పగికిస్తున్నారని ప్రశ్నించారు.విద్యార్థి వ్యతిరేక విధానాలు పట్ల పిడి ఎస్ యు రాజీలేని పోరాటం నిర్వహిస్తుందని అన్నారు. పిడి ఎస్ యు 24వ రాష్ట్ర మహాసభలకు అన్ని వర్గాల ప్రజలు ఆర్థిక, హార్దిక సహాయ, సహకారాలు అందించి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీడీఎస్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాను ప్రసాద్,దినేష్ రాజమండ్రి నగర కార్యదర్శి, అరుణోదయ ధర్మారెడ్డి , చిట్టిబాబు (ఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు) చంద్రశేఖర్, అడ్వకేట్ గుమ్మడి దేవి భవాని , బాలు దొర ,సూరిబాబు , రవణ,రాజారెడ్డి,చీకట్ల వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

## బూరుగుపూడి సొసైటీ అభివృద్ధికి పలు తీర్మానాలు.

**– త్రిసభ్య కమిటీ అధ్యక్షులు కంటే.**



**కోరుకొండ విశ్వం వాయస్ న్యూస్:** బూరుగుపూడి సొసైటీకి రైతులు సకాలంలో అప్పులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం నష్టాల్లో ఉందని దాన్ని అధిగమించడానికి పలు తీర్మానాలను ఆమోదిస్తున్నామని త్రిసభ్య కమిటీ అధ్యక్షులు కంటే నాగ కేశవరావు అన్నారు. శనివారం బూరుగుపూడి సొసైటీ ఆవరణలో సొసైటీ సర్వ జన మహా సమావేశం కంటే నాగ కేశవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సొసైటీ సీఈవో సుదర్శన్ మాట్లాడుతూ సొసైటీ 17.50 కోట్లలతో ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తుందన్నారు. రైతులు తీసుకున్న రుణాలు ఇంకా 4.25 కోట్ల రూపాయలు రావాల్సి ఉందన్నారు. రుణాలు చెల్లించన రైతులకు 71 నోటీస్ తో పాటు లీగల్ నోటీసులు ఇచ్చామన్నారు. అధ్యక్షులు నాగ కేశవరావు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధిలో భాగంగా పలు తీర్మానాలకు ఆమోదం తెలుపుతున్నామన్నారు. ప్రజలకు, రైతులకు ప్రభుత్వ సేవలు అందించడానికి సిఎస్సి సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. సొసైటీ భవనానికి సోలార్ యూనిట్ ఏర్పాటు, వచ్చే నెల 10వ తేదీన ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు, రైతు సేవా కేంద్రాలు బలోపేతం చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులు తీసుకున్న రుణాలను వెంటనే చెల్లించి, కొత్తగా రుణాలు తీసుకునే రైతులకు సుమారు నాలుగు కోట్లకు ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు బాలిన వెంకటేశ్వరరావు, ఎర్రంశెట్టి సూర్యనారాయణ, అడపా శ్రీనివాస్, సీఈవో సుదర్శన్, పలు గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ను కలిసిన దళిత సంఘాల నాయకులు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** స్థానిక బొమ్మూరు కలెక్టర్ కార్యాలయం నందు స్థిరవారం మధ్యాహ్నం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కి పూల బొకేతో సమర్పించి మర్యాద పూర్వకంగా దళిత సంఘాల నాయకులు మాజీ సర్పంచ్ పసలపూడి శ్రీనివాస్,తల్లిదండ్రుల సంఘం, రాజానగరం మండలం ఎస్సీ సెల్ మాజీ సెక్రెటరీ కొమ్ము సత్తిబాబు, జనసేన నాయకులు కొత్తపల్లి రఘు,నేకూరి రవికుమార్ కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ కుటుంబాలకు పిల్లలకు ఆర్ టి ఈ12 (1)సీ పథకాన్ని రాజమండ్రి చుట్టుపక్కల ప్రాంతాల్లో కొన్ని ప్రైవేట్ స్కూల్లో ఇవ్వట్లేదని, కలెక్టర్ దృష్టిలో పెట్టామని,మీకు ఏ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలియజేశారు అని సత్తిబాబు ఓ ప్రకటనలో వ్యక్తం చేశారు.

## దేవాలయాల అభివృద్ధికి, ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం.

**కోటిలింగాల సత్రం స్థాపించిన పెద్దల ఆశయాలు నెరవేరేలా నూతన పాలవర్గం కృషి చేయాలి. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** కూటమి ప్రభుత్వం హిందూ దేవాలయాల అభివృద్ధి, ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉంది,ఎంతో ఘన చరిత్ర కలిగిన కోటిలింగాల సత్రం స్థాపించిన పెద్దల ఆశయాలు నెరవేరే విధంగా పేద విద్యార్థులకు ఉపయోగపడేలా వేద పాఠశాల నిర్మాణానికి సహకారం అంద చేస్తానని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు( వాసు) హామీ ఇచ్చారు. కుటమి ప్రభుత్వం హిందూ దేవాలయాల అభివృద్ధికి, ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి ఉందన్నారు. స్థానిక శ్రీ పందిరి మహాదేవుడు సత్రం నూతన పాలకమండలి సభ్యులు చేత ఆలయ ఈవో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం సత్రం ఆవరణలో టిడిపి నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా రాజమండ్రి నగరంలోని దేవాలయ, ధర్మదాయ శాఖల కమిటీలు నియామకం జరుగుతుందన్నారు. ఇంతవరకు ఆరు కమిటీల నియామకం పూర్తిచేశామని, మరో ఏడు కమిటీలు త్వరలో నియామకం జరుగుతుందన్నారు. 1976 లో ఉదాత్తంగా స్థాపించిన ఈ కోటిలింగాల సత్రం ఎంతో పేరు కలిగినదని, నూతన పాలకవర్గం సత్రం అభివృద్ధికి, పేద విద్యార్థుల సంక్షేమానికి బాధ్యతతో పనిచేయాలని , ప్రభుత్వానికి ప్రజా ప్రతినిధులకు మంచి పేరు తేవాలని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 14 నెలల కాలంలో రాజమండ్రి నగరంలో సుమారు రూ. 170 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని ఆయన అన్నారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలో తమ కూటమి విజయదుందుభి సాధించడం ఖాయమన్నారు. కుటమి ప్రభుత్వం మహిళా పక్షపాతని, నగరంలో మహిళల సంరక్షణ కోసం ఎన్నో చర్యలు తీసుకున్నామన్నారు. నగరంలో బ్లేడ్ బ్యాచ్లు గంజాయి బ్యాచ్ లను 100 శాతం నియంత్రించామని ఆయన తెలిపారు. ప్రధాని మోడీ ఇటీవల జిఎస్టి పన్నులను సరళీకరించడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు లాభపడుతున్నారని అన్నారు. శ్రీ కోటిలింగాల సత్రం నూతన పాలకవర్గం చైర్మన్ గా నియమితులైన రెడ్డి మణి మాట్లాడుతూ సుమారు 40 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక సేవలందిస్తూ కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. ఎంతో ఘనచరిత్ర కలిగిన కోటిలింగాల సత్రం పాలకవర్గం చైర్మన్ గా నియమించిన కుటమి ప్రభుత్వ అధిష్టానానికి సీఎం చంద్రబాబు నాయుడుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాశీ తర్వాత దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కోటిలింగాల సత్రం అభివృద్ధికి, వేద పాఠశాల విద్యార్థుల సంక్షేమానికి పాలకవర్గం బాధ్యతగా నెరవేస్తామని ఆయన అన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడారు. నూతన పాలకవర్గాన్ని మిత్రులు, అభిమానులు, కూటమి నాయకులు పెద్ద ఎత్తున పూలమాలతో ఘనంగా సత్కరించి తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు వీరే**

శ్రీ కోటిలింగాల పందిరి మహాదేవుడు సత్రం నూతన పాలకమండలి చైర్మన్ గా రెడ్డి మణేశ్వరరావు, డైరెక్టర్లు గా గొర్రెల రమణి ,తుళ్ళి పద్మావతి, తాడి దుర్గ ప్రసాదు, కాకరాల పవన్ కుమార్ శర్మ, సలాది ఆనంద్, గంట పార్వతి, యందం ఇందిర, నల్లంశెట్టి వీరబాబు, గండే బత్తులరామకృష్ణ ప్రమాణస్వీకారం చేశారు.

## మెడికల్ కాలేజిలను ప్రైవేటు పరం చేయొద్దు..

- విద్యార్థుల జీవన స్థితిగతులపై ప్రభావం పడకుండా చూడాలి..
- మెడికల్ కాలేజీలపై ప్రభుత్వ ప్రతినిధుల అసత్య ప్రచారం ఆపాలి
- సబ్ కలెక్టర్ కి వైస్సార్ సిపి లీగల్ సెల్ నాయకుల విజ్ఞప్తి
- ప్రైవేటు పరం చేయొద్దంటూ ధర్నా, వినతి పత్రం అందజేత




**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** వైయస్సార్సీపి పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీసుకువచ్చిన 17 మెడికల్ వైద్య కళాశాలలను పిపిపి పేరుతొ ప్రైవేటీకరణ చేయడాన్ని ఆపాలని తూర్పుగోదావరి జిల్లా వైయస్సార్సీపి లీగల్ సెల్ అధ్యక్షుడు సి.పి.ఆర్ రెడ్డి, ఉభయగోదావరి జిల్లాల లీగల్ సెల్ కోఆర్డినేటర్ సాదిక్ హుస్సేను,పి.వీ.వి. ఎస్.బి రాజు డిమాండ్ చేసారు. ఈమేరకు రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి, ఏపీ స్టేట్ వై ఎస్ ఆర్ సి పి లీగల్ సెల్ ప్రెసిడెంట్ మలసాని మనోహర్ రెడ్డి పిలుపు మేరకు లీగల్ సెల్ ఈ కార్యక్రమాన్ని శనివారం చేపట్టింది. తొలుత అరగంటసేపు ధర్నా నిర్వహించి అనంతరం వినతి పత్రం అందజేసారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రానికి తీసుకువచ్చిన 17 మెడికల్ వైద్య కళాశాలలు కాలేజీలలో రాజమహేంద్రవరం పట్టణంతో కూడా ఇప్పటికే నిర్మితమైన ఐదు కాలేజీలలో క్లాసులు ప్రారంభమై విద్యార్థులు తమ విద్యనభ్య సిస్తున్నారని వారు తెలిపారు.ఈ 17 కాలేజీలను వైసిపి హయాంలో నిర్మించలేదని ప్రస్తుత కూటమి ప్రభుత్వ ప్రతినిధులు అసత్య ప్రచారా లు చేస్తున్నారని, దీనికి తోడు ఈ 17 కాలేజీలను పిపిపి విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి ప్రయత్నం చేస్తున్నారని వారు వివరించారు. అటువంటి ప్రయత్నాలను నిలుపుదల చేయాలని కోరారు.ఈ 17 మెడికల్ కాలేజీలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల జీవన స్థితిగతులను ఆలోచించాలని కోరారు. ఈ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే విద్యనభ్యసించే విద్యార్థుల నెత్తిన లక్షలాది రూపాయల ఫీజు భారం పడుతుందని, అది ఆ విద్యార్థుల తల్లిదండ్రుల మీద ఆధారపడి వారి జీవన స్థితిగతులపై పడుతుందని వారు పేర్కొన్నారు.అలాంటి విధానాలను నిలుపుదల చేయాలని వినతిపత్రం లో కోరారు.ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ నాయకురాలు హసీనా బేగం, సుమన్ పాల్, సిహెచ్ వి రామారావు చౌదరి,కొయ్యల నాగేశ్వరరావు,పి రామలింగారెడ్డి, సందాసి చినబాబు,సాయి కిరణ్, శివ, సిద్ధార్థ దొర, బి రాజు తదితరులు పాల్గొన్నారు.


## దేవీచౌక్ అమ్మవారిని దర్శించుకున్న ఏలూరు రేంజ్ ఐజి అశోక్ కుమార్



**రాజమహేంద్రవరం,విశ్వం వాయిస్ న్యూస్:** రాజమండ్రి దేవీచౌక్ లో శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి 92వ శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేలాది మంది భక్తులతో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించి పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం శ్రీ శ్యామలా దేవి అలంకారంతో దర్శనమిస్తున్న అమ్మవారిని కోస్తా రీజియన్ ఐజి జివిజి అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ దర్శించుకున్నారు. అమ్మవారికి పూజలు నిర్వహిచుకున్నారు. ఆశీస్సులు అందుకున్నారు. అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు తదితరులు కూడా పాల్గొన్నారు. వీరికి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బత్తుల రాజరాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు ,గంధం భైరవస్వామి,ఆకుల వెంకటేశ్వరావు, సెక్రటరీ అల్లక సత్యనారాయణ (సాంభం), కోశాధికారి బత్తుల ఈశ్వరరావు, సహాయ కార్యదర్శి ఆశపు మల్లిబాబు,సహాయ కోశాధికారి యండమూరి భాస్కరరావు కమిటీ సభ్యులు సంగీత వీరబాబు తోలేటి తోలేటి రాజేష్ (జాము) సంగీత రాజశేఖరు కందగడ్డ బ్రహ్మాజీ,అంక%శీ% తాతబ్బాయి,గంధ%శీ% రామకృష్ణదేవి ప్రధానార్చకులు దోంతం శెట్టి వెంకట కాళహశ్వరరావు, దోంతంశెట్టి నాగభూషణం, తదితరులు జ్ఞాపికలు అందజేసారు.

## చిరంజీవికి నాగబాబు - పవన్‌లు తమ్ముళ్ళా..! తోముళ్లా..!

**– రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ ఖండన..**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** చిరంజీవి అన్న అని చెప్పుకోవటాని నాగబాబు – పవన్ లు గర్వాంగా ఫీల్ అవ్వొచ్చును. నాగబాబు –పవన్ లు తమ్ముళ్లు అని చెప్పుకోవటానికి చిరంజీవి నేడు ఎలా ఫీల్ అవుతారు . ఈ అందమైన జీవితాన్ని నాగబాబు – పవన్ లకు ఇచ్చిన చిరంజీవి ని అసెంబ్లీ సాక్షిగా అవమానించిన బాలకృష్ణ ను ఖండించలేని తమ్ముళ్లు వుండి లేనట్టేనా ! ఆ నాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు ని హోటల్ వైశ్రాయ్ వద్ద సొంత కుటుంబం సాక్షిగా చెప్పులు, వాటర్ బాటిల్స్ తో దాడి జరిపించి అవమానించారు. నేటి రాజకీయ బిక్ష ,ఈ భోగాలు కల్పించిన అన్న చిరంజీవి కి అసెంబ్లీ సాక్షిగా జరిగిన అవమానాన్ని ఖండించలేని బలహీనత లతో తమ్ముళ్లు నాగబాబు – పవన్ కళ్యాణ్ లు వుండి ఉన్నట్టా ! లేనట్టా !! చిరంజీవి ప్రతిష్ట కన్నా నాగబాబు – పవన్ లకు రాజకీయ పదవులు ముఖ్యంగా మారాయి . నేడు ఎంటీఆర్ కు జరిగినది అవమానం అయితే నేడు చిరంజీవికి జరిగినది ద్రోహం కాదంటారా ! ప్రతి మెగాస్టార్ చిరంజీవి అభిమాని ఈ అవమానాన్ని ముక్త కంఠంతో రాజకీయాలకు అతీతంగా ఖండించాలి.మా "రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ "అసెంబ్లీ సాక్షిగా చిరంజీవికి జరిగిన అవమానాన్ని ఖండిస్తున్నాము. నాగబాబు – పవన్ కళ్యాణ్ లకు చిరంజీవి పై ప్రేమకన్నా బాలకృష్ణతో భయమే వెంటాడుతున్నట్టుగా కనపడుతుంది.ఏది నిజమో ఇప్పటికైనా నాగబాబు – పవన్ లు నోరు మెదపాలి. రాజకీయాలు నేడు ఉంటాయి,రేపు పోతాయి కాని అన్నయ్య చిరంజీవి శాశ్వతం అనే లాజిక్కు నాగబాబు – పవన్ లు ఎలా మిస్ అవుతున్నారు .. ఎంటీఆర్ ను దురదృష్టం వెంటాడితే చిరంజీవి ని అదృష్టం అనే రూపంలో శాపం వెంటాడుతుందా ! తరువాత నాగబాబు – పవన్ లు ఎన్ని క్షమాపణలు చెప్పినా చిరంజీవికి మాత్రం తమ్ముళు సాక్షిగా వెల కట్టలేని అవమానం జరిగింది. అసెంబ్లీ కి ఎట్టి సంబంధం లేని చర్చను బాలకృష్ణ వ్యూహాత్మకంగా మెగా కాంపౌండ్ లో చిచ్చు పెట్టి నట్టుంది .ఈ రచ్చను అవసరార్థం ఏ పార్టీ వారైనా తెరపైకి తెవొచ్చును . ముగించ వచ్చును. అసెంబ్లీ సాక్షిగా చిరంజీవి కి జరిగిన అవమానం నాగబాబు –పవన్ లకు రెండవ రాజకీయ బిక్ష పెట్టిన పిఠాపురం ప్రజల ప్రతిష్ట కు ఆత్మగౌరవానికి ప్రతీకగా మారింది . నాగబాబు –పవన్ లు వివరణ ఇవ్వకపోతే గడ్డు పరిస్తుతులు తప్పవు..

# వరదలకు వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**ఎకరాకు 50 వేలు నష్టపరిహారం చెల్లించాలి**

**వై ఎస్ ఆర్ సీ పీ మండల అధ్యక్షులు.. ఆకుల. వెంకటరామారావు**

**ఎటపాక విశ్వం వాయిస్ న్యూస్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, గోదావరి వరదలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వము ఎకరాకు 50 వేల రూపాయల నష్టపరిహారాన్ని అందజేసి రైతులను ఆదుకోవాలని ఎటపాక వైసీపీ మండల అధ్యక్షులు ఆకుల. వెంకట రామారావు పత్రికా ప్రకటన లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎటపాక మండలంలోని మురుమూరు, నందిగామ, గౌరీదేవిపేట, గన్నవరం, తోటపల్లి, నెల్లిపాక గోదావరి నది పరిహాహక గ్రామాలలో వర్షం, గోదావరి వరదల వల్ల రైతులు పూర్తిగా నష్ట పోయారనీ, రైతులను ఆదుకోవడం లో అధికార ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు.మండలం లోని రైతులు మిర్చి, పత్తి పంటలకు ఇప్పటికే ఎకరాకు 20 వేలు పెట్టుబడీ పెట్టారు, ప్రభుత్వం నష్ట పోయిన పంటలకు ఎకరానికి 50 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఎగువ కురిసిన గోదావరి వరదతో పాటు, పంటలు నీట మునిగి రైతులకు భారీగా నష్టం వాటిల్లితుందని ప్రభుత్వ గడిచిన రెండు నెలలు గడిచిన ఇంతవరకు స్పందించకపోవడం బాధాకరమన్నారు. అంతేకాకుండా కొన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు గండ్లు పడిపంట పొలాల్లో రాళ్లు, ఇసుక, మట్టి పేరుకుపోయి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకు రైతులకు నష్టపరిహారం అందజేస్తామని సరైన ప్రకటన చేయలేదని, పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందజేయాలని, అలాగే గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలలో పోలవరం బ్యాక్ వాటర్ తో ముంపుకు గురవుతున్న భూములకు ప్రభుత్వం శాశ్వత నష్టపరిహారంగా ఎకరాకు 25 లక్షల రూపాయలు నష్టపరిహారంగా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. భారీ వర్షాల కారణంగా మండలంలోనే అత్యధికంగా పంటలు నీట మునిగి నష్టపోయాయని, ఇటీవల పంజాబ్ రాష్ట్రంలో పంటలు నష్టపోయిన రైతులకు అక్కడి ప్రభుత్వం ఎకరాకు 30 వేల రూపాయల నష్టపరిహారాన్ని ప్రకటించిందని, పంజాబ్ కంటే



ముందుగా ఆంధ్రప్రదేశ్ లో భారీ వర్షాలు కురిసి ప్రజలతో పంటలు నష్టపోయాయని, పంటలు నష్టపోయి నెలరోజులు దగ్గర పడుతున్న ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ముంపునకు గురైన రైతుల పంటల వివరాలు నమోదు చేశామని ప్రభుత్వానికి నివేదిస్తున్నామని అందరికీ నష్టపరిహారం అందేలా రెవెన్యూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పూర్తి నివేదిక తయారు చేస్తున్నామని అలాగే వారం రోజుల్లో ప్రభుత్వం నుండి తమకు స్పష్టమైన హామీ రాకపోతే మరో ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు.

# కన్నీటి కరూర్



-మొదటిపేజీ తరువాయి

'ర్యాలీ'లు నిర్వహిస్తున్నారు. శనివారం... నామక్కల్, కరూర్‌లో సభలు ఏర్పాటు చేశారు. ఉదయం పది గంటలకు నామక్కల్ రావాల్సిన విజయ్... మూడు గంటలు ఆలస్యంగా అక్కడికి చేరుకున్నారు. సాయంత్రం 3 గంటలకు కరూర్‌లోని వేలుచామిపురం వద్దకు విజయ్ వస్తారని నిర్వాహకులు ప్రకటించారు. కానీ... ఉదయం 11 గంటల నుంచే కరూర్ వీధులు జనంతో కిక్కిరిసిపోయాయి. తమ అభిమాన (కథా)నాయకుడిని చూసేందుకు యువకులతోపాటు... పిల్లలు, మహిళలూ భారీగా తరలి వచ్చారు. ఎండ మండిపోతున్నా లెక్క చేయకుండా గంటలకొద్దీ వేచి చూశారు. చివరికి... నాలుగు గంటలు ఆలస్యంగా రాత్రి 7 గంటల తర్వాత విజయ్ అక్కడికి చేరుకున్నారు. తన సభల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న బస్సు పైకి ఎక్కి విజయ్ ప్రసంగం ప్రారంభించగానే... అభిమానులు ఉర్రూతలూగిపోయారు. ఆయన ప్రసంగం ముగియడానికి కొద్దిసేపటి ముందే తొక్కిసలాట మొదలైంది. తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అప్పటికే నీరసించిన జనంలో కొందరు స్పృహతప్పి పడిపోయారు. ఇది గమనించిన విజయ్ టీమ్ అప్రమత్తమైంది. విజయ్ కూడా తన ప్రసంగాన్ని ఆపివేసి... బస్సు పైనుంచే వాటర్ బాటిళ్లు విసిరేశారు. విజయ్ అక్కడి నుంచి బస్సులో బయలుదేరగానే... పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. ఉదయం నుంచి ఎండలో ఉండి... మాడిపోయిన జనం ఒక్కసారిగా అక్కడి నుంచి కదిలారు. విజయ్‌ని స్పష్టంగా చూడాలని గోడలు, చెట్లు ఎక్కిన వాళ్లు కిందికి దూకారు. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో చీకట్లు అలుముకున్నాయి. అసలే ఇరుకు రోడ్డు... చీకటి... అటు జన ప్రవాహం, ఇటు ఒకరిమీద ఒకరు పడటంతో తొక్కిసలాట మొదలైంది. పెను విషాదానికి ఇదే కారణమైంది.

**హాహాకారాలు... ఆర్తనాదాలు**

తొక్కిసలాట సమయంలో పోలీసులూ అసహాయులుగా మారిపోయారు. పరిస్థితిని అదుపులోకి తేవడం వారికి అసాధ్యంగా మారింది. చీకట్లో ఏం జరుగుతోందో ఎవరికీ అర్థం కాలేదు. తొక్కిసలాటలో చిక్కుకున్న జనం ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైపోయారు. 'సాయం చేయండి... ప్లీజ్... పోలీస్' అంటూ ఆర్తనాదాలు చేశారు. చాలామంది అక్కడే స్పృహ కోల్పోయారు. దారులన్నీ జనసంద్రంగా మారడంతో అంబులెన్స్‌లు కూడా వేగంగా చేరుకోలేకపోయాయి.

**కన్నీటి సంద్రంలా కరూర్ ప్రభుత్వాస్పత్రి**

క్షతగాత్రులను తరలించేందుకు సమారు 50 అంబులెన్స్‌లను ఉపయోగించారు. క్షతగాత్రులు, మృతదేహాలు, బాధిత కుటుంబీకుల రోదనలతో కరూర్ ప్రభుత్వాసుపత్రి శోకసముద్రంలా మారింది. ఒక్కో అంబులెన్సులో నలుగురైదుగురు క్షతగాత్రులను కూడా తీసుకొచ్చారు. ఇక్కడ 80 మందికి పైగా క్షతగాత్రులు ఈ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొంతమంది క్షతగాత్రులు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు.

**విచారణకు ఆదేశం...**

ఈ విషాదంపై ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయంలో ఉన్నతస్థాయిలో సమీక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.లక్ష చొప్పున అందిస్తామని ప్రకటించారు. అలాగే... ఈ ఘటనపై హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలో న్యాయ విచారణకు ఆదేశించారు. ఆదివారం ఉదయం కరూర్ వెళ్లాలని భావించినప్పటికీ... శనివారం రాత్రికే ప్రత్యేక విమానంలో అక్కడికి చేరుకున్నారు. జరిగిన విషాదంపై విచారణకు ఆదేశించారు. ఇక... స్టాలిన్ కుమారుడు, మంత్రి ఉదయనిధి స్టాలిన్ తన దుబాయ్ పర్యటనను రద్దు చేసుకుని, విమానాశ్రయం నుంచి నేరుగా కరూర్ చేరుకున్నారు.

**నా గుండె బద్దలైంది: విజయ్**

కరూర్ నుంచి తిరుచ్చి విమానాశ్రయం చేరుకున్న నటుడు విజయ్.. మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. ఆ తర్వాత ఆయన దీనిపై ఒక ప్రకటన విడుదల చేశారు. "నా గుండె బద్దలైపోయింది. భరించలేని బాధతో విలవిలలాడుతున్నాను. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని విజయ్ పేర్కొన్నారు.

**ప్రముఖుల దిగ్భ్రాంతి**

కరూర్ విషాదంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తమిళనాడు గవర్నర్ రవి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితర ప్రముఖులు కూడా బాధితులకు తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

**అదుపు చేయలేకనే.. విషాదాలు**

ఫిబ్రవరిలో ఢిల్లీలోని రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట జరిగి 18 మంది ప్రాణాలు కోల్పోయారు.. జూన్‌లో బెంగళూరులో ఆర్సీబీ జట్టు ఐపీఎల్ విజయోత్సవ కార్యక్రమం నేపథ్యంలో తొక్కిసలాట జరిగి 11 మంది చనిపోయారు.. ఇప్పుడు తమిళనాడులో విజయ్ రాజకీయ సభలో తొక్కిసలాటలో 38 మంది వరకు మృతి చెందారు.. వీటన్నింటికీ కారణం తక్కువ స్థలంలో ఎక్కువ మంది గుమిగూడటం, ఎవరికి వారు తామే ముందుకు దూసుకుపోవడానికి ప్రయత్నించడం.. అన్నింటికన్నా ముఖ్యంగా గుంపును కట్టడి (క్రౌడ్ మేనేజ్‌మెంట్) చేయలేకపోవడమే. మన దేశంలో రైల్వేస్టేషన్లు, బస్టాండులు, మార్కెట్లు, సినిమా హాళ్లు వంటివి ఎప్పుడూ కిక్కిరిసే కనిపిస్తాయి. ఇక జాతరలు, వేడుకల సమయంలో జనం గుమిగూడటమూ సాధారణమే. దానికితోడు సినీ నటుల కార్యక్రమాలు, రాజకీయ సభలు, ర్యాలీలకు భారీగా జనం పోటెత్తుతుంటారు. అలాంటి చోట్ల తొక్కిసలాట జరగకుండా జనాన్ని కట్టడి చేయడమే కీలకం. తగిన భద్రతా ఏర్పాట్లు చేయడం నుంచి ఆధునిక సాంకేతికతను వినియోగించడం దాకా ఇందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వరల్డ్ రీసోర్సెస్ ఇనిస్టిట్యూట్ ఇండియా నివేదిక ప్రకారం.. ఏ ప్రదేశంలోనైనా ప్రతి చదరపు మీటరుకు నలుగురు వ్యక్తులు ఉంటే అది కిక్కిరిసిన పరిస్థితి. అదే ఆరుగురి చొప్పున ఉంటే ప్రమాదకర పరిస్థితి. తొక్కిసలాటకు అవకాశం ఎక్కువ.

ప్రస్తుతం హెచ్‌డీ కెమెరాలు, అవి చిత్రీకరించే దృశ్యాల ఆధారంగా గుమిగూడిన జనం పరిస్థితిని విశ్లేషించే సాంకేతికతలు అందుబాటులోకి వచ్చాయి. ఎక్కడ ఎక్కువ జనం గుమిగూడారు? గుంపులో జనం ఎటువైపు కదులుతున్నారు? తొక్కిసలాట జరిగే పరిస్థితి నెలకొందా? అన్నది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. జనాన్ని నియంత్రించేలా, మరోవైపు మళ్లించేలా క్షేత్రస్థాయిలోని సిబ్బందిని సూచనలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఇక భారీగా గుమిగూడిన జనం మధ్య అక్కడక్కడా ఖాళీ ప్రదేశం ఉండేలా ఏర్పాట్లు చేయాలని.. ఏదైనా ఇబ్బంది ఏర్పడితే తొక్కిసలాట జరగకుండా ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. జనం గుమిగూడిన ప్రాంతానికి సినీ నటులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు వస్తే.. వారిని చూడటానికి అంతా ఒక్కసారిగా ఎగబడి తొక్కిసలాటకు దారితీస్తుంది. అలాంటి సమయంలో కచ్చితమైన ముందుజాగ్రత్త చర్యలు చేపట్టేలా కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. జనం కిక్కిరిసిపోయే పరిస్థితి ఏర్పడితే ముందుగానే జాగ్రత్తపడేలా ప్రజల్లో అవగాహన కల్పించడమూ కీలకం.

**ప్రభంజనం... ఆంక్షలు... వివాదాలు!**

ప్రేక్షకులకు, ప్రజలకు విజయ్‌గా సుపరిచితుడైన ఆయన పూర్తి పేరు... జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్! తమిళనాట 'ఇలయ దళపతి'గా పేరు తెచ్చుకున్నారు. తమిళనాట విజయ్ రాజకీయ రంగ ప్రవేశం పెను సంచలనం సృష్టించింది. గత ఏడాది 'తమిళ వెట్రి కళగం' (తమిళ విజయం పార్టీ) ఏర్పాటు చేశారు. అక్టోబరు 27న విల్లుపురంలో తొలి రాజకీయ సభకు భారీగా జనం తరలి వచ్చారు. ఆ తర్వాత... నిర్వహించిన సభల్లోనూ ఇదే పరిస్థితి. సభలకు వచ్చే జనాన్ని అదుపు చేయడం పోలీసులకు కష్టసాధ్యంగా మారింది. దీంతో విజయ్ ప్రచారానికి పలు నిబంధనలు విధించారు. అయితే దీనిని సవాల్ చేస్తూ ఆయన పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. న్యాయస్థానం పోలీసుల నిబంధనల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూనే, అన్ని పార్టీల నేతల ప్రచారానికి ఒకే విధమైన నిబంధనలు

# కాళ్లబేరానికి వచ్చిందనే కనికరించాం!

ఐక్యరాజ్యసమితి

ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకోవడం వల్లనే భారత ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించిందంటూ ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలను అదే వేదిక నుంచి భారత్ గట్టిగా తిప్పికొట్టింది. పాకిస్తాన్ సైన్యం కాళ్లబేరానికి వచ్చి ప్రాధేయపడడం వల్లే దాడులు ఆపేశాం తప్ప ఇందులో మూడో వ్యక్తి ప్రమేయం ఎంతమాత్రం లేదని తేల్చిచెప్పింది. భారత్, పాకిస్తాన్ ద్వైపాక్షిక వ్యవహారాల్లో మూడోపక్షం జోక్యాన్ని అంగీకరించే ప్రసక్తే లేదని మరోసారి స్పష్టంచేసింది. ఐక్యరాజ్యసమితిలో భారత ప్రతినిధి పెటల్ గహ్లోత్ శుక్రవారం సాయంత్రం ఐరాస సాధారణ సభ(జనరల్ అసెంబ్లీ) సమావేశంలో ప్రసంగించారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌పై నిప్పులు చెరిగారు. అర్థంపర్థంలేని అసంబద్ధమైన మాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఉగ్రవాదాన్ని గొప్పగా కీర్తించడం, ఆకాశానికి ఎత్తేయడం ఆయనకే చెల్లిందని ధ్వజమెత్తారు. పాకిస్తాన్ విదేశాంగ విధానానికి ఉగ్రవాదమే మూలస్తంభంగా మారిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో చావుదెబ్బ తిన్న పాకిస్తాన్ కింద పడినా తనదే పైచేయి అని చెప్పుకోవడానికి ఆరాట పడుతోందని ఎద్దేవా చేశారు. పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిందని, పాకిస్తాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లోని ఉగ్రవాద స్థావరాలను, శిక్షణ కేంద్రాలను, ఎయిర్‌బేస్‌లను నేలమట్టం చేసిందని గుర్తుచేశారు. పెటల్ గహ్లోత్ ఇంకా ఏం మాట్లాడారంటే...

**అందుకేనా మీ సంబరాలు?**

" ఈ ఏడాది మే 7న ఆపరేషన్ సిందూర్




ప్రారంభమైంది. భారత్‌పై మరిన్ని దాడులు చేస్తామంటూ మే 9 దాకా పాకిస్తాన్ బెదిరింపులకు దిగింది. వెంటనే దాడులు ఆపాలంటూ మే 10న భారత్‌ను పాక్ సైన్యం వేడుకుంది. మూడో వ్యక్తితో సంబంధం లేకుండా నేరుగా సంప్రదించింది. భారత సైన్యం చేపట్టిన వైమానిక దాడుల్లో భారీగా నష్టం వాటిల్లడంతో పాకిస్తాన్‌కు తత్వం బోధపడింది. ఆపరేషన్ సిందూర్‌లో పాక్ కీలక వైమానిక కేంద్రాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆ ఫొటోలు బయటకు వచ్చాయి. అవి ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా చూడొచ్చు. భారత్‌పై జరిగిన యుద్ధంలో విజయం సాధించామని షెహబాజ్ షరీఫ్ చెప్పుకుంటున్నారు. పూర్తిగా ధ్వంసమైన రన్‌వేలు, మంటల్లో కాలిపోయిన హ్యాంగర్లు ఆయనకు విజయంగా కనిపిస్తున్నాయా?

**ఉగ్రవాదులకు అధికారుల నివాళులా?**

పాకిస్తాన్ భూభాగంలోని బహవల్పూర్, మురిద్కేలో ఉగ్రవాద శిబిరాలు, శిక్షణ కేంద్రాలు నామరూపాల్లేకుండాపోయిన చిత్రాలు మనమంతా చూశాం. భారత సైన్యం దాడుల్లో కరడుగట్టిన ఉగ్రవాదులు హతమైపోయారు. వారి అంత్యక్రియలకు పాకిస్తాన్ సీనియర్ సైనికాధికారులు, ప్రభుత్వాధికారులు స్వయంగా హాజరయ్యారు. నివాళులర్పించారు. ముష్కరులను గొప్ప వ్యక్తులుగా పరిగణించడం పాకిస్తాన్ విధానమని మరోసారి తేలిపోయింది.

**వారిని శిక్షించాల్సిందే**

పహల్గాంలో పర్యాటకుల ప్రాణాలను బలి తీసుకున్న 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్'ను ఏప్రిల్ 25న ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో వెనకేసుకొచ్చింది పాకిస్తాన్ కాదా? పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ భద్రతా మండలి జారీ చేసిన ప్రెస్ స్టేట్‌మెంట్‌లో టీఆర్ఎఫ్ పేరును ఎవరు తొలగించారు? డ్రామాలు, అబద్ధాలు నిజాన్ని కప్పిపుచ్చలేవు. పహల్గాం దాడికి కారణమైన ముష్కరులను, వారి పోషకులను చట్టం ముందు నిలబెట్టి శిక్షించాల్సిందే.

**ఉడత ఊపులకు భారత్ భయపడదు**

ఉగ్రవాదంపై భారత్ వైఖరి స్పష్టంగా ఉంది. ఉగ్రవాదులను, వారి పోషకులను వేర్వేరుగా చూడడం లేదు. భారత్ దృష్టిలో వారంతా ఒక్కటే. వారిని శిక్షించాల్సిందే. అణుబాంబులు ఉన్నాయని బెదిరిస్తూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తామంటే సహించే ప్రసక్తే లేదు. అలాంటి ఉడత ఊపులకు భారత్ ఎప్పటికీ భయపడదు. ఎవరికీ తలవంచదు. భారత్‌తో సమగ్ర చర్చలకు సిద్ధంగా ఉన్నామని షెహబాజ్ షరీఫ్ చెబుతున్నారు. చర్చలు జరగాలని ఆయన నిజాయితీగా కోరుకుంటే 'తొలుత పాకిస్తాన్ గడ్డపై ఉన్న ఉగ్రవాద కేంద్రాలన్నింటినీ మూసివేసి ఉగ్రవాదులను మాకు అప్పగించాలి. ఆ తర్వాతే చర్చలు. మతోన్మాదం, విద్వేషం, అసహనం అనే రొచ్చులో చిక్కుకున్న పాకిస్తాన్ ఐక్యరాజ్యసమితి వేదికపై విశ్వాసం, శాంతి గురించి బోధనలు చేయడం విచిత్రంగా ఉంది" అని పెటల్ గహ్లోత్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

## ప్రపంచ ఉగ్రవాద కేంద్రం పాకిస్థాన్

న్యూయార్క్

ఉగ్రవాదాన్ని అధికార విధానంగా కలిగిన పొరుగుదేశం(పాకిస్థాన్) ప్రపంచ ఉగ్రవాద కేంద్రంగా నిలిచిందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చెప్పారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించరాదని, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం అందకుండా చూడాలని ఆయన ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో ప్రసంగిస్తూ చెప్పారు. ఉగ్రవాద మూలాలను ఉమ్మడిగా పెకిలించి వేయాలని ఆయన ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. పహల్గాంలో ఉగ్రవాదులు పాశవిక దాడి జరిపారని, ప్రతిగా భారత్ పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వసం చేసిందని చెప్పారు. గాజాలో శాంతి నెలకొనాలని, దీని కోసం భారత్ సహకరిస్తుందన్నారు. ఇదిలా ఉండగా, ఆపరేషన్ సిందూర్ వేళ కాల్పుల విమరణ విషయంలో మూడో దేశం ప్రమేయం లేదని.. మూడో వ్యక్తి ప్రమేయం అంతకన్నా లేదని భారత్ ఐరాస వేదికగా స్పష్టం చేసింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి పటేల్ గహ్లోత్ కీలక ప్రకటన చేశారు. "మే 9వ తేదీ వరకు భారత్‌పై కాల్పులకు పాల్పడుతూ.. పాక్ బెదిరింపు ధోరణిని ప్రదర్శించింది. కానీ, మే 10న భారత్‌తో పాక్ సైన్యం కాళ్లబేరానికి వచ్చింది. అయితే.. పాక్ ప్రధాని..తమ దేశంలో ధ్వంసమైన రన్‌వేలు తమ విజయమని భావిస్తే.. వారు ఆనందించవచ్చు" అని ఎద్దేవా చేశారు.

# గ్రీన్‌కార్డుకు కఠిన నిబంధనలు

**నేచురలైజేషన్ పరీక్షలో రెండు అవకాశాలు మాత్రమే**
**రెండో ప్రయత్నంలో విఫలమైతే పౌరసత్వం రానట్లే**
**సీనియర్ సిటిజన్లకు పరీక్షలో స్వల్ప మినహాయింపు**




న్యూఢిల్లీ

అమెరికాలో గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్న విదేశీయులు అక్టోబర్ 20 నుంచి అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్ఐసీఎస్) కొత్త విధాన ం కింద కఠినమైన నిబంధనలు ఎదుర్కోవలసి ఉంటుంది. ఇకపై దరఖాస్తుదారులు పౌర విధులకు సంబంధించిన ప్రశ్నలకు సరైన జవాబులు ఇవ్వాల్సి ఉంటుంది. వారి వ్యక్తిగత ప్రవర్తననూ నిశితంగా పరిశీలిస్తారు.ఎన్–400 ఫారాన్ని దాఖలు చేసిన విదేశీయులకు 2025 నేచురలైజేషన్ (సహజీకరణ) (పౌరసత్వ) పౌర శాస్త్ర పరీక్షను అక్టోబర్ 20న లేక ఆ తర్వాత నిర్వహిస్తామని యూఎస్ఐసీఎస్ తన వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ఈ పరీక్ష మౌఖికంగా ఉంటుంది. 128 ప్రశ్నల జాబితాలో 20 ప్రశ్నలు మౌఖిక పరీక్షలో ఉంటాయి. పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలంటే దరఖాస్తుదారులు 12 ప్రశ్నలకు సరైన జవాబులు ఇవ్వాల్సి ఉంటుంది. 20 ప్రశ్నలలో 9 ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా చెబితే పరీక్షలో ఫెయిల్ అవుతారు. అభ్యర్థి 12 ప్రశ్నలకు సరైన సమాధానాలు చెబితే అధికారులు ఇక ప్రశ్నలు అడగడం ఆపేస్తారు. అలాగే 9 ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వలేకపోతే కూడా ప్రశ్నలు అడగడం ఆపేస్తారు అని యూఎస్సీఐఎస్ తన వెబ్‌సైట్‌లో వివరించింది. అయితే 65 ఏళ్లు పైబడి, కనీసం 20 ఏళ్లుగా స్థానికంగా నివసిస్తున్న వారికి మాత్రం ప్రత్యేక నిబంధనలు కొనసాగుతాయి. వారు 10 ప్రశ్నలలో 6 ప్రశ్నలకు సరైన జవాబిస్తే పాస్ అయిపోతారు. నేర కార్యకలాపాలకు దూరంగా ఉన్నారా లేదా అన్న విషయంతోపాటు అమెరికా సమాజానికి అందచేసిన సేవలు ఏమిటన్న అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తారు. 1991 నుంచి పక్కనపెట్టిన పొరుగువారి నుంచి ఆరా తీయడం కూడా మళ్లీ చేపట్టాలని యూఎస్ఐసీఎస్ నిర్ణయించుకుంది. దరఖాస్తుదారుడు పనిచేస్తున్న సంస్థ యాజమాన్యం, సహ ఉద్యోగులు, ఇంటికి సమీపంలో నివసిస్తున్న వారి నుంచి కూడా అధికారులు ఆరా తీయనున్నారు. పౌరసత్వ పరీక్షలో ఉత్తీర్ణులు అయ్యేందుకు అభ్యర్థులకు రెండు అవకాశాలు ఉంటాయని, రెండవ ప్రయత్నంలో కూడా ఫెయిల్ అయితే పౌరసత్వాన్ని తిరస్కరించినట్లుగా పరిగణించాలని యూఎస్సీఐఎస్ తెలిపింది.

**వీసా కోసం అందరూ ఇంటర్వ్యూకు హాజరవాల్సిందే**

'వీసా ఇంటర్వ్యూ మినహాయింపు' నిబంధనల్లో చేసిన మార్పులు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రాబోతున్నాయి. దీనివల్ల ఎంతోమంది అభ్యర్థులు, 18 ఏండ్ల లోపు, 79 ఏండ్లు దాటినవారు కచ్చితంగా అమెరికా ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది

# ఇక స్వదేశీ 4జీ!

ఝార్సుగూడ



ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ సేవలు దేశ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఒడిశాలోని ఝార్సుగూడలో ఈ సేవలను ప్రారంభించారు. అలాగే రూ.37,500 కోట్ల వ్యయంతో పూర్తి స్వదేశీ సాంకేతికతతో నిర్మించిన 97,500కు పైగా 4జీ మొబైల్ టవర్లను కూడా ఆయన ప్రారంభించారు. దీంతో టెలికాం పరికరాలను సొంతంగా ఉత్పత్తి చేసే చైనా, డెన్మార్క్, స్వీడన్, దక్షిణ కొరియాల సరసన భారత్ చోటు దక్కించుకుంది. ఈ నెట్‌వర్క్ పూర్తిగా క్లౌడ్ ఆధారితమైనదని, భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేయవచ్చని అధికారులు తెలిపారు. ప్రధాని మోదీ కలలకు ప్రతిరూపమైన డిజిటల్ ఇండియా లక్ష్య సాధనలో ఇదొక మైలురాయిగా పేర్కొన్నారు. దీంతో 26,700కు పైగా గ్రామాల్లో 20 లక్షల మందికిపైగా కొత్త వినియోగదారులకు 4జీ సేవలు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. అదేవిధంగా డిజిటల్ భారత్ నిధి ద్వారా 30వేల గ్రామాలను అనుసంధానించే లక్ష్యంతో 100శాతం 4జీ శాచ్యురేషన్ నెట్‌వర్క్‌తో పాటు ఒడిశాలో రూ.60వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు. 8ఐఐటీల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.37,500 కోట్ల వ్యయంతో 97,500కు పైగా 4జీ మొబైల్ టవర్లు ఏర్పాటు. వీటిలో చాలవరకూ సౌర శక్తితో పనిచేసేవి కావడంతో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ టెలికం సైట్‌ల క్లస్టర్‌గా గుర్తింపు. 100శాతం 4జీ శాచ్యురేషన్ నెట్‌వర్క్‌తో దేశవ్యాప్తంగా దాదాపు 30వేల గ్రామాలకు 4జీ సేవలు.

క్లౌడ్ ఆధారిత నెట్‌వర్క్ కావడంతో భవిష్యత్తులో సులభంగా 5జీకి అప్‌గ్రేడ్ చేసే అవకాశం.


**సహకరించిన టెక్ దిగ్గజాలు**

స్వదేశీ 4జీ నెట్‌వర్క్ రూపకల్పనలో బీఎస్ఎన్ఎల్‌తో పాటు టెక్ దిగ్గజాలైన టీసీఎస్, సీ–డాట్, తేజస్ నెట్‌వర్క్ లిమిటెట్ కీలక పాత్ర పోషించాయి.
టీసీఎస్ – డేటా సెంటర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ నిర్వహణ
తేజస్ నెట్‌వర్క్ – రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ (ఆర్ఏఎన్)

**ప్రజలను దోచుకున్న కాంగ్రెస్**

కాంగ్రెస్ పార్టీ ప్రజలను దారుణంగా దోచుకుందని మోదీ ఆరోపించారు. అల్పాదాయ వర్గాలను కూడా వదలకుండా వారిపైనా పన్నుల భారం మోపిందని మండిపడ్డారు. ఒడిశాలోని ఝార్సుగూడలో శనివారం నిర్వహించిన 'నమో యువ సమాబేశ్'లో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో ప్రబలంగా ఉన్న దోపిడీ సంస్కృతి నుంచి బీజేపీ రక్షించిందని అన్నారు. ప్రజలను దోచుకోవడానికి ఏ అవకాశాన్ని కూడా కాంగ్రెస్ వదిలిపెట్టలేదని విమర్శించారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా బీజేపీ ప్రభుత్వం ఆదాయాన్ని, పొదుపును రెట్టింపు చేసిందని తెలిపారు. రాష్ట్రానికి కేంద్రం రెండు సెమీ కండక్టర్ యూనిట్లను మంజూరు చేసిందని, అర్థిక కారిడార్ కోసం కూడా ప్రణాళికలు ఉన్నాయన్నారు.

# ఆరోగ్యంగా ఉండాలంటే..!



మనమందరం శరీరం ఆరోగ్యంగా ఉండాలని, మనసు ఎప్పుడూ శక్తితో నిండి ఉండాలని కోరుకుంటాం. అయితే కొన్నిసార్లు ఉదయం మనం చేసే తప్పుడు అలవాట్ల వల్ల మన ఆరోగ్యాన్ని మనమే పాడు చేసుకుంటాము. అందుకే ఆరోగ్య నిపుణుల ప్రకారం.. ఫిట్‌నెస్ అనేది కేవలం జిమ్‌కు వెళ్లడం లేదా కఠినమైన వ్యాయామాలు చేయడం వరకే పరిమితం కాదు. కానీ మన ఆరోగ్యానికి ఉదయం అలవాట్లు అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. మీరు ఉదయాన్ని సరైన విధంగా ప్రారంభిస్తే రోజంతా శక్తి, ఉత్సాహం నిలిచి ఉంటాయి. ఉదయం త్వరగా నిద్ర లేవడం చాలా ప్రయోజనకరం. ఉదయం 5 నుండి 6 గంటల మధ్య లేవడం ఉత్తమ సమయం. ఈ సమయం శరీరంలోని విషపదార్థాలను బయటకు పంపడానికి, జీవక్రియను చురుకుగా ఉంచడానికి అత్యంత అనుకూలమైనది. ఆలస్యంగా లేవడం లేదా నిరంతరం బద్ధకించడం ఫిట్‌నెస్‌కు పెద్ద అడ్డంకిగా మారుతుంది. ఉదయం లేవగానే ఒక గ్లాసు గోరువెచ్చని నీరు త్రాగడం చాలా అవసరం. ఇది మీ శరీరం నుండి విషపదార్థాలను బయటకు పంపుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. చాలా మంది దీనిని నిర్లక్ష్యం చేస్తారు. దీనివల్ల శరీరంలో నిస్సత్తువ, బరువు పెరగడం వంటి సమస్యలు వస్తాయి. ఉదయం సమయం తేలికపాటి వ్యాయామం లేదా స్ట్రెచింగ్ కోసం అత్యంత అనుకూలమైనది. ఇది కండరాలను బలోపేతం చేయడానికి, రక్త ప్రసరణను మెరుగుపరచడానికి, శరీరంలో చురుకుదనాన్ని కొనసాగించడానికి సహాయపడుతుంది. యోగా, నడక లేదా స్ట్రెచింగ్ మీ శరీరాన్ని రోజంతా చురుకుగా ఉంచగలవు. చాలా మంది ఉదయం జిమ్‌కి వెళ్లి భారీ వర్కవుట్‌లు చేస్తారు. కానీ స్ట్రెచింగ్ లేకుండా చేయడం కండరాలకు హానికరం కావచ్చు. ఉదయం అల్పాహారం రోజువారీ శక్తికి ఆధారం. చాలా మంది అల్పాహారాన్ని తేలికగా లేదా అసమతుల్యంగా తీసుకుంటారు. ఇది ఫిట్‌నెస్‌కు సరైనది కాదు. అల్పాహారంలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు ఉండటం అవసరం. ఓట్స్ (దలియా), గుడ్డు, వేరుశనగ లేదా తాజా పండ్లు శరీరానికి అవసరమైన పోషణను అందిస్తాయి. రోజంతా శక్తిని నిలిపి ఉంచుతాయి. ఫిట్‌నెస్ అనేది కేవలం శరీరానికే పరిమితం కాదు. మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. ఉదయం ధ్యానం (మెడిటేషన్) చేయడం మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. రోజంతా ఏకాగ్రతను కొనసాగించడానికి సహాయపడుతుంది. చాలా మంది దీనిని పట్టించుకోరు. దీనివల్ల శరీరం ఫిట్‌గా ఉన్నప్పటికీ మనసు అలసిపోయినట్లు అనిపిస్తుంది.

# ఆయుర్వేద రారాజు అశ్వగంధ



అశ్వగంధ ఆయుర్వేదంలో ముఖ్యమైన మూలిక. పురాతన ఔషధమైన అశ్వగంధ శరీరానికి, మనస్సుకు కూడా గొప్ప వరంగా చెబుతారు. కానీ, పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన అశ్వగంధ కొందరు వ్యక్తులకు మాత్రం చాలా డేంజర్ అంటున్నారు. దీని వల్ల తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉంటాయని అంటున్నారు. అశ్వగంధ ఆయుర్వేదంలో ముఖ్యమైన మూలిక. ఇది ఒత్తిడిని తగ్గించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, శారీరక శక్తిని పెంచడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. దాని వేర్లు గుర్రపు వాసన రావడం వల్ల దీనికి అశ్వగంధ అనే పేరు వచ్చిందని ఆయుర్వేదంలో ప్రస్తావించారు. పురాతన ఔషధమైన అశ్వగంధ శరీరానికి, మనస్సుకు కూడా గొప్ప వరంగా చెబుతారు. కానీ, పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన అశ్వగంధ కొందరు వ్యక్తులకు మాత్రం చాలా డేంజర్ అంటున్నారు. దీని వల్ల తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉంటాయని అంటున్నారు.అశ్వగంధ ఎంతో అద్భుతమైన మూలిక. ఇందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు అనేక వ్యాధులకు దివ్యౌషధంగా పనిచేస్తుంది. కానీ అశ్వగంధ వినియోగం కొందరికి మాత్రం హానికరం అంటున్నారు నిపుణులు. తక్కువ రక్తపోటు ఉన్నవారు అశ్వగంధను తినకూడదు. ఇది రక్తపోటు మరింత తగ్గడానికి కారణమవుతుంది. గర్భిణీ స్త్రీలు కూడా అశ్వగంధను తినకూడదని వైద్యులు చెబుతున్నారు. హైపర్ థైరాయిడ్ రోగులు కూడా జాగ్రత్తగా ఉండాలి. అశ్వగంధ నిద్రను పెంచుతుంది. ఇది మందుల ప్రభావాన్ని పెంచుతుంది. కాబట్టి నిద్ర మాత్రలు తీసుకునేవారు ముఖ్యంగా జాగ్రత్తగా ఉండాలి. అధిక మొత్తంలో దీనిని తీసుకోవడం వల్ల కడుపులో చికాకు లేదా విరేచనాలు సంభవించవచ్చు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా గర్భిణులు, పాలిచ్చే తల్లులు వీటిని తీసుకోకూడదని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ బృందం పేర్కొంది.

# పీరియడ్స్ టైంలో తలస్నానం చేస్తే ఏమవుతుంది?



పీరియడ్స్ సమయంలో తల స్నానం చేయకూడదని చాలా మంది అంటుంటారు. అందుకే చాలా మంది ఈ సమయంలో తల స్నానం మానేస్తారు. అయితే దీని వెనుక నిజంగా ఏదైనా కారణం ఉందా? పీరియడ్స్ సమయంలో తల స్నానం చేయకూడదని చాలా మంది అంటుంటారు. అందుకే చాలా మంది ఈ సమయంలో తల స్నానం మానేస్తారు. అయితే దీని వెనుక నిజంగా ఏదైనా కారణం ఉందా? అనే విషయం ఇక్కడ తెలుసుకుందాం. నిజానికి చాలా ఇళ్లలో ఇప్పటికీ పీరియడ్స్ సమయంలో స్త్రీలను వంటగదిలోకి కూడా అనుమతించరు. ఇలాంటి దురాచారాలు మన దేశంలో వేళ్లూనుకుపోయాయి. వీటిని అంత తేలిగ్గా వదిలించుకోవడం మన సమాజంలో సాధ్యంకాదు. ఇలాంటి అపోహల్లో పీరియడ్స్ సమయంలో తల స్నానం చేయకూడదు అనేది ఒకటి. అందుకే చాలా మంది మహిళలు ఈ సమయంలో తల స్నానం చేయరు. కొందరు అసలు స్నానం కూడా చేయరు. నిజానికి పీరియడ్స్ సమయంలో పరిశుభ్రత చాలా అవసరం. పీరియడ్స్ సమయంలో ఎంత ఎక్కువ పరిశుభ్రతను పాటిస్తే అంత మంచిది. పీరియడ్స్ సమయంలో ప్రతిరోజూ స్నానం చేయడం అస్సలు మర్చిపోకూడదు. పీరియడ్స్ సమయంలో స్నానం చేస్తే శరీరం సాంత్వన పొందుతుంది. ఇది అసౌకర్యాన్ని తగ్గించడంలోనూ సహాయపడుతుంది. రోజుకు రెండుసార్లు స్నానం చేయడం ఇంకా మంచిది.

# తరచుగా మోకాళ్ల నొప్పులు వస్తున్నాయా?



తరచుగా మోకాళ్ల నొప్పులు వస్తుంటే, దానిని తేలికగా తీసుకోకూడదు. ఇది అలసట లేదా వృద్ధాప్యం వల్ల మాత్రమే కాదు, అనేక తీవ్రమైన అనారోగ్యాలతో కూడా ముడిపడి ఉంటుంది. మోకాళ్ల నొప్పులు యువతలో కూడా సాధారణంగా మారిపోయాయి. ముఖ్యంగా ఎక్కువసేపు నిలబడేవారు, అధికంగా నడవడం లేదా అధిక బరువు ఉన్నవారిలో ఈ సమస్య కనిపిస్తోంది. ఎముకల బలహీనత, హార్మోన్ల మార్పుల కారణంగా ఈ సమస్య మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. నొప్పి కొనసాగితే, అది తీవ్రమైన సమస్యకు సంకేతం కావచ్చు. వెంటనే దాన్ని తనిఖీ చేసుకోవడం చాలా ముఖ్యం, ఎందుకంటే ఇది తీవ్రమవుతుంది, నడవడానికి ఇబ్బంది కలిగిస్తుంది. నిరంతర మోకాలి నొప్పి అనేక ఇతర లక్షణాలతో కూడి ఉంటుంది. వాపు, మోకాళ్లలో దృఢత్వం, మెట్లు ఎక్కడం కష్టం, నడుస్తున్నప్పుడు మోకాళ్లలో శబ్దం, నొప్పి కారణంగా నిద్రకు ఆటంకాలు ఏర్పడటం ఇవన్నీ తీవ్రమైన సమస్యను సూచిస్తాయి. కొంతమందికి మోకాళ్లలో మంట, వెచ్చదనం లేదా ఎరుపు కూడా ఉంటుంది, ఇది మంట లేదా ఇన్ఫెక్షన్ సంకేతం కావచ్చు. అందువల్ల, మోకాలి నొప్పిని విస్మరించకూడదు. ఎయిమ్స్‌లోని ఆర్థోపెడిక్ విభాగంలో ప్రొఫెసర్ అయిన డాక్టర్ భావుక్ గార్గ్ ప్రకారం.. పదే పదే వచ్చే మోకాలి నొప్పి అనేక వ్యాధులతో ముడిపడి ఉంటుందని వివరించారు. దీనికి అత్యంత సాధారణ కారణం ఆస్టియో ఆర్థరైటిస్, దీనిలో ఎముకల మధ్య మృదులాస్థి క్షీణించడం ప్రారంభమవుతుంది, నొప్పి పెరుగుతుంది. ఈ పరిస్థితి వయస్సుతో పాటు ఎక్కువగా కనిపిస్తుంది, కానీ నేటి కాలంలో, జీవనశైలి, ఊబకాయం కారణంగా, ఇది యువతలో కూడా కనిపిస్తుంది. అదనంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్ అనేది స్వయం ప్రతిరక్షక వ్యాధి, దీనిలో శరీర రోగనిరోధక వ్యవస్థ ఎముకలు, కీళ్లపై దాడి చేస్తుంది, దీని వలన మంట, నొప్పి పెరుగుతుంది. కొన్ని సందర్భాల్లో గౌట్ కూడా ఈ పరిస్థితికి కారణమవుతుంది, ఇక్కడ యూరిక్ యాసిడ్ పెరగడం వల్ల కీళ్లలో స్ఫటికాలు ఏర్పడతాయి, దీనివల్ల తీవ్రమైన నొప్పి వస్తుంది. ఎముకలలో కాల్షియం లోపం, గాయం లేదా అధిక బరువు వల్ల కూడా తరచుగా మోకాలి నొప్పి వస్తుంది. చికిత్స చేయకపోతే, ఈ సమస్య మరింత తీవ్రమవుతుంది.

# పింక్ సాల్ట్ -వైట్ సాల్ట్.. ఆరోగ్యానికి ఏది మంచిది?



రెండింటికీ వాటి ప్రయోజనాలు, అప్రయోజనాలు ఉన్నాయి. మీరు అయోడిన్ కోరుకుంటే సాధారణ ఉప్పు సరైనది. మీరు సహజ ఖనిజాలు, వేరే రుచిని కోరుకుంటే మీరు పింక్ సాల్ట్‌ను తీసుకోవచ్చు. కానీ ఒకటి గుర్తుంచుకోండి. ఏదైనా ఉప్పును అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. ఉప్పు మన ఆహారంలో ఒక ముఖ్యమైన భాగం. కూరగాయలు వండడానికి అయినా, సలాడ్‌లో చేర్చుకోవడానికి అయినా లేదా ఫ్రెంచ్ ఫ్రైస్ రుచిని పెంచడానికి అయినా ఉప్పును ప్రతిదానిలో ఉపయోగిస్తారు. కానీ అదనపు ఉప్పు అంటే అదనపు సోడియం ఆరోగ్యానికి హానికరం. ఎక్కువ సోడియం తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. అలాగే గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. అందుకే సాధారణ ఉప్పు కంటే పింక్ సాల్ట్ మంచిదా? పింక్ సాల్ట్‌ను హిమాలయన్ సాల్ట్ అని కూడా అంటారు. ఈ ఉప్పును హిమాలయాలకు సమీపంలోని గనుల నుండి తీస్తారు. దాని గులాబీ రంగుకు కారణం దానిలో ఉండే ఐరన్ ఆక్సైడ్ వంటి ఖనిజాలు. పోషకాహార నిపుణురాలు హరిప్రియ ఎన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఉప్పు ఎక్కువగా ప్రాసెస్ చేయరు. అందుకే ఇది మరింత సహజమైనదిగా పరిగణిస్తారు. సాధారణ ఉప్పు లేదా టేబుల్ సాల్ట్ సాధారణంగా ఉపయోగించే ఉప్పు. దీనిని ప్రాసెసింగ్ ద్వారా తయారు చేస్తారు. దీనిలో చాలా ఖనిజాలు తొలగిస్తారు. రెండూ ప్రధానంగా సోడియం క్లోరైడ్‌తో కూడి ఉంటాయి. పింక్ సాల్ట్‌లో 84-98 శాతం, సాధారణ ఉప్పులో 97-99 శాతం ఉంటాయి. రెండింటినీ ఆహార రుచిని పెంచడానికి, ఆహారాన్ని నిల్వ చేయడానికి ఉపయోగిస్తారు. రెండింటినీ అధికంగా తీసుకోవడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. అలాగే గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. మూలం: సముద్రపు నీరు లేదా ల్యాండ్ మైన్‌లను ప్రాసెస్ చేయడం ద్వారా సాధారణ ఉప్పును తయారు చేస్తారు. అయితే పింక్ సాల్ట్‌ను హిమాలయాలకు సమీపంలోని ఉప్పు గనుల నుండి తయారు చేస్తారు. ప్రాసెసింగ్: సాధారణ ఉప్పు మరింత శుద్ధి చేస్తారు. దానికి అయోడిన్ జోడిస్తారు. పింక్ సాల్ట్ సహజమైనది. అలాగే శుద్ధి చేయరు. ఖనిజాలు: పింక్ సాల్ట్‌లో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి 84 కంటే ఎక్కువ ఖనిజాలు ఉన్నాయి (ఫుడ్స్ జర్నల్ ప్రకారం సమాచారం). రంగు, ఆకృతి: సాధారణ ఉప్పు తెల్లగా, సన్నగా ఉంటుంది. అయితే గులాబీ ఉప్పు పింక్ కలర్‌లో ఉంటుంది. మరి సన్నగా కాకుండా కొంత దొడ్డుగా ఉంటుంది. రుచి: సాధారణ ఉప్పు ఎక్కువ ఉప్పగా ఉంటుంది. అదే పింక్ సాల్ట్‌లో ఉప్పు తేలికపాటి , ఖనిజ రుచిని కలిగి ఉంటుంది. ఆరోగ్య ప్రయోజనాలు: క్రమం తప్పకుండా ఉప్పు తీసుకోవడం వల్ల అయోడిన్ లోపాన్ని నివారించవచ్చు. పింక్ సాల్ట్ హైడ్రేషన్, ఎలక్ట్రోలైట్ బ్యాలెన్స్‌కు సహాయపడుతుంది. ఇందులో ఏ ఉప్పు తీసుకోవాలి? రెండింటికీ వాటి ప్రయోజనాలు, అప్రయోజనాలు ఉన్నాయి. మీరు అయోడిన్ కోరుకుంటే సాధారణ ఉప్పు సరైనది. మీరు సహజ ఖనిజాలు, వేరే రుచిని కోరుకుంటే మీరు పింక్ సాల్ట్‌ను తీసుకోవచ్చు. కానీ ఒకటి గుర్తుంచుకోండి.. ఏదైనా ఉప్పును అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం.

# డ్రోన్ల ద్వారా ఆహార పంపిణీ



**హైదరాబాద్ :** భారీ వర్షాలతో పాటు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల నుండి నీటిని విడుదల చేస్తుండటంతో మూసీ నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. చాదర్‌ఘాట్, పురానాపూల్, ఎంజీబీఎస్, మూసారాంబాగ్ తదితర ప్రాంతాలను వరద ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో అధికా రులు డ్రోన్ల ద్వారా బాధితులకు ఆహారం, మంచినీరు అంది స్తున్నారు. హైడ్రా, రెవెన్యూ, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, జీహెచ్ ఎంసీ సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

**మంజీరా నదికి పోటెత్తుతున్న వరద**

సంగారెడ్డి, మెదక్ జిల్లాలను మంజీరా నది వరద వణికిస్తోంది. సింగూరు, మంజీరా బ్యారేజీల నుంచి మంజీరా నదికి భారీ వరద వస్తోంది. మంజీరా ఉగ్రరూపానికి ఏడుపాయల వనదుర్గా ఆలయం గత కొన్ని రోజులుగా వరద నీటిలోనే ఉంటోంది. వరద ధాటికి ఆలయం వద్ద ప్రసాదాల పంపిణీ షెడ్డు కొట్టుకుపోయింది. అమ్మవారి ఆలయానికి వచ్చే దారులన్నీ మూసివేశారు. నదీ పరీవాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంట నీట మునిగింది. రైతులు, పశువుల కాపరులు, మత్స్యకారులు నది వైపు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

**ముందే హెచ్చరించినా పట్టించుకోలేదు**

భారీ వర్షాలతో హైదరాబాద్ నగరం జల దిగ్బంధంలో చిక్కుకోవడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది ప్రభుత్వ వైఫల్యం కాదని, నేరపూరిత నిర్లక్ష్యమని ఆయన ఘాటుగా విమర్శించారు. వాతావరణ శాఖ ముందుగానే తీవ్ర వర్షాలు కురుస్తాయని హెచ్చరించినా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏమాత్రం అప్రమత్తంగా వ్యవహరించ లేదని ఆయన మండిపడ్డారు. వరద తీవ్రతను అంచనా వేయడంలో, ప్రణాళికలు రచించడంలో, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం సాధించడంలో సర్కారు పూర్తిగా విఫలమైందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ ముందుచూపు లోపం వల్లే పండుగ వేళ ఊళ్లకు వెళ్లే ప్రయాణికులు ఎంజీబీఎస్ బస్టాండులో వరద నీటిలో చిక్కుకుని రాత్రంతా భయంతో గడపాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటంతో పరీవాహక ప్రాంతాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బురద రాజకీయాలను కాసేపు పక్కనపెట్టి, సహాయక చర్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. వరదల్లో చిక్కుకున్న ప్రయాణికులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని డిమాండ్ చేశారు. మూసీ పరిసర ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే ప్రజలను గుర్తించి, వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలించి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

# హైదరాబాద్‌లో ముప్పై ఏళ్ల మహా ప్రళయం

**ఉగ్రరూపం దాల్చిన మూసీ...**

**జలదిగ్బంధంలో ఎంజీబీఎస్, అప్రమత్తమైన యంత్రాంగం**

**హైదరాబాద్ :** మహానగరాన్ని ప్రకృతి విపత్తు కమ్మేసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా, చారిత్రక మూసీ నది దాదాపు మూడు దశాబ్దాలలో ఎన్నడూ చూడని విధంగా ఉగ్రరూపం దాల్చింది. జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) గేట్లను తెరవడంతో, నగరంలోకి వరద నీరు వేగంగా ప్రవేశించింది. పురానాపూల్ బ్రిడ్జి వద్ద మూసీ నది ఏకంగా 13 అడుగుల ఎత్తులో ప్రవహిస్తుండటం ఈ పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ మహా ప్రవాహం కారణంగా నగరంలో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి, దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మూసీ వరద ఉధృతికి మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) పూర్తిగా నీట మునిగింది. దీంతో బస్ స్టాండ్ జలదిగ్బంధంలోకి వెళ్లిపోయింది. శుక్రవారం అర్ధరాత్రి వేళ వరద నీరు ఎంజీబీఎస్ ప్రాంగణంలోకి చేరడంతో, టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎంజీబీఎస్ బస్ స్టేషన్‌కు వెళ్లే రెండు ప్రధాన బ్రిడ్జిలు నీట మునగడం పరిస్థితి తీవ్రంగా మారింది. టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అధికారికంగా ఈ మూసివేతను ప్రకటించారు. వరద ఎంజీబీఎస్‌లోకి చేరిన తక్షణమే, డీఆర్‌ఎఫ్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన స్పందించారు. డీఎఫ్ఓ యజ్ఞ నారాయణ, ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, సిబ్బంది తాళ్ల సాయంతో ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకెళ్లారు. ఈ ఘటన ఎంజీబీఎస్ చరిత్రలో అరుదైనదిగా నిలిచింది. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా, ఎంజీబీఎస్ నుంచి బయలుదేరే బస్సులను నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి సంస్థ మళ్లించారు. ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ వైపు వెళ్లే సర్వీసులు జేబీఎస్ నుంచి నడుస్తున్నాయి. వరంగల్, హన్మకొండ వైపు వెళ్లేవి ఉప్పల్ క్రాస్ రోడ్స్ నుంచి, సూర్యాపేట, నల్గొండ, విజయవాడ వైపు వెళ్లేవి ఎల్బీనగర్ నుంచి, మహబూబ్‌నగర్, కర్నూల్, బెంగళూరు వైపు వెళ్లేవి ఆరాంఘర్ నుంచి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నాయి. ప్రయాణికులు ఎంజీబీఎస్‌కు రావొద్దని టీజీఎస్‌ఆర్టీసీ విజ్ఞప్తి చేసింది.

**ప్రాణాల కాపాడిన రెస్క్యూ బృందాలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్ విభాగాల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న 1000 మందికి పైగా ప్రజలను అధికారులు తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించారు. పురానాపూల్ శివాలయంలో వరద నీటిలో చిక్కుకుపోయిన నలుగురు ఆలయ సిబ్బందిని కాపాడేందుకు హైడ్రా డీఆర్‌ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగారు. నీటి ప్రవాహం పెరగడంతో ఆపరేషన్‌కు అంతరాయం ఏర్పడింది. శివాలయం పైనే



పూజారి కుటుంబం ఉండిపోగా, వారికి టిఫిన్స్ భోజనాలు అందించారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) సర్వీస్ రోడ్డుపై కూడా వరద బీభత్సం కనిపించింది. ఉస్మాన్ సాగర్ గేట్లు ఎత్తడంతో నార్సింగి మంచిరేవుల మధ్య సర్వీసు రోడ్డుపై వరద పారింది. బారికేడ్లు పెట్టినా పట్టించుకోకుండా ఆటో ట్రాలీలో రోడ్డు దాటేందుకు ప్రయత్నించిన డ్రైవర్, అందులోని నలుగురిని హైడ్రా ఆఫీఈ బృందాలు రాత్రివేళ సురక్షితంగా కాపాడాయి.

చాదర్‌ఘాట్ వంతెన వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చిన్న బ్రిడ్జి మూసివేయడంతో, పెద్ద బ్రిడ్జి పైనుంచి వాహనాలు రాకపోకలు కొనసాగించాయి. అంబర్‌పేట్ ? దిల్‌సుఖ్‌నగర్ రహదారి పూర్తిగా మూసివేశారు.

**పునరావాస కేంద్రాల్లో బాధితులు**

వరద ప్రభావిత ప్రాంతాల్లోని కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పునరావాస కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, హైదరాబాద్ ప్రజలకు ఇబ్బందులు కలగకుం డా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ముంపుకు గురైన కు టుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వెల్లడించారు.

**పునరావాస కేంద్రాల వివరాలు:**

శంకర్ నగర్ ప్రాంతంలోని దాదాపు 500 మంది నిర్వాసితులు షాజాదీ మసీదులో వసతి పొందుతున్నారు.

మలక్‌పేట్ సర్కిల్‌లోని మూసానగర్ కమ్యూనిటీ హాల్ లో 150 మంది వసతి పొందుతున్నారు. దుర్గా నగర్, అంబేద్కర్ నగర్ నిర్వాసితులు (దాదాపు 45 కుటుంబాలు) మూసారాంబాగ్ వంతెనకు సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వసతి పొందుతున్నారు. కృష్ణ నగర్ కమ్యూనిటీ హాల్‌కు 32 మందిని తరలించి ఆహారపదార్థాలు అందిస్తున్నారు. భూలక్ష్మీ ఆలయం నుంచి 55 మందిని గోడే-కి-ఖబర్ కమ్యూనిటీ హాల్‌కు తరలించారు. ఈ కేంద్రాల్లో ఉన్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బతుకమ్మ, దసరా పండుగలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. మంజీరా నది మహోగ్రరూపం దాల్చింది. ఏడు పాయల ఆలయం వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది, వరద ఆలయం పైకప్పును తాకుతోంది. దీంతో ఆలయం వద్దకు ఎవరూ రావొద్దని హెచ్చరికలు జారీ చేశారు. వరద ఉధృతికి ప్రసాదాల పంపిణీ షెడ్డు కొట్టుకుపోయింది. మంజీరా బ్యారేజీకి భారీగా వరద నీరు చేరడంతో 1.20 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 46.60 అడుగులకు చేరింది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. నీటిమట్టం 48 అడుగులకు చేరితే రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

యాదాద్రి జిల్లాలో కూడా మూసీ ఆగ్రహం కనిపించింది. జూలూరు ? రుద్రవెల్లి వద్ద వంతెనపైగానే వరద ప్రవహించడంతో పోచంపల్లి ? బీబీనగర్ రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రాణ నష్టం జరగకుండా అధికారులు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నారు. మూసీ ఒడ్డునకు, వంతెనలకు దగ్గరగా వెళ్లవద్దని అధికారులు ప్రజలను విజ్ఞప్తి చేశారు. అయితే, కొంతమంది ప్రజలు పురానాపూల్, నయాపూల్ బ్రిడ్జిల నుంచి వరద నీటిని చూసి ఆశ్చర్యానికి లోనవడం, సెల్ ఫోన్లలో వీడియోలు తీసుకోవడం, సెల్ఫీలు దిగడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. అటువంటి ప్రమాదకర చర్యల పట్ల పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు, పురానాపూల్ బ్రిడ్జి పైన చిరు వ్యాపారులను కూడా పోలీసులు అనుమతించడం లేదు. వాతావరణ శాఖ రాబోయే 24 గంటల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. దీనికి తోడు, మూసీ కాలుష్యం, ముఖ్యంగా అతిక్రమణల వల్ల నది నీటి పారుదల సామర్థ్యం తగ్గిందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ వరదలపై స్పందిస్తూ, వరద బాధితులకు అండగా నిలవాలని తమ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**మునిగిపోయిన ఇమ్లిబన్**

హైదరాబాద్ మహానగరాన్ని శుక్రవారం రాత్రి భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. కుండపోత వానకు నగరం అస్తవ్యస్తంగా మారింది. జంట జలాశయాల గేట్లు ఎత్తడంతో మూసీనది ఉగ్రరూపం దాల్చి, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) ప్రాంగణాన్ని పూర్తిగా ముంచెత్తింది. వందలాది మంది ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు, పిల్లలు గంటల తరబడి బస్టాండ్‌లోనే చిక్కుకుపోయి తీవ్ర భయాందోళనలకు, ఇబ్బందులకు గురయ్యారు. మూసీ ప్రవాహం అర్ధరాత్రి తర్వాత ఒక్కసారిగా పెరిగి, గండిపేట నుంచి నాగోల్ వరకు నది ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. అర్ధరాత్రి సమయంలోనే ఉన్నత అధికారులతో సమీక్ష నిర్వహించి, బస్టాండ్‌లో చిక్కుకున్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురావాలని పోలీసు, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**-నివాళులర్పించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు**

**మంథని :** స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి దశ నుండి మలి దశ వరకు ముందుండి పోరాడిన నాయకుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకలను శనివారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మంథని మాజీ ఏమ్మెల్యే పుట్ట మధుకర్ ఆదేశాల మేరకు మంథని పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్వతంత్ర సమరయోధునిగా తెలంగాణ ఉద్యమకారునిగా, మంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంథని బిఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ఏగోలపు శంకర్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు తగరం శంకర్ లాల్, ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మణ్, సింగిల్ విండో డైరెక్టర్లు మాచిడి రాజు గౌడ్, ఆకుల రాజబాబు, గోబ్బురి వంశీ, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు కనవేని శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు జంజర్ల శేఖర్. పుప్పాల తిరుపతి, ఎస్కేయాకుబ్, ఇర్ఫాన్, పిల్లి సత్య నారాయణ, బండారి శ్రీకాంత్, పీక మల్లేష్, బోనాల నరేందర్, జనగమ సంతోష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌తోనే ఇందిరమ్మ ఇళ్లు సాకారం

**నల్గొండ :** తేలకంటిగూడెం లో ఇందిరమ్మ ఇండ్ల సామూహిక గృహ ప్రవేశం కార్యక్రమంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గోన్నారు. లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేసారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మీరు ఇవాళ నాకు అపూర్వ స్వాగతం పలికారు. ధన్యవాదాలు. ఇందిరమ్మ ఇండ్లు ముందు మీ ఊరిలోనే ఇవ్వాలని పైలట్ ప్రాజెక్టుగా తీసుకున్న. స్థలంతో కలిపి ఒక్కో ఇంటికి 15లక్షల పై చిలుకు ఖర్చు చేశాం. నిజమైన పేదవారికి ఇళ్ల పట్టాలు ఇస్తుంటే..గృహ ప్రవేశాల్లో పాల్గొంటే నాకు ఎంతో సంతోషంగా ఉన్నదని అన్నారు. మీరు ఎంతో ఆప్యాయత చూపిస్తారు. మీ కండ్లలో నీళ్లు వస్తే..నా కండ్లలో నీళ్లు తిరుగుతాయి. మీకు ఏ కష్టం వచ్చినా నేను ఉంటా. మిమ్మల్ని కడుపులో పెట్టుకొని కాపాడుకునే బాధ్యత నాది. పేదలకు మేలు జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉండాలే. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది కాబట్టే ఇవాళ ఇందిరమ్మ ఇండ్ల కల సాకారం అయింది. ప్రతి ఎకరానికి సాగునీరు అందించే ఏర్పాటు చేస్తున్నాం. మీరు అడిగినవి, అడగనవి అన్ని చేసుకుంటూ పోతున్న. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ లకు ఓటు వేసి ఆశీర్వదించాలిని కోరుతున్న. ఎవరికి ఏ ఆపద వచ్చిన నేను ఉంటా...ఆపదలో ఉన్న వారు ఏ పార్టీ అని ఏనాడు నేను చూడలేదు. కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా సాయం చేస్తున్నామని అన్నారు.

## డీఎస్పీ పంచరు షాపు నడుపుకునే వ్యక్తి కూతురు?



**వరంగల్ :** ములుగు జిల్లా జేడీ మల్లంపల్లి గ్రామానికి చెందిన మౌనిక జీవితం చిన్నప్పటి నుంచి కష్టాలతోనే సాగింది. కూలీ పనులు చేసే తల్లి సరోజ, చిన్న పంక్చర్ షాపుతో కుటుంబాన్ని నెట్టుకొచ్చిన తండ్రి సమ్మయ్య.. ఇద్దరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించేవారు. ఆర్థిక పరిస్థితి ఎంత కఠినంగా ఉన్నా.. వారు కూతురు చదువును మాత్రం ఆపలేదు. వారి త్యాగాలు, కలలని చూసి మౌనిక ప్రభుత్వ కొలువు సంపాదించి.. తల్లిదండ్రుల కష్టానికి ప్రతిఫలం ఇవ్వాలని చిన్నప్పుడే నిర్ణయించుకుంది. 2020లో డిగ్రీ పూర్తి చేసిన ఆమె.. ఆ తర్వాత పూర్తిగా ఉద్యోగ సాధనపై ఫోకస్ పెట్టింది. కోచింగ్ సెంటర్లకు భారీ ఫీజులు కట్టే పరిస్థితి లేకపోవడంతో.. ఇంట్లోనే తన ప్రిపరేషన్ కొనసాగించింది. గ్రూప్-1 పరీక్షల కోసం రోజుకు 12 గంటలకుపైగా క్రమశిక్షణతో చదివింది. క్రమం తప్పకుండా టెస్ట్ పేపర్లు రాసి.. తన తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకు సాగింది. కష్టాలు ఎన్ని వచ్చినా, లక్ష్యాన్ని వదల్లేదు. ఆ పట్టుదల ఫలించింది. తాజాగా విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో మౌనిక 315వ ర్యాంక్ సాధించింది. ఈ ర్యాంక్ ద్వారా ఆమె డీఎస్పీగా ఎంపికైంది. తల్లిదండ్రులు ఒకప్పుడు చెమటోడ్చి నడిపిన పంక్చర్ షాపు ముందు, ఈరోజు డీఎస్పీగా నిలబడ్డ కూతురి విజయాన్ని చూసి వారి కళ్లలో ఆనందభాష్పాలు మెరిశాయి. మౌనిక గెలుపు కేవలం వ్యక్తిగత విజయమే కాదు.. అనేక పేద, మధ్యతరగతి యువతకు స్ఫూర్తి. శ్రమను ఆయుధంగా మార్చుకుంటే విజయమే నీ సొంతం అవుతుంది అని తన జీవితం ద్వారా నిరూపించింది మౌనిక. గ్రామమంతా ఆమెను అభినందిస్తారు. అందరూ గొప్ప కూతుర్ని కన్నారు అంటుంటే మౌనిక తల్లిదండ్రులు మురిసిపోతున్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



**సిద్దిపేట :** కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా కలెక్టర్ కె. హైమావతి కలిసి పాల్గొని పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ సమాజానికి చేసిన సేవలు మరవ రానివని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పెద్దమనిషిగా ముందుండి ఉద్యమానికి, ఉద్యమకారులకు ఎంతో తోడ్పాటు అందించారని అన్నారు. నిబద్ధత కలిగిన రాజకీయవేత్త అని, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ చిరస్మరణీయులుగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. జిల్లా కలెక్టర్ కె. హైమావతి మాట్లాడుతూ. తెలంగాణలోని మారుమూల ఆసిఫాబాద్ జిల్లాలో జన్మించి శ్వాశక్తితో ఉన్నత విద్యనభ్యశించి అడ్వకేట్ గా ఎదిగారు. అనంతరం ప్రజాప్రతినిదిగా తెలంగాణా తొలి మరియు మలి దశ ఉద్యమాలలో చురుగ్గా పాల్గొని ఉద్యమానికి చేయుతనందించిన గొప్ప ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ అని ఆయన సేవలు మరువ లేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి సయ్యద్ రఫీ, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటిఐలో అధునాతన సాంకేతిక కేంద్ర ఏటీసీ ప్రారంభోత్సవ కార్యక్రమం



**సిద్దిపేట :** కుకునూరుపల్లి ప్రభుత్వ ఐటిఐలో అధునాతన సాంకేతిక కేంద్ర ఏటీసీ ప్రారంభోత్సవ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తో కలిసి పాల్గొన్నారు. ముందుగా హైదరాబాద్ లోని మల్లేపల్లి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మొత్తం 65 అధునాతన సాంకేతిక కేంద్రాలను మంత్రులతో కలిసి వర్చువల్ గా ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. జీవితంలో ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకోవాలి. లక్ష్యం కోసం ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లాలి. వచ్చిన ప్రతి ఒక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మారుతున్న కాలం తో సాంకేతిక నైపుణ్యం అలవర్చుకోవాలి. ప్రభుత్వం విద్యార్థులలో ఉన్న నైపుణ్యాలను బహిర్గతం చేసి వారికి ఉపాధి అవకాశాలు అందించడం కోసం అధునాతన సాంకేతిక కేంద్రాలను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుంది. ఐటిఐ లలో కొత్త కొత్త కోర్సులు చేర్చి శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు ఉపాధి అందించేలా రూపొందించడం జరిగిందని ఈ సువర్ణ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణతో తక్షిణ ఉపాదితో పాటు పై చదువులు సైతం చేసుకోవచ్చనీ విద్యార్థులకు సూచించారు. అనంతరం చెక్కపై మిషన్ ద్వారా బొమ్మలు చేసే విధానాన్ని పరిశీలించి చెక్కతో విద్యార్థులు చేసిన పలు పరికరాలను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపల్ రమణ, టిజిఐఐసి, మార్కెట్ కమిటీ చైర్మన్ తదితరుల పాల్గొన్నారు.

## బిజినెస్ వాయిస్

### చిన్న కార్ల కోసం ఉద్గారాల విడుదలలో నిబంధనలను సడలించే యోచనలో ప్రభుత్వం




చిన్న కార్లకు సంబందించి ప్రభుత్వం కఠినమైన ఇంధన సామర్థ్య నిబంధనలను తీసుకురానుంది. ఈ మేరకు నిబంధనల ముసాయిదా విడుదల చేసింది. ప్రస్తుత కార్పొరేట్ సగటు ఇంధన సామర్థ్య నిబంధనల ప్రకారం, అనుమతించదగిన కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాల పరిమాణం వాహన బరువుతో ముడిపడి ఉంది. 3,500 కిలోల కంటే తక్కువ బరువున్న అన్ని ప్రయాణీకుల కార్లకు ఇది వర్తిస్తుంది. దీన్ని 909 కిలోలు అంతకంటే తక్కువ బరువున్న, నాలుగు మీటర్ల కంటే తక్కువ పొడవున్న పెట్రోల్ కార్లకు సవరించేలా బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ప్రతిపాదించింది. దీనివల్ల చిన్న కార్లకు కొంత ఉపశమనం లభిస్తుంది. చిన్న కార్లు గతంలో కంటే కొంచెం ఎక్కువ కార్బన్ డయాక్సైడ్ విడుదల చేయడానికి అనుమతించవచ్చు. ఈ కొత్త నియమాలు చిన్న, తక్కువ ధర కార్లను తయారు చేసే కార్ల కంపెనీలకు సహాయపడతాయి. ముఖ్యంగా దేశంలో మధ్యతరగతి వర్గం సరసమైన కార్లను కొనేందుకు ఆస్కారం పెరుగుతుంది. ఇదే సమయంలో చిన్న వాహనాలను తయారు చేసే కంపెనీలపై ఒత్తిడిని తగ్గించినట్టు అవుతుంది. మరీ ముఖ్యంగా ఈ విభాగంలో కార్లను తయారు చేసే కంపెనీ మారుతి సుజుకికి ఎక్కువ ప్రయోజనం లభిస్తుంది. ఈ కారణంగానే శుక్రవారం కంపెనీ షేర్లు పెరిగాయి.

### స్వదేశీ 4జీ సేవలు




### ప్రారంభించనున్న బీఎస్ఎన్ఎల్

ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ శనివారం(సెప్టెంబర్ 27) స్వదేశీ 4జీ నెట్‌వర్క్ సేవలను దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానుంది. ఈ మేరకు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా శుక్రవారం వెల్లడించారు. స్వదేశీ 4జీ క్లౌడ్ ఆధారిత నెట్‌వర్క్‌తో పని చేస్తుందని, భవిష్యత్తులోనూ ఈ టెక్నాలజీ ద్వారా 5జీ సేవలకు సులభంగా అప్‌గ్రేడ్ అయ్యేందుకు వీలుంటుందని కేంద్ర మంత్రి వివరించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఈ సేవలను అధికారికంగా ప్రారంభిస్తారు. దీంతో పాటు డిజిటల్ భారత్ నిధి కార్యక్రమంలో భాగంగా 100 శాతం 4జీ శాచురేషన్ ప్రాజెక్టును కూడా ప్రారంభిస్తారు. దీని వల్ల ఫిన్లాండ్, స్వీడన్, దక్షిణ కొరియా, చైనా తర్వాత ఈ నెట్‌వర్క్‌లో సొంత స్వదేశీ టెలికాం సాంకేతికత, పరికరాలను కలిగిన ఐదవ దేశంగా భారత్ నిలవనుంది. దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 97,500 కంటే ఎక్కువ 4జీ మొబైల్ టవర్లను ప్రధాని మోడీ ప్రారంభిస్తారు. ఇది పూర్తిగా స్వదేశీ 4జీ టెక్నాలజీతో పనిచేస్తుంది. తేజస్ నెట్‌వర్క్స్ అభివృద్ధి చేసిన రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ (ర్యాన్)ను కలిగి ఉంది. ఇది సీ-డాట్ (సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్) ద్వారా ఒక ప్రధాన నెట్‌వర్క్. ఇక,

# రూ. 4.70 లక్షలకే మారుతీ కొత్త కారు.. ఏకంగా రూ. 94 వేలు తగ్గింపు




మీరు దసరా, దీపావళి పండగ సీజన్‌లో తక్కువ ధరల్లో కొత్త కారు కొనుగోలు చేయాలని చూస్తున్నారా..? అయితే మీకు బంపరాఫర్. ఇప్పటికే కేంద్రం.. జీఎస్టీ సంస్కరణల్ని ప్రకటించింది. 12, 28 శాతం పన్ను శ్లాబుల్ని తొలగించగా.. అవి తక్కువ పన్ను శ్లాబులు అంటే 18, 5 శాతానికి చేరాయి. దీంతో.. ఆయా పన్ను శ్లాబుల్లోకి వచ్చే వస్తువులు, ఉత్పత్తుల ధరల్ని తగ్గిస్తూ వస్తున్నాయి దిగ్గజ కంపెనీలు. ఇక ముఖ్యంగా చిన్న కార్లపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి చేరింది. సెస్ కూడా తొలగించింది. దీంతో వీటి రేట్లు భారీగా తగ్గుతున్నాయి. ఈ క్రమంలోనే అతిపెద్ద కార్ల తయారీ సంస్థ.. మారుతీ సుజుకీ తన ఒక్కో మోడల్‌పై ఒక్కో సమయంలో రేట్ల కోతను ప్రకటిస్తూ వస్తోంది. ఇప్పుడు హ్యాచ్‌బ్యాక్ సెగ్మెంట్ సెలెరియో మోడల్ కార్ల ధరలపై తగ్గింపుల్ని ప్రకటించింది. ఇక్కడ కేవలం జీఎస్టీ రేట్ల కోత మాత్రమే కాకుండా.. పండగ సీజన్ నేపథ్యంలో అదనపు ఆఫర్లను ప్రకటించింది. దీంతో రేట్లు భారీగా దిగొచ్చాయి. మీరు ఎంట్రీ లెవెల్ కార్లను కొనుగోలు చేయాలని చూస్తే.. సెలెరియో బెస్ట్ ఆప్షన్లలో ఒకటి. దీని కంటే తక్కువ ధరల్లో ఆల్టో కే10 కూడా ఉన్నప్పటికీ.. సెలెరియో మోడల్స్ ఎక్కువగా విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. సెలెరియో ఎల్ఎక్స్ఐ వేరియంట్‌పై రూ. 94 వేలు తగ్గించింది మారుతీ సుజుకీ. దీంతో జీఎస్టీ రేట్ల కోతకు ముందు ధర రూ. 5.64 లక్షలుగా ఉండగా.. ఇప్పుడు రూ. 4.70 లక్షలకు చేరింది. వీఎక్స్ఐ వేరియంట్ ధర రూ. 84 వేలు తగ్గగా.. ఇప్పుడు దీని ఎక్స్ షోరూం ధర రూ. 5.16 లక్షలకు చేరింది. జేఎక్స్ఐ వేరియంట్ ధర రూ. 68 వేలు తగ్గగా.. ఇప్పుడు రూ. 5.71 లక్షలకు చేరింది. వీఎక్స్ఐ ఏఎంటీ ధర రూ. 89 వేలు తగ్గి.. రూ. 5.61 లక్షలుగా ఉంది. వీఎక్స్ఐ సీఎన్‌జీ ధర రూ. 92 వేలు తగ్గి రూ. 5.98 లక్షలుగా ఉంది. జేఎక్స్ఐ ఏఎంటీ ధర రూ. 73 వేలు తగ్గింది. జేఎక్స్ఐ ప్లస్ ధర రూ. 59 వేలు తగ్గింది. జేఎక్స్ఐ ప్లస్ ఏఎంటీ ధర రూ. 66 వేలు తగ్గింది. వీటి ధరలు రూ. 6 లక్షలకుపైగా ఉంది. మారుతీ సుజుకీ ఇటీవల తన సెలెరియో మోడళ్లను అప్డేట్ చేస్తుంది. కొత్త డిజైన్‌లో తీసుకురావడమే కాకుండా.. ఫీచర్లను కూడా అప్డేట్ చేసింది. ఇందులో చాలా కలర్స్ ఉన్నాయి. స్పీడీ బ్లూ, గ్లిస్టెనింగ్ గ్రే, ఆర్కిటిక్ వైట్, సిల్కీ సిల్వర్, సాలిడ్ ఫైర్ రెడ్, కెఫైన్ బ్రౌన్, పియరీ బ్లూయిష్ బ్లాక్ వంటివి ఉన్నాయి.

# పేటీఎం కొత్త స్కీమ్




దేశంలో ఇప్పుడు అతిపెద్ద పండగ సీజన్. దసరా, దీపావళి, ధన్‌తేరాస్ వంటి పండగలు ఉన్నాయి. దీంతో కంపెనీలు ఈ సమయంలో కొత్త కొత్త ఆఫర్లను ప్రకటిస్తుంటాయన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రముఖ డిజిటల్ పేమెంట్స్ యాప్, ఫిన్‌టెక్ కంపెనీ పేటీఎం కీలక ప్రకటన చేసింది. కస్టమర్లకు అదిరిపోయే ఆఫర్ ప్రకటించింది. ఇక్కడ పేటీఎం నుంచి డిజిటల్ పేమెంట్స్ చేసే వారికి బెనిఫిట్ ఉంటుంది. మీ డిజిటల్ పేమెంట్స్‌ను.. బంగారంపై పెట్టుబడిగా మార్చే అద్భుతమైన పథకాన్ని లాంచ్ చేసింది. ఇక్కడ సరికొత్త గోల్డ్ కాయిన్స్ రివార్డ్స్ ప్రోగ్రామ్ పేరిట దీనిని తీసుకొచ్చింది. ఇక్కడ కస్టమర్లు తాము చేసే ప్రతి డిజిటల్ ట్రాన్సాక్షన్‌పైనా .. గోల్డ్ కాయిన్స్ సంపాదించే అవకాశం ఉంటుంది. వాటిని నేరుగా డిజిటల్ గోల్డ్‌గా మార్చుకోవచ్చు. అంటే బంగారంపై పెట్టుబడి అవుతుందన్నమాట. ఎక్కడైనా రివార్డ్స్ అనేది.. క్యాష్‌బ్యాక్ లేదా కూపన్స్ రూపంలో ఉంటాయి. చాలా మంది ఇదే చూసి ఉంటారు. ఇక్కడ పేటీఎం స్కీంలో మాత్రం కాస్త వేరుగా, ప్రత్యేకంగా ఉంది. ఇక్కడ మీరు రోజువారీగా చేసే ఖర్చులకు చేసే చెల్లింపులతో కూడా మళ్లీ సంపాదించే అవకాశం వస్తుంది. ప్రభుత్వ సంకల్పం.. ఆత్మనిర్భర్ భారత్‌కు కూడా ఊతం అందిస్తుంది. డిజిటల్ చెల్లింపుల్ని ప్రోత్సహిస్తుంది. ఇక్కడ ముందుగా పేటీఎం నుంచి చేసే ప్రతి డిజిటల్ పేమెంట్‌పైనా బంగారు నాణేల్ని పొందుతారు. కస్టమర్లు.. వ్యాపారులకు (మర్చంట్లకు) స్కాన్ అండ్ పే విధానంలో.. ఆన్‌లైన్ కొనుగోళ్లు, క్యాష్ ట్రాన్స్‌ఫర్, రీఛార్జ్, బిల్ పేమెంట్స్ వంటి ట్రాన్సాక్షన్లు ఇలా అన్నింటిపైనా ట్రాన్సాక్షన్ విలువలో ఒక శాతం.. బంగారు నాణెంగా మారుతుంది. డెబిట్ కార్డ్స్, క్రెడిట్ కార్డ్స్, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ ఇలా ఏ ట్రాన్సాక్షన్ అయినా వర్తిస్తుంది. ఇలా 100 బంగారు నాణేల్ని సంపాదిస్తే.. అది రూ. 1 విలువైన 24 క్యారెట్ ప్యూర్ పేటీఎం డిజిటల్ గోల్డ్ కు సమానం అవుతుంది. ఈ నాణేల్ని రిడీమ్ చేసుకునేందుకు.. మరింత బంగారం కొనుగోలు కూడా చేయొచ్చు.

# అతడి వల్లే ఇది సాధ్యమైంది: సెహ్వాగ్ ప్రశంసలు




టీమిండియా యువ ఆటగాడు, హైదరాబాదీ స్టార్ తిలక్ వర్మపై భారత మాజీ ఓపెనర్ వీరేందర్ సెహ్వాగ్ ప్రశంసలు కురిపించాడు. శ్రీలంకతో మ్యాచ్‌లో ఈ యువ బ్యాటర్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడని కొనియాడాడు. తిలక్ వర్మ వల్లే టీమిండియా భారీ స్కోరు చేసిందని పేర్కొన్నాడు. అదే విధంగా.. సంజూ శాంసన్ ఆట తీరును కూడా సెహ్వాగ్ ఈ సందర్భంగా ప్రశంసించాడు. ఆసియా కప్-2025 టోర్నమెంట్లో ఇప్పటికే ఫైనల్ చేరిన టీమిండియా.. సూపర్-4లో చివరిగా నామమాత్రపు మ్యాచ్‌లో శ్రీలంకతో తలపడింది. దుబాయ్ వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది.

**అభిషేక్‌తో పాటు ఆ ఇద్దరు**

ఓపెనర్ అభిషేక్ శర్మ తనదైన శైలిలో విధ్వంసకర ఇన్నింగ్స్ (31 బంతుల్లో 61) ఆడగా.. మరో ఓపెనర్ శుబ్‌మన్ గిల్ (4) విఫలమయ్యాడు. వన్‌డౌన్‌లో వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (12), ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా (2) కూడా పూర్తిగా నిరాశపరిచారు. అయితే, నాలుగో నంబర్ బ్యాటర్.. తిలక్ వర్మ, ఐదో స్థానంలో వచ్చిన సంజూ శాంసన్ బ్యాట్ ఝులిపించి ఇన్నింగ్స్ చక్కదిద్దారు. తిలక్ 34 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్ బాది 49 పరుగులతో అజేయంగా నిలవగా.. వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ 23 బంతుల్లో 39 పరుగులు చేశాడు. ఆఖర్లో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ (15 బంతుల్లో 21 నాటౌట్) మెరుపులు మెరిపించాడు.

**తిలక్ వర్మ వల్లే ఇలా..**

ఈ నేపథ్యంలో వీరేందర్ సెహ్వాగ్ తిలక్ వర్మ ప్రదర్శనపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌తో మాట్లాడుతూ.. "అభిషేక్ శర్మ కాకుండా.. ఇంకా ఎవరైనా రాణించాలని, పరుగులు రాబట్టాలని టోర్నీ ఆరంభం నుంచి ఎదురుచూస్తూనే ఉన్నాం. ఈరోజు తిలక్ వర్మ.. సంజూ శాంసన్ ఆ పని చేశారు. వారిద్దరు భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోవచ్చు. కానీ ఇద్దరూ అద్భుతమైన, జట్టుకు అవసరమైన ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరి వల్లే టీమిండియా 200 పరుగుల మార్కు అందుకుంది. ముఖ్యంగా తిలక్ వర్మ ఆఖరి వరకు అజేయంగా ఉండటం కలిసి వచ్చింది. ఇలా ఓ బ్యాటర్ ఇన్నింగ్స్ ఆసాంతం నాటౌట్‌గా ఉన్నాడంటే.. అతడు తప్పక భారీ స్కోరు చేయగలడనే నమ్మకం వస్తుంది.

**ఫైనల్‌కు ముందు ఫామ్‌లో ఉండటం సానుకూలాంశం**

ఫైనల్‌కు ముందు తిలక్ వర్మ, సంజూ శాంసన్ ఇలా బ్యాట్ ఝులిపించడం సానుకూలాంశం. వీరిద్దరి వల్ల టైటిల్ పోరులో భారత జట్టుకు తప్పక ప్రయోజనం చేకూరుతుంది" అని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. కాగా 203 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక.. టీమిండియా మాదిరే ఐదు వికెట్లు కోల్పోయి సరిగ్గా 202 పరుగులు చేసింది. ఫలితంగా మ్యాచ్ టై కాగా సూపర్ ఓవర్లో భారత్ విజయఢంకా మోగించింది. ఇదిలా ఉంటే.. హైదరాబాదీ స్టార్ తిలక్ వర్మ ఆసియా కప్ తాజా ఎడిషన్‌లో లెఫ్టాండర్ బ్యాటర్ తిలక్ వర్మ ఐదు ఇన్నింగ్స్ ఆడి 144 పరుగులు చేశాడు. మరోవైపు.. సంజూ మూడు ఇన్నింగ్స్‌లో 108 పరుగులు రాబట్టాడు. ఇక ఆదివారం నాటి ఆసియా కప్ ఫైనల్లో టీమిండియా.. దాయాది పాకిస్తాన్‌తో తలపడనున్న విషయం తెలిసిందే.

## చేతులు లేని ఆర్చర్.. 18 ఏళ్లకే ప్రపంచ చాంపియన్.. శీతల్ దేవికి గోల్డ్ మెడల్

వాంగ్‌జు: ఆర్చరీలో శీతల్ దేవి ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. 18 ఏళ్ల ఆ భారతీయ క్రీడాకారిణి.. పారా ప్రపంచ ఆర్చరీ పోటీల్లో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నది. రెండు చేతులు లేని శీతల్.. తన కాళ్లతోనే బాణాన్ని వదిలి .. ప్రపంచ క్రీడల్లో పతకాన్ని చేజిక్కించుకున్నది. టర్కీకి చెందిన వరల్డ్ నెంబర్ వన్ క్రీడాకారిణి జోజ్నూర్ క్యూర్ గిర్దీపై 146-143 పాయింట్లతో విజయం సాధించింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత కేటగిరీలో శీతల్ దేవి స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నది. పారా వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో శీతల్ దేవి ఒక్కరే చేతులు లేని క్రీడాకారిణి. ఆ దివ్యాంగ క్రీడాకారిణి .. గ్వాంగ్‌జులో అందర్నీ స్టన్ చేసింది. తన పాదం, గదవతో .. శీతల్ తన బాణాన్ని షూట్ చేస్తుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మూడోసారి శీతల్ దేవి మెడల్‌ను గెలుచుకున్నది. మిక్స్‌డ్ టీమ్ బ్రాంజ్ కాంపౌండ్ ఈవెంట్‌లో తోమన్ కుమార్‌తో కలిసి పతకాన్ని సాధించింది.



## క్రీడా వాయిస్

### భవిష్యత్ ఆశాకిరణం.. అతడిని బెంచ్‌కే పరిమితం చేయండి



టీమిండియా చేతిలో రెండుసార్లు ఓడిపోయినప్పటికీ పాకిస్తాన్ ఎట్టకేలకు ఆసియా కప్-2025 టోర్నమెంట్ ఫైనల్‌కు చేరుకుది. సూపర్-4లో బంగ్లాదేశ్, శ్రీలంక జట్లపై విజయం సాధించడం ద్వారా టైటిల్ పోరుకు అర్హత సాధించింది. మరోవైపు.. భారత్ లీగ్, సూపర్-4 దశలో పరాజయమన్నదే లేకుండా ఫైనల్లో పాక్‌తో తలపడేందుకు సిద్ధమైంది. అయితే, ఈ టోర్నీలో పాకిస్తాన్ బౌలింగ్ పరంగా ఫర్వాలేదనిపించినా.. బ్యాటింగ్‌లో మాత్రం తడబడుతోంది. ముఖ్యంగా భారీ అంచనాలతో బరిలోకి దిగిన యువ ఓపెనర్ సయీమ్ అయుబ్ దారుణంగా విఫలమవుతున్నాడు. ఒమన్‌తో మ్యాచ్‌లో గోల్డెన్ డకౌట్ అయిన సయీమ్ ఆయుబ్.. టీమిండియా, యూఏఈతో మ్యాచ్‌లలోనూ పరుగుల ఖాతా తెరవకుండానే నిష్క్రమించాడు. ఇలా హ్యాట్రిక్ డకౌట్లతో విమర్శల పాలైన ఈ ఎడమచేతి వాటం బ్యాటర్.. సూపర్-4లో భాగంగా భారత్‌తో మ్యాచ్‌లో 21 పరుగులు చేయగలిగాడు. ఆ తర్వాత శ్రీలంకతో మ్యాచ్‌లో రెండు పరుగులు చేయగలిగిన సయీమ్.. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో మరోసారి డకౌట్ అయ్యాడు. బ్యాటింగ్ పరంగా విఫలమైనా పార్ట్ టైమ్ స్పిన్నర్‌గా ఏడు వికెట్లు తీయగలిగాడు.

**భవిష్యత్ ఆశాకిరణం**

ఈ నేపథ్యంలో పాకిస్తాన్ మాజీ క్రికెటర్ వకార్ యూనిస్ సయీమ్ అయుబ్‌ను ఉద్దేశించి ఘాటు విమర్శలు చేశాడు. "అతడు రెండోసారి డకౌట్ అయినపుడే.. బెంచ్‌కే పరిమితం చేయాలని చెప్పాను. దానర్థం అతడిలో ప్రతిభ లేదని కాదు. అతడు టాలెంటెడ్ ప్లేయర్. పాకిస్తాన్ క్రికెట్ భవిష్యత్ ఆశాకిరణం. కానీ కొన్నిసార్లు అనుకున్న ఫలితాలు రావు. ఆ క్రమంలో రోజురోజుకీ మరింత దిగజారితే ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. ఆయుబ్ విషయంలో ఇదే జరిగింది. అతడి బాడీ లాంగ్వేజ్ పూర్తిగా వీక్‌గా అనిపిస్తోంది.

ఇలాంటపుడు బెంచ్‌కే పరిమితం చేయాలి

బౌలింగ్ చేస్తున్నాడు కాబట్టి అతడిని తుదిజట్టులోకి తీసుకుంటున్నారు. కానీ అతడు బౌలింగ్ కోసం కాదు.. బ్యాటింగ్ కోసం జట్టులో ఉంటున్నాడు. అతడు పరుగులు చేస్తున్నాడా లేదా అనేది ముఖ్యం. ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రం అది జరగడం లేదు. అతడిని బెంచ్‌కే పరిమితం చేయాల్సి ఉంటుంది" అని వకార్ యూనిస్ పేర్కొన్నాడు. కాగా భారత్- పాకిస్తాన్ ఆసియా కప్-2025 ఫైనల్లో ఆదివారం తలపడనున్నాయి. ఇందుకు వేదిక దుబాయ్.



## జై హనుమాన్ కోసం నిరీక్షణ తప్పదు

రేపు జనవరి నెలతో హనుమాన్ వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోతాయి. హీరో తేజ సజ్జ నుంచి మిరాయ్ వచ్చింది కానీ దర్శకుడు ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో మరో సినిమా ఇప్పటిదాకా మొదలుకాలేదు. నందమూరి మోక్షజ్ఞ డెబ్యూ మూవీ అన్నీ ఓకే అనుకున్నాక ఆగిపోవడం ఊహించని ట్విస్టు. ఒకవేళ అనుకున్నట్టే సవ్యంగా జరిగి ఉంటే ఇప్పటికో పాతిక శాతం పూర్తయ్యేది. రణ్వీర్ సింగ్ తో బాలీవుడ్ సినిమా సైతం ఫోటో షూట్ తర్వాత క్యాన్సిల్ కావడం ఇంకో పరిణామం. ఇన్ని హెచ్చుతగ్గుల మధ్యలోనూ ప్రశాంత్ వర్మ తన నిర్మాణ పర్యవేక్షణలో మహా కాళీ, అధీర అనే రెండు సూపర్ హీరో మూవీస్ తీస్తున్నాడు. ఇక ప్రశాంత్ వర్మ భుజాల మీద ఉన్న అతి పెద్ద బాధ్యత జై హనుమాన్. ప్రకటించి నెలలు గడిచిపోతున్నప్పటికీ ఇంకా సెట్స్ పైకి వెళ్ళకపోవడంతో ఫ్యాన్స్ అనుమానపడిన సందర్భాలు లేకపోలేదు. కాంతార చాప్టర్ 1 ప్రమోషన్లలో హీరో రిషబ్ శెట్టి దానికి క్లారిటీ ఇచ్చాడు. కాంతార మీద పూర్తి దృష్టి పెట్టడం వల్ల పారలల్ గా జై హనుమాన్ చేసే అవకాశం లేకపోయిందని, స్క్రిప్ట్ చెప్పినప్పుడు తాను స్పెల్ బౌండ్ అయ్యానని, ఎప్పుడెప్పుడు మొదలుపెట్టాలని ఎదురు చూస్తున్నానని అన్నాడు. అంటే ఇంకో నెల రెండు నెలల్లో స్టార్ట్ కావొచ్చు. అయితే జై హనుమాన్ కోసం కాస్త ఎక్కువ నిరీక్షణ తప్పేలా లేదు. ఎందుకంటే అక్టోబర్ లేదా నవంబర్ లో జై హనుమాన్ చిత్రీకరణ మొదలైనా పూర్తయ్యేనాటికి కనీసం ఏడాది పడుతుంది. ఆపై పోస్ట్ ప్రొడక్షన్లు, విఎఫ్ఎక్స్ లు, మార్కెటింగ్, ప్రమోషన్లు వగైరాలు ఎక్కువ సమయం డిమాండ్ చేస్తాయి. అంటే 2027 సంక్రాంతికి కూడా డౌటే. పైగా రిషబ్ శెట్టి కేవలం జై హనుమాన్ కు మాత్రమే కమిట్ మెంట్ ఇవ్వలేదు.



## అమీషా పటేల్ సంచలన స్టేట్‌మెంట్!


ఒకప్పటి స్టార్ హీరోయిన్ అమీషా పటేల్50 ఏళ్లు వచ్చినప్పటికీ బ్యాచ్‌లర్ లైఫ్ లీడ్ చేస్తోంది. పెళ్లి చేసుకోకుండా వరుస చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది.ఎంత బిజీగా ఉన్నప్పటికీ పలు ఇంటర్వ్యూలో పాల్గొంటూ వార్తల్లో నిలుస్తోంది. ఈక్రమంలో.. గత కొద్ది కాలంగా ఈ అమ్మడు పెళ్లి చేసుకోబోతుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అమీషా పటేల్ ఓ హీరోపై షాకింగ్ కామెంట్స్ చేసింది. "హాలీవుడ్ సూపర్ స్టార్ టామ్ క్రూజ్ అంటే నాకు పిచ్చి. ఎవరైనా అతనితో పాడ్‌కాస్ట్ చేయగలిగితే.. దయచేసి నన్ను కూడా పిలవండి. నా చిన్నప్పటి నుంచి నాకు టామ్ క్రూజ్ అంటే చాలా ఇష్టం. నా ఫైల్స్‌లో కూడా అతని ఫొటో ఉండేది. నా గదిలో ఉన్న ఏకైక పోస్టర్ అతనిదే. టామ్ క్రూజ్ ఎప్పటికీ నా ఫస్ట్ క్రష్. నేను అతని కోసం ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాను. ఏకంగా అతనితో ఒక రాత్రి గడపడానికి కూడా వెనకాడను. ఒకవేళ నాకు అవకాశం వస్తే పెళ్లి కూడా చేసుకుంటాను. అతనికి అంత పెద్ద అభిమానిని నేను ఎందుకో కారణం తెలియదు. కానీ ఆయన అంటే పడిచచ్చిపోతాను" అని అందరికీ షాకిచ్చింది. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి. ఈ అమ్మడు అంత ఒపెన్ కావడంతో అంతా షాక్ అవుతూ పలు రకాలుగా స్పందిస్తున్నారు.

## బికిని ఫొటోలపై సాయి పల్లవి క్లారిటీ



పద్ధతైన పాత్రలు, అద్భుతమైన డ్యాన్సులు, క్లాసీ లుక్ వీటి గురించి మాట్లాడుకోగానే మొదట గుర్తుకు వచ్చేది హీరోయిన్ సాయి పల్లవి. సాంప్రదాయ లుక్‌లో కనిపిస్తూ కోట్లాది మంది ఫ్యాన్స్‌ను తన సొంతం చేసుకున్న ఈ బ్యూటీకి సంబంధించి లేటెస్ట్‌గా బికిని ఫొటోలు వైరల్ అయ్యాయి. తన సోదరితో విదేశాలకు వెకేషన్‌కు వెళ్ళిన ఈ మలయాళ ముద్దుగుమ్మ.. బికినీ ధరించినట్లు కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ హాట్ టాపిక్‌గా మారాయి. ఇక ఈ ఫోటో చూసిన ఆమె అభిమానులు.. తలలు పట్టుకుంటున్నారు. ఇవి నిజమైన ఫొటోలు కాకపోవచ్చు, ఎఐ ద్వారా క్రియేట్ చేసినవి కావచ్చు అంటూ భిన్న అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. తాజాగా వీటిపై ఇన్‌డైరెక్ట్‌గా క్లారిటీ ఇస్తూ సాయి పల్లవి ఓ పోస్ట్ పెట్టింది. ట్రిప్‌కు సంబంధించిన పూర్తి వీడియోను షేర్ చేస్తూ.. 'పైన కనిపిస్తున్నవన్నీ నిజంగా తీసిన ఫొటోలు.. ఏఐ ఫొటోలు కాదు' అనే క్యాప్షన్ ఇచ్చింది. దీంతో.. ఆమె షేర్ చేసిన వీడియోలో బికిని ఫొటోలు లేకపోవడంతో.. బికిని ఫొటోలు ఏఐవి.. ఇప్పుడు తను షేర్ చేసినవి నిజమైనవి అంటూ క్లారిటీ ఇచ్చింది. దీంతో ఆమె బికిని ధరించలేదు అని క్లారిటీ రావడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు.

## 'కొత్తలోక' సీక్వెల్.. వీడియోతో ప్రకటన



మలయాళంలో తెరకెక్కిన 'కొత్తలోక: చాప్టర్1' కాసుల వర్షం కురిపించింది. అయితే, ఈ సినిమాకు సీక్వెల్‌ను తాజాగా మేకర్స్ ప్రకటించారు. ఈ క్రమంలోనే ఒక వీడియోను పంచుకున్నారు. రూ. 30 కోట్లతో చిన్న సినిమాగా విడుదలైన కొత్తలోక ఏకంగా రూ. 267 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటేసి రికార్డ్ క్రియేట్ చేసింది. అత్యధిక వసూళ్లు రాబట్టిన మలయాళ చిత్రంగా నిలిచింది. దేశంలోనే మొదటి ఫీమేల్ సూపర్ హీరో సినిమాగా రికార్డ్ క్రియేట్ చేసింది. మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ సినిమాను దర్శకుడు డామినిక్ అరుణ్ తెరకెక్కించారు. ఇందులో కల్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో నటించారు. కొత్తలోక చాప్టర్1లో టొవినో థామస్, దుల్కర్ సల్మాన్ అతిథి పాత్రల్లో మెరిశారు. అయితే, సీక్వెల్‌లో వీరి పాత్ర కీలకం కానున్నట్లు తెలుస్తోంది. తాజాగా విడుదలైన పార్ట్2 వీడియోలో వారిద్దర మధ్య జరిగిన సంభాషణను చూపించారు. సీక్వెల్‌ను కూడా డామినిక్ అరుణ్ తెరకెక్కించనున్నట్లు ప్రకటించారు. తాజాగా విడుదలైన ప్రత్యేక ప్రోమో అభిమానులను మెప్పిస్తుంది. షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. విడుదల తేదీ, నటీనటుల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.



## ప్రేమ మాయాజాలాన్ని అనుభూతి చెందండి

బాలీవుడ్ యంగ్ బ్యూటీ సోనమ్ బజ్వా బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో తీరక లేకుండా గడుపుతోంది. ప్రస్తుతం ఈ అమ్మడు నటిస్తున్న సినిమాల్లో 'నిక్కాజలిదార్-4' ఒకటి. ఈ సినిమా 'నిక్కాజలిదార్-3'కు సీక్వెల్‌గా రాబోతుంది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి సిమెర్జిత్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. రెజ్లింగ్ పై ఆసక్తి లేని ఓ పంజాబీ వ్యక్తి, ఉత్సాహభరితమైన హర్యాన్వీ స్త్రీని కలిస్తాడు. పరిచయం కాస్త ప్రేమగా మారిన తర్వాత తన ప్రపంచం మారిపోయినట్లుగా గ్రహిస్తాడు. వారు ప్రేమలో పడిన తర్వాత ఏం జరిగింది ఎలాంటి.. ప్రమాదాలు ఎదుర్కొన్నారనేది ఈ మూవీ కథ. దీనిని గుర్బీర్ సింగ్ సిద్దూ, మన్మోర్డ్ సిద్దూ, అమ్నీత్ షేర్ సింగ్, రాంనీత్ షేర్ సింగ్ నిర్మిస్తున్నారు. ఇందులో సోనమ్ అమ్మీ విర్క్, నిర్మల రిషి, నిషా బానో, సోనియా కౌర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన సోనమ్ వరుస అప్డేట్స్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈక్రమంలో.. తాజాగా, సోనమ్ బజ్వా 'నిక్కాజలిదార్-4'చిత్రానికి సంబంధించిన ఓ ప్రేమ పాట రాబోతున్నట్లు ప్రకటించింది. "సెప్టెంబర్ 28న విడుదలవుతున్న మా సినిమా పాటతో ప్రేమ మాయాజాలాన్ని అనుభూతి చెందండి. మీ హృదయాన్ని వెచ్చదనంతో నింపే మనోహరమైన ఈ సాంగ్‌ను మీ ప్లే లిస్ట్‌లో చేర్చుకోండి" అనే క్యాప్షన్ జత చేసింది.




## దేవర వార్షికోత్సవం.. ఫ్యాన్స్ కోసం స్పెషల్ షో

జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన దేవర చిత్రం నేటికి ఏడాది పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రబృందానికి వార్షికోత్సవం శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు చిత్రబృందం కూడా దేవర వన్ ఇయర్ పూర్తి చేసుకున్న సందర్భంగా దేవర 2 త్వరలోనే సెట్స్ మీదకి వెళ్లబోతున్నట్లు ప్రకటించింది. అయితే ఈ సినిమా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా అభిమానుల కోసం చిత్రబృందం స్పెషల్ షోని ఏర్పాటు చేసింది. కూకట్‌పల్లిలోని అర్జున్ థియేటర్‌లో రాత్రి 9 గంటలకు దేవర సినిమాను ప్రదర్శించబోతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమాకు కొరటాల శివ దర్శకత్వం వహించగా.. జాన్వీ కపూర్ కథానాయికగా నటించింది. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటించాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com